RNI NO. TELTEL/2006/17406

విలేకరులు కావలెను
అన్ని జిల్లాల నుండి నిఘానేత్రం దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఆసక్తి కలవారు ఈ క్రింది నంబర్‌కు సంప్రదించగలరు.
ఫోన్ - 9440090053

నిఘానేత్రం
తెలుగు దినపత్రిక
NEEGHANETHRAM NEWS
నిజామాబాద్, హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్ సంపుటి : 21 సంచిక : 43 పబ్లిషర్ - కోయల్‌కర్ రామ్ దయానంద్ శనివారం 28 సెప్టెంబర్ 2024 పేజీలు : 12 వెల : రూ. 2/-




# 'గృహాయోగం'

## ఒకేసారి 10 లక్షల ఇందిరమ్మ ఇళ్లు..

## మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్న రేవంత్ సర్కార్!

## లబ్ధిదారులను ఎంపిక చేసేది వీరే!!

హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు కొన్ని ప్రధాన హామీలు ఇచ్చింది. వాటిలో ముఖ్యమైంది. ఇందిరమ్మ ఇళ్లు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నారు. వారికి రేవంత్ సర్కారు త్వరలో శుభవార్త చెప్పబోతోందని తెలుస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో భాగంగా.. మొదటి దశలోనే ఒకేసారి 10 లక్షల ఇళ్లను మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం.

**వైఎస్సార్ మార్క్‌ను దాటేలా..** ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. 2004 నుంచి 2009 వరకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 15 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అయితే.. ఆ మార్కును దాటాలని రేవంత్ రెడ్డి ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. అందుకే మొదటి దశ లోనే ఒకేసారి 10 లక్షల ఇళ్లను మంజూరు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం.

**పారదర్శకంగా ఎంపిక..** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. అందుకే లబ్ధిదారుల ఎంపికకు గ్రామ స్థాయిలోనే కమిటీలు ఏర్పాటు చేయాలని సీఎం అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. గ్రామాల్లోని అంగన్‌వాడీ, ఆశ, గ్రామ కార్యదర్శి తోపాటు.. స్థానికంగా ఉండే వారితో కలిపి కమిటీలను నియమించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు గృహ నిర్మాణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ కమిటీలు ఇచ్చే నివేదిక ఆధారంగా.. మండల స్థాయిలో ఎంపీడీవోలు తుది నిర్ణయం తీసుకొని లబ్ధిదారుల తుది జాబితా ఖరారు చేస్తారని అంటున్నారు.

**త్వరలో మార్గదర్శకాలు విడుదల..** మరి కొన్ని రోజుల్లో లబ్ధిదారుల ఎంపికకు మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్టు తెలుస్తోంది. అయితే.. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం.. దసరా పండుగకు ముందే మార్గదర్శకాలు విడుదల చేయాలని ఆదేశించినట్టు సమాచారం. దీంతో అధికారులు ఇందిరమ్మ ఇళ్లపై వేగంగా అడుగులు ముందుకేస్తున్నారు. దసరా నాటికి స్వయంగా రేవంత్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్ల పై ప్రకటన చేసే అవకాశం ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒకరు 'హిందుస్తామ్ టైమ్స్ తెలుగు' ప్రతినిధితో మాట్లాడుతూ చెప్పారు. గత ఏడాది డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమం చేపట్టింది తెలంగాణ ప్రభుత్వం. గ్యారెంటీ పథకాల కోసం మొత్తం 1,25,84,383 దరఖాస్తులు అందాయి. వీటిలో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం అప్లికేషన్స్ అందిన సంగతి తెలిసిందే. గత ప్రభుత్వంలో ఇచ్చిన గృహలక్ష్మి దరఖాస్తులను కాంగ్రెస్ సర్కార్ రద్దు చేయడంతో.. వారంతా తిరిగి దరఖాస్తు చేసుకున్నారు. వీటి సంఖ్య 80 లక్షలకు పైగా ఉంది. ఈ స్కీమ్ కింద గృహ నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని అందిచనుంది. ఈ నేపథ్యంలో ఈ స్కీమ్ పకడ్బందీగా అమలు చేయాలని చూస్తోంది ప్రభుత్వం. అయితే ఒకే ఆధార్ నెంబర్ తో వేర్వురు ప్రాంతాల్లో చేసిన దరఖాస్తులను గుర్తించేందుకు కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవలను వినియోగించుకున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ఏదో ఒక చోట స్వీకరించిన దరఖాస్తును మాత్రమే పరిగణలోకి తీసుకునే అవకాశం ఉంటుంది.

## పేదల కన్నీళ్లతో అడుకుంటే రేవంత్ ప్రభుత్వానికి పతనం తప్పదు..



## ఈటల రాజేందర్ మాస్ వార్నింగ్

హైదరాబాద్: హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి సర్కార్ డ్రామాలు ఆడుతోందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శలు చేశారు. ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. హైడ్రాను నియమించిన రోజే ఇది డ్రామా అని చెప్పానని అన్నారు. హైడ్రా అధికారులు చెబుతున్న లెక్కల ప్రకారం చెరువులు, కుంటలు చుట్టూ ఉంది.. ప్రభుత్వ భూమి కాదని స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న పేదల ఇళ్లను కూల్చవద్దని ఎంపీ ఈటల రాజేందర్ కోరారు. చైతన్యపురి డివిజన్ న్యూ మారుతి నగర్ మూసీ పరిసర ప్రాంతాల్లో ఈటల రాజేందర్ ఇవాళ(శుక్రవారం) పర్యటించి బాధితులకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ... పేదలపై కనికరం లేకుండా రేవంత్ ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ధ్వజమెత్తారు. జొన్నల బండ వద్ద మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చారని వాటిని కూడా కూల్చేందుకు రేవంత్ ప్రభుత్వం పనులు చేస్తుందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మూసీని సుందరీకరణ చేస్తే తమకు ఇబ్బంది లేదు... కానీ ఎన్నడో భూమి కొన్న వారు ఇప్పటికీ ఈఎంఐలు కడుతున్నారని తెలిపారు. లక్షలు పెట్టి కొన్న ఇళ్లకు డబుల్ బెడ్ రూం ఇస్తామనడం కరెక్ట్ కాదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈ ప్రాంతాల్లో ఏనాడూ మూసీ నుంచి వరద నీరు రాలేదని తెలిపారు. హైడ్రా పేరుతో రేవంత్ ప్రభుత్వం బస్తీ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోందని ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ మాటలు నమ్మినందుకు ప్రజలకు ప్రశాంతత లేకుండా చేస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు.

**ఖబడ్దార్ రేవంత్..** ప్రజలను ఇబ్బంది పెట్టే పనులు రేవంత్ సర్కార్ మానుకోవాలని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వానికి ఈ అంశంపై నివేదిక ఇస్తామని అన్నారు. చట్టాలు, జడ్జీల మీద నమ్మకం లేకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రేవంత్ జాగిర్ కాదని... ప్రజలు ఓట్లు వేస్తే సీఎం అయ్యారని ఆ విషయం గుర్తుపెట్టుకుని మసలుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు.

## పొంగులేటి నివాసాల్లో ఈడీ అధికారుల సోదాలు



హైదరాబాద్: తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన అధికారుల బృందం ఏకకాలంలో 15 చోట్ల తనిఖీలు చేస్తోంది. గత ఎన్నికల సమయంలో పొంగులేటి శ్రీనివాస రెడ్డి నివాసాల్లో అధికారులు సోదాలు చేపట్టారు.

**15 బృందాలు :** జూబ్లీహిల్స్‌లోని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇంట్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. హిమాయత్ సాగర్‌లో గల ఫామ్ హౌస్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూతురు, బంధువుల ఇళ్లలో రైడ్స్ కొనసాగుతున్నాయి. పొంగులేటి శ్రీనివాస రెడ్డికి చెందిన రాఘవ కన్ స్ట్రక్షన్స్ ఇన్ ఫ్రా కార్యాలయాల్లో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. కంపెనీ ఎండీ, డైరెక్టర్ల నివాసాలు, కార్యాలయాల్లో 15 బృందాలు తనిఖీలు చేపట్టింది.

**ఖమ్మంలో ఇంటిలో కూడా :** ఖమ్మంలో ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ ఇంటిలో రైడ్స్ కొనసాగుతున్నాయి. ఢిల్లీ జోనల్ అధికారులు తనిఖీలు చేపట్టారని తెలిసింది. నారాయణ పేట- కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రాఘవ కన్ స్ట్రక్షన్ కంపెనీ దక్కించుకుంది. దీనికి సంబంధం లేదని తెలుస్తోంది. గత ఎన్నికలకు ముందు కూడా పొంగులేటి ఇళ్లు, కార్యాలయాలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఇప్పుడు జరుగుతున్న రైడ్స్ దానికి కొనసాగింపు అని తెలుస్తోంది.

**పొంగులేటి హర్ష పేరుతో భారీగా ఆస్తులు :** పొంగులేటి శ్రీనివాస రెడ్డి కుమారుడు హర్ష రెడ్డి చిన్న వయస్సులోనే బిలియనీర్‌గా మారారు. రాఘవ కన్ స్ట్రక్షన్స్ వ్యవహారాలను ఆయనే పర్యవేక్షిస్తున్నారు. హర్ష రెడ్డి పేరుతో రూ.1300 కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఇది చర్చానీయాంశం అవుతుంది. ఆ క్రమంలో వరసగా ఈడీ రైడ్స్ జరగడం చర్చకు దారితీస్తోంది.

## కాంగ్రెస్ ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మిస్తే.. గత ప్రభుత్వం అమ్ముకుంది: మంత్రి పొన్నం



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మిస్తే.. గత ప్రభుత్వం రూ. 7,380 కోట్లకు అమ్ముకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. భారాస హయాంలో హైదరాబాద్‌పై పెట్టిన ఖర్చు వివరాలపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చే ప్రయత్నం చేశారా?అని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్నా వాటర్ లాగింగ్ సెంటర్లు అలాగే ఉన్నాయన్నారు. పాతబస్తీలో మెట్రోరైలు నిర్మాణాన్ని అడ్డుకున్నారని విమర్శించారు. 'మూసీ' నిర్వాసితులకు అన్యాయం చేస్తున్నారన్న ప్రతిపక్షం ఆరోపణలను మంత్రి ఖండించారు.

# మోదీ దీపావళి కానుక!

## పెట్రో ధరల తగ్గింపు!!




వాహనదారులు గత కొంతకాలంగా పెట్రోల్ ,డీజిల్ ధరలు అధికంగా ఉండడంతో ఎక్కడికి వెళ్లాలన్న కాస్త ఆలోచిస్తూ ఉన్నారు. గ్యాస్ ధరలు కూడా ప్రజలకు గుదిబండ లాగా మారుతున్నాయి. గత కొద్ది రోజుల నుంచి పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు కేంద్రం తగ్గిస్తోందనే వార్తలు అయితే వినిపిస్తున్నాయి. అయితే ఇప్పుడు తాజాగా మరొకసారి పెట్రోల్, డీజిల్ ధరల పైన కేంద్ర ప్రభుత్వం దీపావళికి మరో గుడ్ న్యూస్ చెప్పబోతోంది అన్నట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. నిజానికి పెట్రోల్ ,డీజిల్ ధరలు అంతర్జాతీయ క్రూడాయిల్ ధరలపైన ఆధారపడి ఉంటాయని చెప్పవచ్చు. క్రూడాయిల్ ధరలు కూడా భారీగా తగ్గడంతో చమురు సంస్థల వద్ద భారీగానే నిలువ ఉండడంతో కొన్ని వారాల క్రితం బ్యారెల్ చమురు ధర 80 డాలర్లకు ఉండగా ప్రస్తుతం 70 డాలర్లకు పడిపోయినట్లు సమాచారం. అందుకే గత నెల రోజుల నుంచి అంతర్జాతీయంగా మార్కెట్లో కూడా క్రూడాయిల్ ధరలు తగ్గుతూ వస్తున్నాయట. దీంతో ఇండియాలో కూడా డీజిల్, పెట్రోలు పైన రూ 3 రూపాయల వరకు తగ్గించే అవకాశం ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పెట్రోల్ ,డీజిల్ పైన కూడా రేటు తగ్గించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. అంతర్జాతీయ రేటుతో పోలిస్తే.. పెట్రోల్ పైన రూ.15 రూపాయలు డీజిల్ పైన రూ .12 రూపాయలు వ్యత్యాసం ఉంటుంది అంటూ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గిరీష్ కుమార్ తెలియజేశారు. అంతర్జాతీయ రేట్లను ఉద్దేశించి దేశవ్యాప్తంగా ఇంధన ధరలను సవరించాలని విషయం పైన 2021 నుంచి పోరాడుతూనే ఉన్న చమురు సంస్థలు ఏమాత్రం సహకరించడం లేదట. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాలలో 100 రూపాయలకు పైగా రేట్లు ఎక్కువగా ఉన్నాయి. కొన్ని ప్రాంతాలలో వంద రూపాయలని కూడా దాటేశాయి. మరి దీపావళి రోజున కేంద్రం ఏదైనా గుడ్ న్యూస్ ఉంటుందో లేదో చూడాలి మరి.




## విచారణకు హాజరు కావాలి.. హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం


హైదరాబాద్: అమీన్‌పూర్ చెరువుకు సంబంధించిన కేసు విషయంలో విచారణ చేపట్టిన హైకోర్టు.. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు నోటీసులు జారీ చేసింది. హైడ్రా కమిషనర్ సోమవారం విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. అమీన్‌పూర్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని ఇటీవల ఓ భవనాన్ని హైడ్రా సిబ్బంది కూల్చివేశారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని చెప్పినా పట్టించుకోకుండా కూల్చేశారని బాధితుడు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై హైడ్రా కమిషనర్ వివరణ ఇవ్వాలని సూచించిన హైకోర్టు.. నేరుగా లేదా ఆన్‌లైన్ విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.

## చదరంగ విజేతలకు రూ.25 లక్షల నజరానా ప్రకటించిన సీఎం




హైదరాబాద్ : చెస్ ఒలింపియాడ్‌లో స్వర్ణపతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రూ. 25 లక్షల చొప్పున ప్రోత్సాహకాలను ప్రకటించారు. భారతదేశం తరపున తొలిసారి స్వర్ణపతకాలు సాధించిన క్రీడాకారులు అర్జున్, ద్రోణవల్లి హారిక జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని అభినందించిన సీఎం.. రూ. 25 లక్షల చొప్పున నజరానా ప్రకటించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు చదరంగ విజేతలను అభినందించారు.

## పురాతన మెట్ల బావులకు మహర్దశ.. సీఐఐతో పర్యాటకశాఖ ఒప్పందం



హైదారబాద్: నగరంలోని పురాతన మెట్ల బావుల పునరుద్ధరణకు ముందడుగు పడింది. సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మెట్ల బావుల పునరుద్ధరణకు సంబంధించి సీఐఐ, పర్యాటకశాఖ మధ్య ఒప్పందం కుదిరింది. ఓయూలోని మహాలఖా మెట్ల బావి పునరుద్ధరణకు ఇన్ఫోసిస్, సాలార్‌జంగ్, అమ్మపల్లి బావులు భారత్ బయోటెక్, అడిక్‌మెట్ మెట్ల బావిని దొడ్ల డైరీ, ఫలక్‌నుమా మెట్ల బావిని టీజీ ఆర్టీసీ, రెసిడెన్సీ మెట్ల బావిని కోఠి ఉమెన్స్ కాలేజీ పునరుద్ధరించనున్నాయి. పురాతన మెట్ల బావులకు పూర్వ వైభవం తెచ్చే విధంగా ఆయా సంస్థలు కృషి చేయనున్నాయి.

## రుణమాఫీ చేయకపోతే సచివాలయం ముట్టడిస్తాం: హరీశ్‌రావు



సిద్దిపేట: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతు విలువ తగ్గిందని భారాస ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. రుణమాఫీ డిమాండ్‌తో సిద్దిపేటలోని నంగనూరులో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాళేశ్వరం కూలిందన్న సీఎం.. ఇప్పుడు ఆ ప్రాజెక్టును సందర్శించాలని డిమాండ్ చేశారు. “అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ అబద్ధమాడింది. ఎక్కడ నిద్రపోతున్నానని రేవంత్‌రెడ్డి నన్ను ప్రశ్నిస్తున్నారు. నేను రేవంత్‌రెడ్డి గుండెల్లో నిద్రపోతున్నా. ఆయన ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి. రాబోయే రోజుల్లో కేసీఆర్ నేతృత్వంలో అసెంబ్లీని స్తంభింపజేస్తాం. దసరా పండగలోపు రుణమాఫీ చేయకపోతే సచివాలయం ముట్టడిస్తాం”అని హరీశ్‌రావు హెచ్చరించారు.

## లక్ష ఇళ్లు రాత్రికి రాత్రే ఎక్కడి నుంచి పుట్టుకొచ్చాయి?: కేటీఆర్



హైదరాబాద్: తమ పార్టీ విధానం నిర్మాణం.. కాంగ్రెస్‌ది విధ్వంసమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. తాము నిర్మిస్తే.. కాంగ్రెస్ కూల్చేస్తోందన్నారు. హైడ్రా కూల్చివేతలు, రెండు పడక గదుల ఇళ్లపై ఆయన వ్యాఖ్యలు చేశారు. ఈమేరకు ‘ఎక్స్’ వేదికగా పోస్టు చేశారు. “భారాసది నిర్మాణం.. కాంగ్రెస్‌ది విధ్వంసం. మా హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టలేదని మభ్యపెట్టారు. మేం కట్టిన ఇళ్లనే మూసీ బాధితులకు కేటాయిస్తున్నారు. లక్ష ఇళ్లు రాత్రికి రాత్రే ఎక్కడి నుంచి పుట్టుకొచ్చాయి? మహానగరంలో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించాం. కాంగ్రెస్ విష ప్రచారాలు అబద్ధాలు అనడానికి మరో సాక్ష్యమిదే” అని కేటీఆర్ పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో పోస్టర్లు, బ్యానర్లు, కటౌట్లపై నిషేధం: జీహెచ్ఎంసీ




హైదరాబాద్: నగరంలో పోస్టర్లు, బ్యానర్లు, కటౌట్లపై జీహెచ్ఎంసీ నిషేధం విధించింది. వాల్ పోస్టర్లతోపాటు గోడలపై రాతలను కూడా నిషేధించింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలీ ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## డిప్యూటీ సీఎం భట్టి ఇంట్లో చోరీ.. ఖరగ్‌పూర్‌లో ఇద్దరి అరెస్ట్



ఖరగ్‌పూర్: తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంట్లో చోరీ కేసులో పశ్చిమ్‌బెంగాల్ పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఖరగ్‌పూర్ జీఆర్పీ ఎస్పీ దేబశ్రీ సన్యాల్ వెల్లడించారు. ఖరగ్‌పూర్ రైల్వేస్టేషన్‌లో ఏడో నంబర్ ప్లాట్‌ఫాంపై జీఆర్పీ పోలీసుల తనిఖీలు నిర్వహించారు. అక్కడ అనుమానాస్పదంగా కనిపించిన రోషన్‌కుమార్ మండల్, ఉదయ్‌కుమార్ ఠాకూర్‌ను విచారించారు. వీరిద్దరూ భట్టి విక్రమార్క విదేశీ పర్యటనలో ఉండగా ఆయన ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితులుగా గుర్తించారు. వారి నుంచి బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు బిహార్‌కు చెందిన వారని ఎస్పీ వెల్లడించారు. దీనిపై తెలంగాణ పోలీసులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు.




హైదరాబాద్: ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు.. హైదరాబాద్ నుంచి అయోధ్య, కాన్పూర్, ప్రయాగరాజ్ ప్రాంతాలకు విమాన సర్వీసులు నేడు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్–కాన్పూర్, హైదరాబాద్–అయోధ్య మధ్య వారానికి 4 రోజుల సర్వీసును, రేపటి(సెప్టెంబర్ 28) నుంచి హైదరాబాద్–ప్రయాగరాజ్, హైదరాబాద్–ఆగ్రా మధ్య వారానికి 3 రోజుల సర్వీసును ప్రారంభించనున్నారు. హైదరాబాద్ నగరం నుంచి ఇలా ఒక్క నెలలోనే 7 నూతన సర్వీసులను ప్రారంభించడంపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

ఈ నూతన సర్వీసులు ఆయా నగరాల మధ్య ప్రయాణికుల డిమాండ్‌ను నెరవేరుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కొత్త సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.




నర్సాపూర్: మెదక్ జిల్లాలో నర్సాపూర్ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. పట్టణ శివారులోని క్లాసిక్ గార్డెన్ వద్ద బీవీఆర్ఐటీ కళాశాలకు చెందిన రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. డ్రైవర్లు బస్సుల్లో ఇరుక్కుపోవడంతో బయటకు తీయడానికి శ్రమించాల్సి వచ్చింది. వారిలో నాగరాజు (50) మృతిచెందారు. 20 మందికి పైగా విద్యార్థులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఆస్పత్రులకు తరలించారు.

ఘటనాస్థలానికి నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి, ఎస్సై లింగం చేరుకుని పరిశీలించారు. ఈ ప్రమాదంతో నర్సాపూర్– సంగారెడ్డి మార్గంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు, కళాశాల సిబ్బంది చర్యలు చేపట్టారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో ప్రజలను బెంబేలెత్తిస్తోంది : ఎంపీ డీకే అరుణ



హైదరాబాద్ : కాంగ్రెస్ అధిష్ఠానానికి డబ్బుల సంచులను సమకూర్చడమే హైడ్రా లక్ష్యమని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. ప్రజల దృష్టి మరల్చడానికే రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను తెరపైకి తెచ్చిందని విమర్శించారు. స్థానికులను ఒక్కసారిగా నిరాశ్రయులను చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం ప్రజలను బెంబేలెత్తిస్తోందని, హైదరాబాద్ అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు రావాలంటే పెట్టుబడిదారులు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు మించిన అవినీతిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే దోపిడీని ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు. అడ్డగోలుగా టెండర్లు కట్టబెట్టి ప్రాజెక్టులు కేటాయిస్తున్నారన్నారు. వక్ఫ్ చట్టం 2024 సవరణ బిల్లుపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ ఇప్పటికే పలు రాష్ట్రాల్లో పర్యటించిందని.. అందులో భాగంగా శనివారం హైదరాబాద్‌కు రానున్నట్లు చెప్పారు.




కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ ప్రశంసలు కురిపించారు. ఆయన ఎంతో ధైర్యవంతుడైన రాజకీయ నాయకుడని అన్నారు. ప్రజల్లో తన ఇమేజ్‌ను మరింత పెంచుకునేందుకు రాహుల్ తనను తాను ఎంతో సంస్కరించుకున్నారని పేర్కొన్నారు.

ఓ జాతీయ మీడియా నిర్వహించిన చర్చా వేదికలో సైఫ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నేతల గురించి చర్చ రాగా.. ‘ఎలాంటి నాయకుడిని ఇష్టపడతారు?’ అంటూ వ్యాఖ్యాత అడిగారు. దీనికి సైఫ్ బదులిస్తూ.. ‘ధైర్యంగా, నిజాయతీగా ఉండే రాజకీయ నాయకులంటే ఇష్టం’ అని చెప్పారు. అప్పుడు వ్యాఖ్యాత కొందరు పేర్లను సూచించారు. ‘ప్రధాని మోదీ, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ’లో ఎవరిని ఎంచుకుంటారని అడిగారు. దీనికి సైఫ్ స్పందిస్తూ.. “వాళ్లంతా ధైర్యవంతులైన రాజకీయ నాయకులే. అయితే, రాహుల్‌గాంధీ తీరు నన్ను కాస్త ఎక్కువగా ఆకట్టుకుంటోంది. గతంలో ఆయన చేసే పనులను, చెప్పే మాటలను కొంతమంది అగౌరవపర్చిన సందర్భాలున్నాయి. అలాంటి స్థితి నుంచి ఆయన తనను తాను ఎంతగానో మార్చుకున్నారు. ప్రజల్లో ఆదరణ చూరగొనేందుకు చాలా కష్టపడ్డారు. ఆ ప్రయాణం చాలా ఆసక్తిగా అనిపిస్తోంది” అని సైఫ్ చెప్పారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తాజాగా ‘దేవర’ సినిమాలో భైర పాత్రలో ఆకట్టుకున్నారు సైఫ్. ఎన్టీఆర్ అడ్డు తొలగించుకొని సంద్రాన్ని శాసించాలనుకొనే పాత్రలో ప్రేక్షకులను మెప్పించారు. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం నేడు విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఎన్టీఆర్, సైఫ్‌ల మధ్య యాక్షన్ సన్నివేశాలు మరో స్థాయిలో ఉన్నాయనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.

## ఈనెల 30న భాజపా రైతు రుణమాఫీ అమలు సాధన దీక్ష



హైదరాబాద్ : ఈ నెల 30న ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద భాజపా 24 గంటల రైతు రుణమాఫీ అమలు సాధన దీక్ష చేపట్టనుంది. ఇందిరా పార్క్ వద్ద చేయనున్న దీక్షా స్థలిని భాజపా శాసన సభా పక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, ఎన్వీ సుభాష్, పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్‌లో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను తుంగలో తొక్కిందని భాజపా నేతలు విమర్శించారు. రైతు రుణమాఫీపై సీఎం, మంత్రులు విరుద్ధ ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగిందంటే, మంత్రులు మరికొంతమందికి చేస్తామని చెబుతున్నారన్నారు. రైతు భరోసా ఊసే లేదు. వడ్లకు బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌలు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేసిందని దుయ్యబట్టారు. భాజపా చేసే పోరాటానికి రైతులు పెద్ద సంఖ్యలో మద్దతు తెలపాలని కోరారు.

# సంపాదకీయం

## కేసులు పెట్టించుకున్నా.. పదవులు దక్కలేదు.. రీజనేంటి..!

తాజాగా నామినేటెడ్ పదవుల పందేరం ప్రారంభమైంది. కూటమి సర్కారు వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు పదవుల విషయంపై పెద్ద ఎత్తున నాయకులు ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా టీడీపీ తరఫున ఎక్కువ మంది పదవులు దక్కుతాయని లెక్కలు వేసుకున్నారు. దీనికి ప్రాతిపదికగా.. ఎవరు ఎక్కువ కేసులు పెట్టించుకుంటే.. వారికే పదవులు దక్కుతాయన్న ప్రచారం కూడా జరిగింది. దీంతో వైసీపీ హయాంలో జగన్ సర్కారుపై పోరాటం చేసిన నాయకులు పదవుల కోసం ఎదురు చూశారు. అయితే.. తాజాగా ప్రకటించిన 20 పదవుల్లోనూ.. పోరాట నాయకులకు అవకాశం పెద్దగా చిక్కలేదు. దీంతో వారంతా ఇప్పుడు చంద్రబాబు వైఖరిపై రగిలిపోతున్నారు. దీనిని పసిగట్టిన సీఎం.. వారిని ఉద్దేశించి హె చ్చరికలు జారీ చేస్తున్నారు. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచిస్తున్నారు. ఇక, ఇప్పటికిప్పుడు వారు ఎలాంటి నిర్ణయం తీసుకునే అవకాశం కూడా కనిపించడం లేదు. అయితే.. అంతర్గతంగా పార్టీలో మాత్రం వారు రుసరుసలాడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఉదాహరణకు విజయవాడకు చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు నామినేటెడ్ పదవులపై భారీ ఆశలు పెట్టుకున్నారు. వీరిలో ఒకరు కొమ్మారెడ్డి పట్టాభిరాం. అప్పట్లో సీఎం జగన్‌పై తీవ్ర పదజాలంతో విరుచు కుపడిన నాయకుడిగా.. రాష్ట్ర వ్యాప్తంగా పట్టాభి పేరు మార్మోగింది. ఈ పరిణామమే టీడీపీ ఆఫీసుపై వైసీపీ నేతలు దాడి చేసేందుకు పురిగొల్పింది. అంతేకాదు.. అప్పట్లో పట్టాభిని వైసీపీ నాయకులు అరెస్టు కూడా చేశారు. దీంతో తనకు పార్టీలో మరింత గుర్తింపు లభిస్తుందని ఆయన ఆశించారు. ఇక, విజయవాడ వెస్ట్‌కు చెందిన మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న కూడా.. ఇదే తరహా ఆశలు పెట్టుకున్నా రు. ఈయన కూడా వైసీపీ సర్కారుపైనా.. ముఖ్యంగా సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయి రెడ్డి వంటి కీలక వైసీపీ నాయకులపైనా ఫైట్ చేశారు. నిరంతరం.. పార్టీ తరఫున బలమైన గళం కూడా వినిపిస్తున్నా రు. ఇక, చంద్రబాబు చిత్రపటానికి రక్తాభిషేకం కూడా చేశారు. ఇంత చేసినా.. ఆయనకు కూడా తాజాగా నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం దక్కలేదు. అయితే.. ఇంకా పదవుల పంపకం పూర్తి కాలేదు కాబట్టి.. వీరి ఆశలు సజీవంగానే ఉన్నాయని సీనియర్లు చెబుతున్నారు. కానీ, వీరు మాత్రం పార్టీకి గత రెండు రోజులుగా దూరంగా ఉంటున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

- కోయల్ కార్ రామ్ దయానంద్

## ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



నిజామాబాద్, సెప్టెంబర్ 27 (నిఘానేత్రం ప్రతినిది) తెలంగా ణవాది, స్వాతంత్ర్య పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 109 జయంతి వేడుకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి ఉత్సవాలు జరిపారు. అర్బన్ శాసనసభ్యులు ధన్పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ నీతూ కిరణ్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, బీ.సి, పద్మశాలి కుల సంఘాల ప్రతినిధులు, తదితరులు వినాయకనగర్ లోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన జయంతి కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తుది శ్వాస వరకు అంకితభావం, నిజాయితీగా కృషి చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని ప్రశంసించారు. కేవలం తెలంగాణ ఉద్యమంలోనే కాకుండా దేశ స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్నారని, చట్టసభల్లో గళమెత్తి తన పదవులను తృణప్రాయంగా వదులుకున్న త్యాగశీలి అని గుర్తు చేశారు. ఆ మహనీయుడి గురించి ఎంత పొగిడినా తక్కువే అవుతుందని, తెలంగాణ సమాజంలో జన్మించిన ఆణిముత్యం కొండా లక్ష్మణ్ బాపూజీ అని అభివర్ణించారు. ఆయన త్యాగాలు, పోరాట పటిమను నేటి తరానికి తెలియజేసేలా తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా జయంతి ఉత్సవాలను నిర్వహిస్తోందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధనకు అందరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రమేష్, సహాయ అభివృద్ధి అధికారి నర్సయ్య, పద్మశాలి, బీసీ కుల సంఘాల నాయకులు పులగం హనుమాండ్లు, బిజ్జు దత్తాద్రి, రాష్ట్ర మహిళా సంఘం అధ్యక్షురాలు గుజ్జ రాజేశ్వరి, నగర పద్మశాలి సంఘం అధ్యక్షుడు వెంకట నర్సయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మురళి, పద్మశాలి ఆత్మీయ సమితి అధ్యక్షుడు గురుచరణం, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు చంద్రభాగ, పి.నర్సయ్య, సామాజిక కార్యకర్త బంగారు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## మూసీ పరివాహక ప్రాంతంలో చారిత్రాత్మక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతాం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



(నిఘానేత్రం ప్రతినిది) హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణ కు ముందుకు రావాలని ఆయన పారిశ్రామికవేత్తలకు సూచించారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు పర్యాటక రంగాన్ని కూడా ముందుకు తీసుకెళతామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని పలు పురాతన మెట్లబావుల పునరుద్ధరణ కోసం సీఐఐ తో రాష్ట్ర పర్యాటక శాఖ శుక్రవారం ఒప్పందం చేసుకుంది. హాకార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ మూసీ ప్రక్షాళన కార్యక్రమాన్నిహాప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. హాగత ప్రభుత్వాల నిర్లక్ష్యంగా కారణంగా నగరంలోని అనేక చారిత్రక కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయని సీఎం అన్నారు. ప్రస్తుతం పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నామని , త్వరలోనే అందులో శాసన మండలిఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రస్తుతం శాసనమండలి ఉన్న జూబ్లీ హాల్ కు చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రత్యేక టెక్నాలజీతో ఆ భవనాన్ని నిర్మించారని, భవిష్యత్తులో దాన్ని పరిరక్షించాల్సిన అవసరముందని సీఎం అభిప్రాయ పడ్డారు. జూబ్లీహాల్ ను దత్తత తీసుకొని పరిరక్షించాలని ఆయన సీఐఐ కి సూచించారు. ఉస్మానియా ఆస్పత్రి భవనాన్ని పరిరక్షిస్తామని, ఇందుకోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలిస్తున్నట్లు సీఎం వివరించారు. హైకోర్టు భవనాన్ని కూడా రక్షించాల్సిన అవసరముందని సీఎం అన్నారు. రాజేంద్రనగర్ లో హైకోర్టు నూతన భవనం నిర్మాణం కోసం 100 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్ సిటీకాలేజ్ భవనంతోపాటు పురానాపూల్ బ్రిడ్జి వంటి చారిత్రక కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. ఇప్పటికే చార్మినార్ పరిరక్షణ ప్రాజెక్ట్ కొనసాగుతోందన్నారు.

**పురాతన బావులు దత్తత తీసుకున్న పారిశ్రామికవేత్తలు**

నగరంలో పురాతన మెట్లబావులను పునరుద్ధరించిపర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడానికి పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారు ఒప్పంద పత్రాలుహాఅందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీలోనిమహాలఖా మెట్ల బావిపునరుద్దరణకు ఇన్ఫోసిస్ సంస్థ ఒప్పందం చేసుకుంది. సాయి లైఫ్ సంస్థ మంచిరేవుల మెట్ల బావినిహాదత్తత తీసుకుంది. భారత్ బయోటెక్‌హా సంస్థ సాలార్ జంగ్, అమ్మపల్లి బావులను పునరుద్ధరించనున్నది. అడిక్‌మెట్ మెట్ల బావిని దొడ్ల డైరీ, ఫలక్ నుమా మెట్ల బావిని టీజీ ఆర్టీసీ, రెసిడెన్సీ మెట్ల బావిని కోఠి ఉమెన్స్ కాలేజీ పునరుద్ధరించనున్నది.హా

**ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకోసం తెలంగాణ దర్శిని..**

ప్రభుత్వ పాఠశాలల్లోచదివే విద్యార్థులు ఉచితంగా రాష్ట్రంలో పర్యాటక, చారిత్రక ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందు కోసం తెలంగాణ దర్శిని కార్యక్రమాన్ని తీసుకువచ్చామని, దానికి సంబంధించిన జీవోను ఇప్పటికే జారీ చేశామన్నారు. చారిత్రక, పర్యాటక ప్రాంతాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం తెలంగాణ దర్శినిహా తీసుకువచ్చినట్లు సీఎం హావివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం ప్రిన్సిపల్‌సెక్రటరీ వాణీప్రసాద్, సీఐఐ తెలంగాణ ఛైర్మన్‌సాయి ప్రసాద్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్ట్ ప్రాజెక్ట్ ను త్వరితగతిన పూర్తి చేయాలి

**టెండర్ల ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలి**

**భూసేకరణ అంశంలో అలసత్వం వలదు**

**సాంకేతిక అనుమతుల విషయాలలో అధికారులు సమన్వయం చేసుకోవాలి**

**పాలనాపరమైన అనుమతులలో వేగం పెంచాలి**

**నిర్ణిత గడువు లోపు నిర్మాణాలు పూర్తి కావలి**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



హైదరాబాద్ సెప్టెంబర్ 27:(నిఘానేత్రం ప్రతినిధి)ఖమ్మం జిల్లాలోని సీతారామ ప్రాజెక్ట్ ను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆగస్ట్ 15 న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రాజెక్ట్ కు చెందిన పంప్ హౌజ్ లను ప్రారంభించిన విషయం విదితమే. అందుకు సంబంధించిన టన్నెల్, కాలువల నిర్మాణాల పనుల పురోగతి పై శుక్రవారం రోజున జలసౌదలో సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లతో కలిసి నీటిపారుదల శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖా సలహాదారుడు అదిత్యా దాస్ నాథ్, ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్,ఇ.ఎన్.సి లు అనిల్ కుమార్,నాగేందర్ రావు లతో పాటు సీతారామ ప్రాజెక్ట్ సి.ఇ శ్రీనివాస రెడ్డి,ఖమ్మం జిల్లా సి.ఇ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూసేకరణ అంశంపై అలసత్వం చేయవద్దని సూచించారు. అందుకు పాలనా పరమైన అనుమతులలో జాప్యం లేకుండా చూసుకోవాలన్నారు. టెండర్ల ప్రక్రియను పూర్తి చేసేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. సాంకేతికాంశలలో అధికారులు పరస్పరం సమన్వయం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నిర్ణిత గడువులోపు ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేయాలన్నారు.

## సన్న దొడ్డు ధాన్యానికి 500 రూపాయల బోనస్ ప్రకటించాలి

నిజామాబాద్, సెప్టెంబర్ 27(నిఘానేత్రం ప్రతినిది)సన్నధాన్యానికి ,దొడ్డు ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇచ్చికొనుగోలు చేయాలనిఅఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే పత్తికొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి 15వేల రూపాయలు మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ఆయన అన్నారు..ఆర్మూరు కుమార్ నారాయణ భవన్ లో శుక్రవారం అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల ప్రభాకర్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ పత్తికి 500 రూపాయల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దొడ్డు ధాన్యానికి 500 రూపాయల




బోనస్ ఇవ్వకుండాఎగనామం పెటే నిర్ణయం ప్రభుత్వం తీసుకుందన్నారు. సన్నధాన్యాలను కొనుగోలు చేస్తామని అందుకు క్వింటాలుకు 500 రూపాయలు బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లుగా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. ప్రభుత్వం నిర్ణయాన్ని ప్రకటించింవ్ మంత్రి దొడ్డు ధాన్యానికి బోనస్ లేదని ప్రకటించడంలో తమ ఎన్నికల ప్రణాళికను గంగలో కలపడమే అవుతుందన్నారు. మీడియా సమావేశంలో రాజన్న. ఎపి.గంగారం, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్ ప్రజలమనిషి

### -ధర్మపురి శ్రీనివాస్‌కు ఘన నివాళలు అర్పించిన ఎంపీ

నిజామాబాద్ , సెప్టెంబర్ 27(నిఘానేత్రం ప్రతినిది) ప్రతిరోజు ప్రజల కోసం పరితపించి తన రాజకీయ జీవి తాన్ని అంకితం చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజల మనిషి ధర్మపురి శ్రీనివాస్ అని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. ధర్మపురి శ్రీనివాస్ జయంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని కంటేశ్వర్ బైపాస్ రోడ్డు వద్ద గల డి.శ్రీనివాస్ ఘాట్ వద్ద ఎంపీ ధర్మపురి అరవింద్ పూలమాలలు




వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ ధర్మపురి శ్రీనివాస్ తన కు రాజకీయ గురువు అని తెలిపారు. ధర్మపురి శ్రీనివాస్ రాజకీయాల గతీతంగా ప్రజా సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేశారని తెలిపారు. ప్రజాసేవే ధ్యేయంగా ధర్మపురి శ్రీనివాస్ చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ, బీజేపీ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మీ నరసయ్య, బీజేపీ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో గెలిచి జిల్లా పేరు నిలపాలి..

**ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్..**

నిజామాబాద్ (నిఘానేత్రం ప్రతినిది) :రాష్ట్ర స్థాయిలో గెలిచి జిల్లా పేరు నిలపాలని వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి అన్నారు. శుక్రవారం నిజామాబాద్ పాలిటెక్నిక్ గ్రౌండ్ లో ఉమ్మడి జిల్లా స్థాయి జూనియర్‌బాల్ బ్యాడ్మింటన్ బాయ్స్ అండ్ గర్ల్స్ సెలక్షన్స్ నిర్వహించారు. ఈ ఎంపికలకు ఉమ్మడి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ ఎంపిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి, నిజామాబాద్ జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రవి, సీనియర్ పిడి రాము,విద్యా



సాగర్ రెడ్డి పాల్గొని క్రీడాకారులును ఉదేశించి మాట్లాడుతూ... అక్టోబర్ నెలలో కామారెడ్డి లో జరిగే 69వ జూనియర్ తెలంగాణ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలలో జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలపాలని క్రీడాకారులని కోరారు. ఎంపికైన క్రీడాకారులకు సెప్టెంబర్ 28 నుండి బాలికలకు జడ్పీహెచ్‌ఎస్ రెంజల్‌పాఠశాలలో, బాలురకు టీఎస్ ఆర్ ఎస్ ఉప్పల్వాయి పాఠశాలలో శిక్షణ శిబిరాన్ని నిర్వహించి తుది జట్టును రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు. ఈ ఎంపిక కార్యక్రమంలో జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణమూర్తి. కోశాధికారి రాజేశ్వర్, సంఘ బాధ్యులు మహేష్. సురేష్. జోష్ణ. భాగ్యలక్ష్మి. గీత. కార్తీక్. ఆనంద్. సాయికుమార్. అనిల్. నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# నార్సింగి లో మాంగళ్య షాపింగ్ మాల్ ప్రారంభం

## సందడి చేసిన సినీనటి సంయుక్త మీనన్











హైదరాబాద్ సెప్టెంబర్: (నిఘానేత్రం విలేఖరి) నగరంలోని నార్సింగి లో మాంగళ్య షాపింగ్ మాల్ 21వ స్టోర్ ను సినీ నటి సంయుక్త మీనన్ శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నటి సంయుక్త మినన్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో అధునాతన కలెక్షన్స్ తో నిత్య నూతన వెరైటీ లతో అతిపెద్ద షాపింగ్ మాల్ గా మాంగళ్య అవతరించిందని అన్నారు.ఈ స్టోర్ ను నార్సింగి లో తను ప్రారంభించడం ఆనందంగా ఉందని చెప్పారు.పట్టు, ఫ్యాన్సీ,కంచి,ధర్మవరం, ఉప్పాడ పట్టు చీరలతో పాటు, అధునాతన కలెక్షన్స్ అందుబాటులో ఉన్నాయని అన్నారు. కిడ్స్, ఎత్నిక్ వెర్ మెన్స్ అండ్ ఉమెన్స్ వివాహాది శుభకార్యములకు ధరించే ప్రత్యేక వస్త్ర ప్రపంచం మాంగళ్య షాపింగ్ మాల్ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంయుక్త మీనన్ షాపింగ్ మాల్ లోని పట్టు, ఫాన్సీ సెక్షన్లు ఎత్నిక్ వెర్ లేడీస్ జెంట్స్ కిడ్స్ వెర్ అంతా కలియతిరిగి సందడి చేసారు. ఈ ప్రాంత వాసులు దసరా షాపింగ్ మాంగళ్య లో చేయాలని అన్నారు. షాపింగ్ మాల్ డైరెక్టర్లు పి. ఎన్. మూర్తి, కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో గత 12 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ఇప్పటివరకు 21 స్టోర్ లు ప్రారంభించాం అని అన్నారు.ఈ ఆదివారం రోజు హైదరాబాద్ నగరంలో మణికొండ లో ప్రారంభించబోతున్నాం, త్వరలో కర్ణాటక రాష్ట్రంలో కూడా మా స్టోర్లను విస్తరించబోతున్నాంఅని చెప్పారు.మా వస్త్రాలను ఎల్లప్పుడూ ఆదరిస్తున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. అధునాతన ఫ్యాషన్ డిజైన్లను అందించడానికి ప్రధాన కారణం మా సొంత మగ్గాలపై తయారు చేయడంతో వినియోగదారులకు తక్కువ రేటుకే నాణ్యమైన వస్త్రాలను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసం ఫణి, కాసం సాయి కృష్ణ, కాసం ధీరజ్, డాక్టర్ కాసం ప్రీతం, తొడుపునూరి అరుణ్ కుమార్, కార్తీక్, విశాల్, వరుణ్ పాల్గొన్నారు. తొలుత అందాల తార సినీనటి సంయుక్త మీనన్ ను చూడడానికి ఉదయం నుండి అభిమానులు, పరిసర ప్రాంత యువతి, యువకులు బారులు తీరారు. యువతి యువకుల కేరింతలతో షాపింగ్ మాల్ ప్రాంతంలో పండగ వాతావరణం నెలకొంది. ముందుగా సంయుక్త మీనన్ అభిమానులను చూసి సందడి చేసింది.

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వాహణ వేడుకలు




నిజామాబాద్ , సెప్టెంబర్ 27 (నిఘానేత్రం ప్రతినిది) నిజామాబాద్ పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్ సింగెనవార్, ఆదేశాలతో శుక్రవారం ఉదయం 11: 00 గం?ల సమయంలో నిజామాబాద్ కమీషన రేటు కార్యాలయంలో నిజామాబాద్ అదనపు డి.సి.పి (అడ్మిన్ ) బి. కోటేశ్వర రావు ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి 109వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ ఫోటోకు పూలమాలలు వేసిన అనంతరం అదనపు డి.సి.పి మాట్లాడుతూ సకల జనులు, సబ్బండవర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలని జీవితాంతం పోరాడినవ్యక్తి, సాయుధ పోరాట కాలంలో పెత్తందార్లను ఎదిరించిన వారికి న్యాయవాదిగా సేవలందించి, వారి తరపున న్యాయపోరాటం చేసిన ప్రజాస్వామిక వాది అని, గాంధీజి స్ఫూర్తితో దేశ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని, తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటాల్లో అన్ని దశల్లోనూ స్ఫూర్తిని నిలిపారని, అనగారిన వర్గాల హక్కుల సాధన కోసం సహకార రంగాల పటిష్టత కోసం జీవితమంతా కృషిచేశారని అన్నారు.ప్రతి ఒక్కరు బంగారు తెలంగాణ కోసం శ్రమించాలని, భవిష్యత్ తరాలకోసం అనునిత్యంప్రతి ఒక్కరు కష్టపడాలని, భావి తరాల కోసం బంగారు బాట వేయాలని పోలీస్ శాఖ సిబ్బందికి అదనపు డి.సి.పి గారు పిలుపునిచ్చారు.ఈ జయంతి సందర్భంగా అదనపు డి.సి.పి ( ఎ.ఆర్ ) శంకర్ నాయక్, ట్రాఫిక్ ఎ.సి.పి నారాయణ, సి.టి.సి ఎ.సి.పి సయ్యద్ మస్తాన్ అలీ, ఆఫీస్ సూపరింటెండెంట్ లు శంకర్, బషీర్, పోలీస్ కార్యాలయం సిబ్బంది సి.సి.ఆర్.బి సిబ్బంది, సి.ఎస్.బి సిబ్బంది, ఐ.టి కోర్ సిబ్బంది, పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, సెంట్రల్ కాంప్లెంటు సెల్ సిబ్బంది హాజరయ్యారు.

# తెలంగాణ ఉద్యమనికి ఊపిరిపోసిన గొప్ప తెలంగాణవాది బాపూజీ

## -అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్



నిజామాబాద్ ,సెప్టెంబర్ 27 (నిఘానేత్రం ప్రతినిది) స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారులు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వినాయక నగర్ విగ్రహాల పార్కులో నిర్వహించిన జయంతి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా ఇందూర్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు, పద్మశాలి సంఘ పెద్దమనుషులతో కలిసి బాపూజీ విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతు బాపూజీ భారతమాత బానిస సంకెళ్లు తెంచడానికి స్వతంత్రోద్యమ సమయంలో క్విట్ ఇండియా, వందేమాతరం ఉద్యమలలో కీలకంగా పని చేసారని స్వాతంత్రం అనంతరం హైదరాబాద్ సంస్థానంగా తెలంగాణ బిడ్డల పై జరుగుతున్నా అఘాత్యాలకి, అకృత్యాలకి నిరసనగా నిజాం రాజుకి ఎదురు తిరిగి తెలంగాణ రైతంగా పోరాటంలో నిజాం అక్రమంగా నిర్భందించిన నాయకులకు అండగా నిలిచిన మహనీయులు బాపూజీ అని అన్నారు బాపూజీ ఎమ్మెల్యే గా, ఎంపీ గా సేవాలాందించి సహకార సంఘాల రూపాకల్పనకు నాంది పలికి చేనేత, కుల వృత్తులను సహకార రంగంలోకి తెచ్చి వాటిని అభివృద్ధి చేసిన ఘనత బాపూజీది అన్నారు..దేశంలో సైకిల్, పాదయాత్రలకు శ్రీకారం చుట్టిన మహనీయులు బాపూజీ అని మూసి వరదల సమయంలో 220 మైల్లు పాదయాత్ర చేసి పునరావాస కేంద్రాలను స్వయంగా పర్యవేక్షించడం జరిగిందని అది ఆయన సేవకు నిదర్శనమన్నారు.తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమనికి ఊపిరి పోసిన మహనీయులు ప్రతేక తెలంగాణ కోసం తన మంత్రి పదవిని గడ్డి పోచల భావించి రాజీనామా చేసిన వ్యక్తి బాపూజీ అని అన్నారు.తెలంగాణ వస్తే మన బతుకులు బాగుపడతాయి అని 96 ఏళ్ల వయసులో కూడా ఎముకలు కొరికే చలిలో ఢిల్లీలో జంతర్ మంతర్ లో దీక్ష చేసిన గొప్ప తెలంగాణ వాది కొండా లక్ష్మణ్ బాపూజీ అన్నారు.కేంద్ర ప్రభుత్వం కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యమ పోరాటస్ఫూర్తిని గుర్తించి అతని పేరు మీద పోస్టల్ స్టాంప్ ను విడుదల చేయడం తెలంగాణ బిడ్డలందరం గర్వించదగ్గ విషయం అన్నారు.నేటి యువతరం లక్ష్మణ్ బాపూజీని ఆదర్శంగా తీసుకోవాలని వారి ఆకాంక్షలను నెరవేర్చే విదంగా బంగారు తెలంగాణ కళ సాకారం కోసం పని చేయాలన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్పొరేటర్లు పద్మశాలి సంఘం పెద్దమనుషులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభానికి వచ్చిన సినీ హీరో రామ్ పోతినేని, హీరోయిన్ పాయల్ రాజ్ పుత్

## సిఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభించిన ఎంపీ అరవింద్ ధర్మపురి ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త












నిజామాబాద్ (నిఘానేత్రం అర్బన్ న్యూస్): 35వ సిఎంఆర్ షాపింగ్ మాల్ ను నిజామాబాద్ కేంద్రంగా జోయాలుకాస్ జెవెలరీస్ పక్కన గురువారం ఎంపీ ధర్మపురి అరవింద్ అర్బన్ ఎమ్మెల్యే దన్ పాల్ సూర్యనారాయణ గుప్త రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సినీ తారలు హీరో రామ్ పోతినేని, హీరోయిన్ సందడి చేశారు. అభిమానుల కేరింతల మధ్య హీరో హీరోయిన్లు స్టేజిపై ఎక్కి అభిమానులకు అభివాదం చేశారు. వేల సంఖ్యలో అభిమానులు సెల్ఫీలు దిగుటకు వారిని చూసేందుకు మహిళలు సైతం పోటీపడ్డారు. వేలాదిమంది అభిమానుల మధ్య సీఎంఆర్ అట్టహాసంగా ప్రారంభం అయింది. ఈ సందర్భంగా హీరోయిన్ పాయల్ రాజ్ పుత్ మాట్లాడుతూ తనకు చీరలు కట్టుకోవడం అంటే చాలా ఇష్టమని అన్నారు. నిజామాబాద్ పట్టణం తనకు కొత్తేం కాదని చాల సార్లు వచ్చానని మీ అభిమానానికి చాల్ థాంక్స్ అని చెప్పింది. సీఎంఆర్ షాపింగ్ మాల్ లో అన్ని రకాల లేడీస్ చీరలు చుడిదార్ గగ్రాలు, పట్టుచీరలు అన్ని న్యూ స్టాక్స్ లను అతి తక్కువ ధరల్లో అందిస్తున్న ఏకైక ట్రస్టెడ్ సంస్థ %CMR% ,అని తెలిపారు. హీరో రామ్ పోతినేని మాట్లాడుతూ సీఎంఆర్ షాపింగ్ మాల్ అండ్ జూలరీస్ అంటే దేశవ్యాప్తంగా మన్నిక గల బ్రాండ్ అని దానికి తాను అంబాసిడర్ గా కొనసాగుతున్నందుకు గర్వపడుతున్నాను అన్నరు. కస్టమర్లకు వేరే షాప్ ల కంటే తక్కువ ధరలలో మన్నిక గల వస్త్రాలను అందిస్తున్న సంస్థ %CMR% అన్నారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా మరియు ఇతర జిల్లాల కస్టమర్లు మహిళలు వచ్చి బతుకమ్మ దసరా దీపావళి పండుగల సందర్భంగా కొనుగోలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో %CMR% నిర్వాహకులు వెంకటరావు, ఎంపీ ధర్మపురి అరవింద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్త నగర మేయర్ దండు నీతూ కిరణ్ 45 వ డివిజన్ కార్పొరేటర్ హేమలత శ్రీనివాస్, బిజెపి నాయకులు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

# రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలి

## మాజి మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి




నిజామాబాద్ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 27 (నిఘానేత్రం ప్రతినిది)గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలోని రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం నిర్ణయయించిన ఎం ఎస్ పి ధరకు అదనంగా రూ: 500 బోనస్ ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం మొక్కజొన్న,సోయాబీన్,వరి పంటలను కొనుగోలు చేయాలన్నారు. ఈ మేరకు శుక్రవారం వేల్పూర్ లోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.అప్పటి టీ పీ సీ సీ అధ్యక్షులు,ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే క్వింటాలుకు 500 రూపాయలు అదనంగా మా ప్రభుత్వమే ఇచ్చి పంట కొనుగోలు చేస్తామని వరంగల్ రైతు డిక్లరేషన్ లో చెప్పి మానిఫెస్టో లో పెట్టిన విషయాన్నిఈ సందర్భంగా గుర్తు చేశారు.రైతులు ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మొత్తంలో మొక్కజొన్న పండించారన్నారు..ప్రస్తుతం పంట చేతికొచ్చిందని,ప్రైవేట్ వ్యాపారులు మొదట్లో క్వింటాలుకు 2600 రూపాయలకు కొనుగోలు చేశారు.కానీ ప్రస్తుతం 2200 నుండి 2300 లకు మాత్రమే కొంటున్నారన్నారు మొక్కజొన్న పంట 2024 – 25 కి గాను కేంద్ర ప్రభుత్వం అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ నిర్ణయించిన ఎం ఎస్ పి ధర 2225 రూపాయలు ఉన్నదని కాంగ్రెస్ ప్రభుత్వం 500 బోనస్ తో కలిపితే 2725 రూపాయలకు కొనుగోలు చేయాలన్నారు..మీరు ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం పంట కొనుగోలు చేయకపోతే క్వింటాలుకు 300 నుండి 400 వందలు రైతన్నలు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సీజన్ రైతు భరోసా కలిపి సుమారు 90 వేలు రైతులు నష్టపోతున్నారు.వెంటనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మొక్కజొన్న పంటను కేంద్ర ప్రభుత్వ ఎం ఎస్ పి ధరకు అధనంగా 500 ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.సోయాబీన్ పంటకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ఎం ఎస్ పి ధర 4892 రూపాయలు ఉందని.ఈ కాంగ్రెస్ ప్రభుత్వం 500 బోనస్ ఇచ్చి 5392 రూపాయలతో కొనుగోలు చేయాలన్నారు..ప్రస్తుతం 4300 మాత్రమే ఇచ్చి ప్రవేట్ వ్యాపారులు రైతుల దగ్గర కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలుకు రైతులు 1100 రూపాయలు నష్టపోతున్నారు. పంటఈ సీజన్ లో రైతు భరోసా ఇవ్వక పోవడం తో 5 ఎకరాల రైతు 80000 ఈ పంటకు నష్టపోతున్నారన్నారు.త్వరలో వరి పంట చేతికి రాబోతుందని..కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ఎం ఎస్ పి ధర 2300 రూపాయలు కాగా..కాంగ్రెస్ ప్రభుత్వం అదనంగా 500 బోనస్ ఇచ్చి క్వింటాలుకు 2800 ఇచ్చి పంట కొనుగోలు చేయాలన్నారు.ఎన్నికల హామీలప్పుడు అన్ని రకాల వడ్లు బోనస్ ఇచ్చి కొంటామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని,. ప్రస్తుతం సన్న వడ్లు మాత్రమే కొంటాము అంటుందన్నారు.మీరు ఇచ్చిన హామీ ప్రకారం బోనస్ ఇవ్వకపోతే ఎకరానికి 25 క్వింటాల్ల వరి పండిన 500 బోనస్ చొప్పున 12500 ఎకరానికి రైతులు నష్టపోతారన్నారు .రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు.. ప్రభుత్వం దొడ్డు, సన్న వడ్లు రెండింటిని బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలన్నారు.రైతు రుణమాఫీ సంపూర్ణంగా అమలు చేయాలని ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు.రుణమాఫీ అమలు కాకా రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మేము రాగానే అని, మళ్ళీ ఆగస్టు 15 న పూర్తిగా రుణమాఫీ చేస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు.అరకొర రుణమాఫీ మాత్రమే చేసిందన్నారు..ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సుమారు 3,79,000 రైతులకు రుణమాఫీ కావాల్సి ఉండగా కేవలం 1,75,000 రైతులకు మాఫీ అయ్యిందన్నారు. 2 లక్షల 4 వేల రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందన్నారు.బాల్కొండ నియోజకవర్గంలో విషజ్వరాలు,చికెన్ గున్యా,డెంగ్యూ వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. విష జ్వరాలను నియంత్రించడంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందని ఆరోపించారు.ప్రజలు వ్యాధులతో,జ్వరాలతో,కీళ్ల నొప్పులతో బాధపడుతుంటే చోద్యం చూస్తోందన్నారు గత ప్రభుత్వం ఇంటింటి హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి ఎలాంటి సీజనల్ , ఇతర వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.రాష్టంలో ఆశ వర్కర్లు అందుబాటులో ఉన్నప్పటికీ వారి సేవలను ఈ ప్రభుత్వం వినియోగించుకోవడం లేదని ఆరోపించారు.ప్రతి ప్రభుత్వ దవాఖాన లో సీజనల్ వ్యాధులు,విష జ్వరాలు చికెన్ గున్యా లాంటి వాటికి మందులు అందుబాటులో ఉంచాలన్నా రు..ఈ మీడియా సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు,మాజీ ఎంపిపి, జడ్పిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 365 దరఖాస్తులు అందాయి




హైదరాబాద్, సెప్టెంబర్ 27:(నిఘానేత్రం ప్రతినిధి) మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో మొత్తం 365 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 105, విద్యుత్ శాఖ కు సంబంధించి 58, ఎస్సీ సంక్షేమ శాఖ కు సంబంధించి 42, పంచాయతి రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 29, మైనారిటీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 26, ప్రవాసీ ప్రజావాణి ద్వారా 22, ఇతర శాఖలకు సంబంధించి 83 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి శ్రీమతి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్ కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం ప్రారంభమైన " ప్రవాసీ ప్రజావాణి " కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి లు పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

# నాటు వేసేందుకే మొగ్గు

ఆత్మకూర్: నెమ్మికల్‌లో నాటు వేసిన పొలం : జిల్లాలో ప్రధాన పంటగా వరిసాగు చేపడుతున్నారు. ఏటా పెట్టుబడులు పెరుగుతున్నా.. వరి వైపే అన్నదాతలు దృష్టి సారిస్తున్నారు. వివిధ పద్ధతుల ద్వారా సాగుకు పెట్టుబడులు తగ్గించే అవకాశం ఉన్నా.. రైతులు ఆ దిశగా మొగ్గు చూపడం లేదు. ప్రధానంగా నాట్లు వేసే సమయంలో కూలీల కొరత అధికంగా ఉండటంతోపాటు ఎకరాకు రూ.5 వేల వరకు కూలీలకే వెచ్చించాల్సిన పరిస్థితి. కూలీల సమస్యను అధిగమించేందుకు ప్రత్యామ్నాయంగా డ్రమ్ సీడర్, వెదజల్లు పద్ధతిని ఉపయోగించే అవకాశం ఉన్నా రైతులు ఆ దిశగా యోచన చేయడం లేదు. ఈ పద్ధతిపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాల్సి ఉన్నా.. పని ఒత్తిడి కారణంగా పట్టించుకోవడం లేదు. పంట దిగుబడి రాదేమోనని, చీడపీడల బెడద అధికంగా ఉంటుందని, అధిక పెట్టుబడికి వెనకాడకుండా నాటు వేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. వెదజల్లు, డ్రమ్ సీడర్ పద్ధతులపై అన్నదాతలు మొగ్గు



చూపితే చాలా వరకు పెట్టుబడి తగ్గే అవకాశం ఉండటంతోపాటు దిగుబడి కూడా పెరుగుతోంది. ఈ విషయమై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

లక్షన్నర ఎకరాల్లోపే..జిల్లాలో ఈ వానాకాలం ఆయకట్టు, ఆయకట్టేతర ప్రాంతాల్లో 4,46,652 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. కాగా డ్రమ్ సీడర్, వెదజల్లు పద్ధతి ద్వారా కేవలం లక్షన్నర లోపే ఎకరాల్లో మాత్రమే చేపట్టడం గమనార్హం. సంప్రదాయ పద్ధతిలో నాటు వేయడంతో ఎకరాకు రూ.6 వేల వరకు ఖర్చు అవుతోంది. డీజిల్, ఎరువులు ధరలు పెరగడంతో అదనంగా మరో రూ.3 వేల భారం పడుతోంది. మొత్తమ్మీద ఎకరాకు రూ.25 వేల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. దిగుబడి ఆశాజనకంగా ఉంటే రూ.40 వేల వరకు రాబడి వస్తోంది. చీడ పీడలు, వర్ష ప్రభావం ఎక్కువ ఉన్నా.. తక్కువ ఉన్నా దిగుబడి పూర్తిగా తగ్గే అవకాశం ఉంటుంది. దీంతో పెట్టుబడులు అధికమయ్యే ప్రమాదం ఉంటుంది. ఈ పరిస్థితుల నుంచి బయటపడాలంటే వెదజల్లు, డ్రమ్ సీడర్ విధానాన్ని అవలంబిస్తే రైతులకు చాలా వరకు ఖర్చు తగ్గే అవకాశం ఉంటుంది.

దృష్టి సారించాలి

శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి, సూర్యాపేట

వెదజల్లు, డ్రమ్ సీడర్ విధానంపై రైతులు దృష్టి సారించాలి. పంటకు పెట్టుబడి చాలా వరకు తగ్గుతోంది. దిగుబడిపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రుణమాఫీ, పంట లెక్క వేసే మండల అధికారులు నిమగ్నం కావడంతో అవగాహన కల్పించే సమయం లేదు. యాసంగిలో ఈ విధానంపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తాం.

వెదజల్లు విధానంతో ప్రయోజనాలు:

నాటు విధానం ద్వారా ఎకరాకు 25 కిలోల వరకు విత్తనాలు అవసరం. వెదజల్లు పద్ధతిలో 12 నుంచి 15 కిలోలు సరిపోతాయి.

నాటు వేసేందుకు కూలీలకు ఎకరాకు రూ.5వేల వరకు ఖర్చు అవుతోంది. డ్రమ్ సీడర్, వెదజల్లు ద్వారా అయితే కేవలం రూ.500 మాత్రమే అవుతాయి.

నారు పెంచి తిరగ నాటడం వల్ల వేర్లు తెగడంతో పిలకలు తక్కువగా వస్తాయి. వెదజల్లే పద్ధతిలో నేరుగా పెరగడం వల్ల దుబ్బులు, కంకులు ఎక్కువ వస్తాయి. దిగుబడులు పెరుగుతాయి.

వెదజల్లే పద్ధతి అవలంబిస్తే పంట ఆరంభంలో మందులతో కలుపు నివారించొచ్చు. పంట త్వరగా కోతకు వస్తుంది.

# గ్రామాల్లో అమృత్ ఫలాలు..!

రాజపేట : ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం గ్రామాల్లో నీటి ఎద్దడి నివారించి, భూగర్భ జలాలు పెంపొందించేందుకు మిషన్ అమృత సరోవర్ పథకం కింద చేపట్టిన చెరువుల పూడికతీత పనులు సత్ఫలితాలిస్తున్నాయి. ఈ పథకం కింద జిల్లాలోని 14 మండలాల్లో 76 చెరువులను ఎంపిక చేశారు. ఇందులో 42 చెరువుల్లో పూడికతీత పనులు పూర్తి చేయగా, మిగిలిన 34 చెరువుల పనులు పురోగతిలో ఉన్నాయి. జిల్లాలో పథకం తీరుతెన్నుల విషయమై వివరాలు క్లుప్తంగా..

పద్నాలుగు మండలాల పరిధిలో..

పథకంలో భాగంగా కొత్తగా నీటి కుంటలను తవ్వి నీటి వనరులను నిల్వ చేయాల్సి ఉంది. కుంటల నిర్మాణానికి స్థలాలు అనువుగా లేకుంటే, ఇప్పటికే ఉన్న కుంటలను, చెరువుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు పథకంలో వీలు కల్పించారు. ఆ దిశగా అధికారులు కసరత్తు చేసి జిల్లాలోని 14 మండలాల్లో 76 చోట్ల నీటికుంటలు,



చెరువులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఉపాధిహామీ, 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులను చేపట్టాలని కేంద్రం స్పష్టం చేసింది. ఆ దిశగానే జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కేంద్రం రూపొందించిన నిబంధనల ప్రకారం చెరువులను ఎంపిక చేసి పనులను చేపట్టారు. ఈ పథకం పనుల వల్ల ఉపాధి కూలీలకు అదనంగా పని దొరికే అవకాశం ఏర్పడింది.

జలమట్టం పెంపునకు దోహదం: నాగిరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి, యాదాద్రి

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని మిషన్ అమృత్ సరోవర్ పథకం కింద జిల్లాలో మొత్తం 76 పనులను ఎంపిక చేశాం. అందులో సగానికిపైగా పనులు పూర్తయ్యాయి. మిగతా పనులు పురోగతిలో ఉన్నాయి. ముఖ్యంగా ఈ పథకం కింద చేపట్టే చెరువుల పూడికతీత పనులతో కూలీలకు ఉపాధి లభించడంతోపాటు భూగర్భ జలమట్టం పెంపునకు అవకాశం ఏర్పడుతుంది.

# పట్టు పెరుగుతోంది



జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో సాగు అనుబంధంగా పట్టుపురుగుల పెంపకం ఏటికేడు విస్తరిస్తోంది. రైతులకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా మల్బరీసాగు నాలుగు జిల్లాల్లో దాదాపుగా 279 ఎకరాలకు విస్తరించగా మరో 90 మంది వరకు నూతనంగా పట్టుపురుగుల పెంపకానికి దరఖాస్తు చేయటం సాగు సానుకూలతను వెల్లడిస్తోంది. దిగుబడి మల్బరీ మొక్కలను ఒకసారి నాటితే నిరంతరం కాపు వస్తుంది. చీడపీడల బెడద ఉండదు. పట్టుసాగును చేపట్టిన తొలిసారే షెడ్డు, చంద్రికలు, తడకలు, నెట్లు తదితరాలకు పెట్టుబడి ఉంటుంది. తరువాతి పంటలకు కేవలం గుడ్లను కొనటం, మందు ద్రావణం, కూలీల ఖర్చు తదితర చిన్నచిన్న పెట్టుబడులు మాత్రమే ఉంటాయి. మల్బరీ ఇదివరకు సాగుచేస్తున్నవారు ఏడాదిలో సరాసరిగా 6-8 పంటలవరకు కాపు తీసుకున్నారు. 100 గుడ్లకు 80 కిలోల వరకు పట్టుగూళ్లు వస్తుండగా కిలోకు కుకూన్ ధర రూ.550-670 వరకుంది. హైదరాబాద్, జనగాంలో పట్టుగూళ్ల విక్రయ మార్కెట్లున్నాయి. 25-35 రోజులకొక పంట పూర్తవుతుండగా ఖర్చులుపోనూ ఎకరాకు కనీసం రూ.80 వేల నుంచి రూ.1.30 లక్షల వరకు ఆదాయం వస్తోంది. పట్టు పురుగులపై ఆశించే తెగుళ్లను సమర్థంగా నిరోధించటం, పట్టుగూళ్లు అల్లుకునే దశల్లో ఇంటిల్లిపాది శ్రమించటంవల్ల రైతులు సత్ఫలితాలను సాధిస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారి శ్యామ్‌ప్రసాద్ తెలిపారు.

రాయితీలు

సిల్క్ సమగ్ర పథకం ద్వారా మల్బరీ మొక్కలు, పట్టుపురుగుల పెంపకానికి పలు రాయితీలు ఇస్తున్నారు. సాధారణ రైతులకు 2 ఎకరాల్లో సాగుకు 60 వేలు ఇస్తుండగా ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.78 వేలు ఇస్తున్నారు. పట్టుపురుగులను పెంచే షెడ్డు నిర్మాణానికి రూ.5-6.5 లక్షలు ఖర్చవుతుండగా జనరల్ రైతులకు రూ.2.25 లక్షలు, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.2.95 లక్షలను రాయితీగా ఇస్తున్నారు. షెడ్డులో అమర్చే ఒక్కో స్టాండ్స్‌కు రూ.17 వేలు, నేత్రికలు, ట్రేలు, ఇతర సామగ్రికి రూ.4 వేలు, రోగ నిరోధక మందులకు రూ.2,500 నుంచి రూ.3,250 చొప్పున నిధులను ఇస్తున్నారు. గతంలో పట్టుగూళ్లకు కిలోకు రూ.75 చొప్పున రైతులకు ఇచ్చిన ఇన్సెంటివ్ మొత్తాన్ని పెంచి కొనసాగించాల్సి ఉంది. ఉద్యానశాఖద్వారా, పొలాసలోని వ్యవసాయ కళాశాలలోనూ పట్టుపురుగుల పెంపకంపై రైతులకు శిక్షణ ఇస్తున్నారు.

ఏడాది పొడవునా ఆదాయం

పట్టుపురుగుల పెంపకంతో ఏడాది పొడవునా నికరాదాయం పొందవచ్చు. పట్టుపురుగులపై వచ్చే తెగుళ్లపట్ల అప్రమత్తంగా ఉంటే ఎకరా విస్తీర్ణంలోని పంటకు కనీసం 1.20 క్వింటాళ్లకుపైగా పట్టుగూళ్లు వస్తాయి. ప్రభుత్వం పట్టుగూళ్లకు ఇన్సెంటివ్‌ను పెంచి ఇచ్చినట్లయితే మరింత ప్రోత్సాహకంగా ఉంటుంది. నేరెళ్ల చంద్రమౌళి, రైతు, కల్లెడ, జగిత్యాల మండలం

# ఆదాయం సరే.. సౌకర్యాలేవీ?




కరీంనగర్ : టీజీఎస్ ఆర్టీసీ ఒకవైపు ప్రజా రవాణాను కొనసాగిస్తూనే మరోవైపు ఆదాయం పెంచుకోవడంలో భాగంగా లాజిస్టిక్ (పార్సిల్ బుకింగ్) సేవల్లోకి అడుగు పెట్టింది. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా నిత్యం వేలాది పార్సిళ్లు బుక్ కావడంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి కరీంనగర్‌కు పార్సిళ్లు బస్సుల ద్వారా వస్తుంటాయి. వీటి ద్వారా ఆర్టీసీకి ఆదాయం కూడా బాగానే వస్తోంది. కరీంనగర్ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన బుకింగ్ కేంద్రానికి రోజు రూ.లక్షకుపైగా ఆదాయం వస్తుంది కానీ.. సరైన సౌకర్యాలు లేక వినియోగదారులు, సిబ్బంది తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

నిత్యం 900ల పార్సిళ్లు..

కరీంనగర్ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన లాజిస్టిక్ బుకింగ్ కేంద్రానికి మంచి ఆదరణ లభిస్తోంది. బుకింగ్ చేసిన పార్సిళ్లు, కవర్లు రాష్ట్రవ్యాప్యంగా 24 గంటల నుంచి 48 గంటల్లో చేరే అవకాశం ఉండటంతో వ్యాపారులు, ఇతరులు ఆర్టీసీ బుకింగ్ కేంద్రాల ద్వారానే తమ పార్సిళ్లను పంపిస్తున్నారు. దీంతో సంస్థకు ఆదాయం కూడా బాగానే వస్తోంది. కరీంనగర్ ప్రయాణ ప్రాంగణంలో మూడు కౌంటర్లు 24 గంటలు పనిచేస్తాయి. నిత్యం 900ల పార్సిళ్లు బుక్ చేయడంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి 900ల పార్సిళ్లు ఇక్కడకు వస్తుంటాయి.

గమ్యం చేరుకోవడంలో ఆలస్యం

వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన పార్సిళ్లు సకాలంలో వెళ్లడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జేబీఎస్‌లో ఉదయం బుక్ చేసిన పార్సిల్ రావడానికి ఒక్కోసారి రెండు రోజులు పడుతుందని ఓ వినియోగదారుడు తెలిపారు. సరైన పర్యవేక్షణ కూడా లేదనే ఆరోపణలున్నాయి. బుకింగ్ కేంద్రానికి వచ్చే పార్సిళ్ల సంఖ్య పెరిగిపోవడంతో వాటిని భద్రపరచడానికి స్థలం సరిపోక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటిని తీసుకోవడానికి వచ్చిన వారికి అవి ఎక్కడ ఉన్నాయో వెతికి ఇవ్వడం సిబ్బందికి కష్టంగా మారింది. సమస్యలపై లాజిస్టిక్ మేనేజర్ రామారావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా.. సెక్యూరిటీ సిబ్బంది కోసం ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. స్థలం కొరత ఉందని.. సమస్యను ఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

బుకింగ్ కేంద్రాలు 3

ఆదాయం రూ.1.50 లక్షలు

ఒకరోజు వచ్చే పార్సిళ్లు 900

బుకింగ్ అవుతున్నవి 900

పని చేస్తున్న సిబ్బంది 26 మంది

ప్రధాన సమస్యలివి..

మూడు బుకింగ్ కేంద్రాల నిర్వహణలో భాగంగా పార్సిళ్లను స్వీకరించడం, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వాటిని భద్రపరచ్చడం, వినియోగదారులకు అందించడం వంటి పనుల కోసం ఆర్టీసీ ఉద్యోగులు 13, పొరుగు సేవల సిబ్బంది 13 మంది విధులు నిర్వర్తిస్తున్నారు.

24 గంటలు సేవలు అందించే కౌంటర్లు కావడంతో సిబ్బంది సరిపోవడం లేదు.


పనిభారం పెరిగి ఉద్యోగులు అనారోగ్యం బారిన పడుతున్నారని.. సిబ్బందిని కేటాయించమని కోరినా.. సెలవులు అడిగినా ఇవ్వని పరిస్థితి ఉందని ఓ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు.

మరోవైపు పార్సిళ్లను తీసుకోవడానికి నిత్యం వందలాది మంది లాజిస్టిక్ కేంద్రానికి వస్తుండగా.. అక్కడ వస్తువుల రక్షణ చర్యలు అంతగా లేవు.

సెక్యూరిటీ సిబ్బంది లేకపోవడంతో కేంద్రం లోపలకు ఎవరు వస్తున్నారో తెలియని పరిస్థితి ఉంది. ఇప్పటికే కొన్ని పార్సిళ్లు పోయిన ఘటనలు కూడా జరిగాయి.

సెక్యూరిటీ సిబ్బందిని నియమించడంతోపాటు కొత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

# ఆరోగ్య బీమాతో ధీమాగా..!



గోదావరిఖని: ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ప్రస్తుతం ఆరోగ్య బీమాపై అవగాహన పెరగడంతో చాలామంది మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వారు ఆస్పత్రుల ఖర్చు భారం పడకుండా జాగ్రత్త పడుతున్నారు. కరోనా సమయంలో వైద్య చికిత్సకు రూ.లక్షల్లో బిల్లులు అవడంతో అవగాహన పెరిగి జనం ఆరోగ్య బీమా పాలసీలు తీసుకోవడంపై దృష్టి పెట్టారు. దీంతో ఆ కంపెనీల వ్యాపారం పెరుగుతుండగా.. అనారోగ్య పరిస్థితులు తలెత్తినప్పుడు పాలసీదారులకు ఉపయుక్తంగా మారుతోంది. ఉమ్మడి జిల్లాలో 942 ప్రైవేటు ఆస్పత్రులు ఉండగా.. ఇందులో ఇన్ పేషంట్లుగా చేరుతున్న వారిలో 30 శాతం వరకు ఆరోగ్య బీమా పాలసీల ద్వారానే వైద్యం చేయించుకుంటున్నారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగులైతే శాఖాపరంగా వచ్చే బీమా సౌకర్యంతో, ప్రైవేటు ఉద్యోగులు, వివిధ రంగాల వారు తాము చేసుకున్న పాలసీలతో వైద్యం పొందుతున్నారు.

గతంలో ఆస్పత్రుల్లో చేరితే రూ.లక్షల్లో అప్పు చేయాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో మధ్య తరగతి వారు చాలామంది ఆరోగ్య బీమా చేయించుకుని అత్యవసర సమయంలో ఖర్చుల భారం లేకుండా చేసుకుంటున్నారు. నిరుపేద కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డు ద్వారా ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ వర్తిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 30 శాతం మంది వీటి పరిధిలోనే వైద్యం పొందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే వారు ఆయా శాఖల ద్వారా ఆరోగ్య బీమా సౌకర్యం పొందుతున్నారు. ఈ కుటుంబాలు లక్ష వరకు ఉంటాయి. ఇక ఏ అవకాశం లేని కుటుంబాల్లో మరో 30 శాతం మంది ప్రైవేటు సంస్థల ద్వారా బీమా చేయించుకుని వైద్య సేవలు పొందుతున్నారు. గోదావరిఖనికి చెందిన ఏడాది చిన్నారికి తండ్రి వైద్య బీమా చేయించారు. కొద్ది రోజులకే ఆ చిన్నారికి జ్వరం రావడంతో ప్లేట్‌లెట్లు తగ్గాయి. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళారు. సమయానికి అందిన వైద్యంతో సురక్షితంగా ఇంటికి చేరుకుంది. చికిత్స ఖర్చు రూ.2 లక్షలు. ఆరోగ్య బీమా ఉండటంతో రూపాయి భారం పడకుండా ఆస్పత్రి బిల్లులు చెల్లించారు. ఉమ్మడి జిల్లాలో రూ.5 లక్షల పరిమితి వరకు పాలసీలు ఎక్కువ మంది తీసుకుంటున్నారు. 3 లక్షల కుటుంబాలకు ప్రైవేటు బీమా పాలసీలు ఉండగా అందులో దాదాపు రెండు లక్షల కుటుంబాలు రూ.5 లక్షల పరిమితి పాలసీ తీసుకున్నాయి.

ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే డబ్బు కోసం ఇతరులపై ఆధారపడకుండా వెంటనే ఆస్పత్రుల్లో చేరేందుకు బీమా సౌకర్యం ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలు (సుమారు)

జనాభా : 40 లక్షలు

కుటుంబాలు : 10 లక్షలు

ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పరిధిలోకి వచ్చే కుటుంబాలు : 3 లక్షలు

ప్రైవేటు సంస్థల ఆరోగ్య బీమా తీసుకున్న కుటుంబాలు : 3 లక్షలు

అత్యవసర పరిస్థితుల్లో అండగా..

వైద్య సేవలు పొందేందుకు ఆరోగ్య బీమా చేయించుకోవాలన్న అవగాహన పెరిగింది. ఇటీవల వైద్యం కోసం వస్తున్న వారిలో ఎక్కువ శాతం ఆరోగ్య బీమా కార్డు ద్వారానే సేవలు పొందుతున్నారు. దీని వల్ల అత్యవసర పరిస్థితిలో రోగుల కుటుంబాలకు డబ్బు గురించి హైరానా పడాల్సిన పరిస్థితి తప్పింది. పలు కారణాలతో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. వైద్యానికి భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో ఆరోగ్య బీమా కొంత ధీమా కల్పిస్తోంది.

# షెడ్యూల్ వచ్చేసింది!

మిర్యాలగూడ: వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటికి పూర్తి కానుండడంతో.. తదుపరి ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా రూపొందించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల షెడ్యూలు విడుదల చేసింది. ఈ నెల 30 నుంచి ఓటు నమోదుకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది.

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు ఫారం-19 ద్వారా ఆఫ్‌లైన్‌లో, ఆన్‌లైన్‌లో '- వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. దీనికి సంబంధించి అక్టోబరు 16, 25 తేదీల్లో ఎన్నికల అధికారులు ప్రకటనలు జారీ చేయనున్నారు. గతంలో ఓటు నమోదు చేసుకున్న వారు సైతం మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందేనని ఎన్నికల సంఘం సూచించింది.

ఇదీ షెడ్యూల్..

వరంగల్- ఖమ్మం-నల్గొం డ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల నమోదు కార్యక్రమం ఈ నెల 30 నుంచి ప్రారంభం కానుండగా.. నవంబరు 6 వరకు దరఖాస్తులకు అవకాశం కల్పించారు. నవంబరు 23న ముసాయిదా జాబితా ప్రకటించి.. ఈ జాబితాపై అభ్యంతరాలను డిసెంబరు 9 వరకు స్వీకరిస్తారు. డిసెంబరు 25 వరకు అభ్యంతరాలను పరిష్కరించి.. అదే నెల 30న ఓటరు



తుది జాబితా విడుదల చేయనున్నారు.

గత ఎన్నికల్లో 7,243 మంది ఓటర్లు..

గత ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఉమ్మడి జిల్లాలో మొత్తం 68 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 7,243 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 4,737 మంది, మహిళలు 2,505 మంది, థర్డ్ జెండర్ ఒకరు ఉన్నారు.

నల్గొండ పట్టణంలో అత్యధికంగా 1,667 మంది ఓటర్లు ఉండగా.. రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత స్థానంలో సూర్యాపేటలో 880 మంది, మిర్యాలగూడలో 788 మంది, కోదాడలో 466 మంది, భువనగిరిలో 306 మంది, దేవరకొండలో 229 మంది, నకిరేకల్‌లో 217 మంది ఓటర్లు ఉన్నారు. ఈసారి ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

అన్ని మేనేజ్‌మెంట్ల ప్రభుత్వ పాఠశాలలు, అన్ని రకాల కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో పాటు నిబంధనలకు అనుగుణంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ విద్యా సంస్థల ఉపాధ్యాయులు సైతం ఓటు నమోదుకు అర్హులు.

# చిగురిస్తున్న ఆశలు

మధిర : ఎర్రుపాలెం మండలంలోని రేమిడిచర్ల గ్రామ సమీపంలోని సర్వే నంబరు 372లోని 58 ఎకరాల స్థలాన్ని పారిశ్రామిక పార్కుకు కేటాయిస్తూ ఈనెల 20న రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. తద్వారా ఇక్కడ పారిశ్రామిక కేంద్రం ఏర్పాటుపై ఆశలు చిగురిస్తున్నాయి. అప్పట్లో కేటాయించినా.. రేమిడిచర్ల సమీపంలోని 58 ఎకరాల గ్రామకంఠం భూమిని పారిశ్రామిక కేంద్రం ఏర్పాటుకు సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి డిప్యూటీ స్పీకర్ మల్లు భట్టివిక్రమార్క చొరవతో కేటాయించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటంతో పరిశ్రమలు ఏర్పాటు చేస్తారని నిరుద్యోగులు ఎదురుచూసినా దాదాపు పదేళ్లు కార్యరూపం దాల్చలేదు. నిరుద్యోగులు



ఏపీలోని కృష్ణా జిల్లాలోని పారిశ్రామికవాడల్లో రోజువారీ కూలీలుగా వలస వెళుతున్నారు. పారిశ్రామిక పార్కుకు కేటాయించిన భూమి.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలోని వాణిజ్య నగరం విజయవాడకు కేవలం 40 కి.మీ. దూరంలోనే రహదారి, రైల్వేట్రాక్ పక్కనే ఉండటం గమనార్హం. పది సంవత్సరాల అనంతరం మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వ రావడంతో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ప్రత్యేక దృష్టి సారించారు. ఆ భూమిని పారిశ్రామిక పార్కుకు కేటాయిస్తూ మంత్రివర్గం ఇటీవల తీర్మానించింది. ఇక్కడ పరిశ్రమ ఏర్పాటవుతుందని నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

వ్యవసాయం అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తే నిరుద్యోగులు, రైతు కూలీలకు ఆసరాగా ఉంటుందని స్థానికులు అభిప్రాయపడు తున్నారు. పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని ఈప్రాంత వాసులు కోరుతున్నారు. జులై నెలలో డ్రోన్ పరీక్ష కేంద్రం ఏర్పాటుకు ఏవియేషన్ అధికారుల బృందం వచ్చి ఈ భూములను పరిశీలించి వెళ్లింది.

# రూ.251 కోట్లు వృథా

హైదరాబాద్: డంపింగ్‌యార్డు నిర్లక్ష్యంతో రూ.251 కోట్ల ప్రజాధనం వృథాగా మారింది. మల్కారం చెరువు శుద్ధి పనులను ఇటీవలే జీహెచ్‌ఎంసీ పూర్తి చేసింది. మూడేళ్లు శ్రమించి మురుగు మొత్తాన్ని శుద్ధి చేసిందని అనుకునేలోపే డంపింగ్‌యార్డు వల్ల చెరువు మళ్లీ కాలుష్య జలాలతో నిండిపోయింది. వద్దంటున్నా వినకుండా తటాకం పక్కనున్న స్థలంలో లక్ష టన్నులకుపైగా చెత్తను కుప్పగా పోయడంతో ఇటీవలి వర్షాలకు వ్యర్థాల నుంచి వెలువడిన వరద నీరంతా చెరువును ముంచెత్తింది. జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 2009లో శామీర్‌పేట మండలం, జవహర్‌నగర్ గ్రామంలో 338 ఎకరాలను కేటాయించింది. అప్పట్నుంచి నగరంలో ఉత్పత్తయ్యే చెత్త అంతా అక్కడికే తరలుతోంది. 2012లో రాంకీ సంస్థ నిర్వహణ పనులు చేపట్టింది. చెత్త కుప్పల మురుగును శుద్ధి చేయకుండా వదిలేయడం వల్ల పక్కనున్న మల్కారం చెరువు కలుషితమైందని స్థానికులు వాపోయారు. అయినప్పటికీ అధికారులు రాంకీ సంస్థ యాజమాన్యానికి సంబంధించిన మరో సంస్థకు చెరువు శుద్ధి పనులను అప్పగించారు. 3 నెలల క్రితం పని పూర్తయినట్లు వెల్లడించారు. అంతలోనే చెరువు మళ్లీ మురుగుతో నిండిపోయింది. రోజువారీ వ్యర్థాలను నిల్వ చేసేందుకు స్థలం కొరవడిందని, చెరువు పక్కనున్న ఖాళీ స్థలంలో నిల్వ చేయాల్సి వచ్చిందని అధికారులు చెబుతున్నారు.

# రూ.50లక్షల వ్యయం.. అలంకారప్రాయం

తాండూరు : తాండూరు పట్టణ శివారులోని మాతా, శిశు సంరక్షణ కేంద్రం ఆవరణలో రూ.లక్షలు పోసి నిర్మించిన నిర్మాణాలు వృథాగా మారాయి. వాటిని ఉపయోగంలోకి తేవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై తీవ్ర విమర్శలొస్తున్నాయి.

రూ.50లక్షలతో వేచిఉండే గదుల ఏర్పాటు: ఆస్పత్రికి రోగుల వెంట వచ్చే సహాయకులు విశ్రాంతి తీసుకోవటానికి ఆవరణలో రూ.50 లక్షలతో వేచి ఉండే గది నిర్మించారు. దీంతో పాటు క్యాటరింగ్, జనరల్ వస్తువుల విక్రయానికి దుకాణాలు నిర్మించారు. వీటిని గత ఏడాది అప్పటి ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రారంభించారు. నిర్మాణాలు పూర్తయి ఏడాదిన్నర కావస్తున్నా ఇప్పటికీ తెరుచుకోలేదు. పర్యవసానంగా రోగుల వెంట వచ్చే వారికి ఆసుపత్రి ప్రాంగణమే ఆధారంగా నిలుస్తోంది. పగలు చెట్ల కింద, చుట్టుపక్కల భవనాల వద్ద వేచి ఉంటున్నారు. రాత్రి వేళ నిద్రపోవడానికి మాత్రం తీవ ఇబ్బందులు పడుతున్నారు. భవనాన్ని అందుబాటులోకి తెచ్చి ఉపశమనం కలిగించాలని కోరుతున్నారు.

ఆసుపత్రికి దారెటో చెప్పండి

పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర



ప్రభుత్వం ఆరోగ్య శాఖలో అనేక మార్పులు చేస్తోంది. నూతన ఆసుపత్రుల నిర్మాణాలు చేపడుతోంది. ఇందులో భాగంగా పెద్దేముల్‌లో ప్రాథమిక ఆరోగ్య భవనం శిథిలావస్థకు చేరడంతో దీని వెనుక భాగంగా రూ.1.5 కోట్లతో కొత్త భవనం నిర్మించారు. అన్ని విభాగాలకు వేర్వేరుగా గదులను నిర్మించారు. రెండు నెలల క్రితం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కొత్త భవనాన్ని ప్రారంభించారు. పాత భవనం ఖాళీ చేసి వైద్య సిబ్బంది దీన్లోకి వెళ్లిపోయారు. అన్ని సేవలు రోగులకు అందుబాటులోకి తెచ్చారు. అయితే కొత్త భవనం కనిపించే విధంగా దారి ఏర్పాటు చేయలేదు. దీంతో రోగులు అయోమయానికి గురవుతున్నారు. ముందు భాగంలో పాతది, ప్రసూతి విశ్రాంతి భవనం, సిబ్బందికి కేటాయించిన మరో భవనం ఉన్నాయి. పాత భవనాన్ని పూర్తిగా మూసి వేశారు. వైద్యం కోసం వచ్చిన రోగులు కొత్త ఆసుపత్రి ఎక్కడ ఉందని అడిగి వెనక వైపు వెళ్లాల్సి వస్తోంది. సరైన దారి ఏర్పాటు చేయాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.

# నిరుద్యోగులకు సాయం.. భవితకు ఊతం

వికారాబాద్ : పట్టణం, పల్లె అనే తేడా లేకుండా రోజురోజుకీ నిరుద్యోగ సమస్య అధికమవుతోంది. దీంతో ప్రతి చిన్న ఉద్యోగానికి లక్షల మంది పోటీ పడుతున్నారు. ఇలాంటి తరుణంలో వీరి ఉపాధికి బాటలు వేసేందుకు  కృషి చేస్తోంది జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం. పదో తరగతి ఉత్తీర్ణులైతే చాలు ఉపాధి కార్డు ఇస్తున్నారు.  పేరును కార్యాలయంలో నమోదుచేసుకుంటే అధికారులు ఉపాధి కల్పనకు, స్వయం ఉపాధికి తోడ్పాటునిస్తున్నారు.

కార్డు పొందడానికి ప్రత్యేక కౌంటర్

నిరుద్యోగులు ఉపాధి కార్డు పొందటానికి ఈ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. అభ్యర్థులు ధ్రువపత్రాలతో వచ్చి నమోదు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో అయితే మీసేవ కేంద్రాలకు వెళ్లి ఎంప్లాయ్‌మెంట్.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పించారు. స్మార్ట్‌ఫోన్‌లో కూడా చేసుకోవచ్చు. విద్యార్హత, ఆధార్, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు జతచేయాల్సి ఉంటుంది. తర్వాత కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఒక్కసారి తీసుకుంటే 45 సంవత్సరాలు చెల్లుబాటు



గతంలో మాదిరిగా కాకుండా ఒకసారి కార్డు తీస్తే 45 సంవత్సరాల వరకు చెల్లుబాటులో ఉంటుంది. ప్రతి సంవత్సరం నవీకరణ చేయాల్సిన అవసరం లేదు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీల సమాచారం జిల్లా ఉపాధి కార్యాలయానికి అందుతుంది. ఉపాధి కార్డు సీనియారిటీ ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తారు. విద్యార్హతలను బట్టి ప్రభుత్వ ప్రైవేట్ ఖాళీలు వివరాలను అభ్యర్థులకు మెయిల్ ద్వారా అందజేస్తారు. విదేశాల్లో ఉన్న ఖాళీల సమాచారాన్ని కూడా తెలియజేస్తారు.

ప్రతి నెలలో ఒకటి చొప్పున జిల్లాలో ఉద్యోగమేళాలను నిర్వహిస్తున్నారు. వీటిలో ఎస్‌బీఐ కార్డు, ఫ్లిప్‌కార్డ్, పేటీమ్, శుభగృహ, అపోలో ఫార్మసీ, అపోలో హెల్త్‌కేర్, ఎల్‌ఐసీ, టాటా, సెక్యూరిటీ వంటి సంస్థలు పాల్గొంటున్నాయి.

మెగా ఉద్యోగమేళాకు చర్యలు

ప్రతి మూడు నెలలకోసారి నియోజక వర్గం కేంద్రాల్లో మెగా ఉద్యోగమేళాను నిర్వహించటానికి చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం నెలలకు ఒకటి, రెండు చొప్పున జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం ఆవరణంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నాం. ప్రతి ఒక్క నిరుద్యోగి తప్పని సరిగా పేరును నమోదు చేసుకోవాలి.

షేక్ అబ్దుస్ సుభాన్, జిల్లా ఉపాధి కల్పనాధికారి, వికారాబాద్

ఇదీ పరిస్థితి..

జిల్లా కేంద్రంలోని ఐటీఐ ఆవరణలో ఉపాధి కల్పనా కార్యాలయం ఏర్పాటు.

ఇప్పటిదాకా నమోదు చేసుకున్న నిరుద్యోగులు: 6200

గత రెండేళ్లలో నిర్వహించిన : 28

ఆగస్టు 30 వరకు ఉపాధి పొందిన వారు: 1018 మంది

# పాలన సాగేదెట్లా?




సిరిసిల్ల: పరిపాలన సౌలభ్యం.. ప్రజల చెంతకు అధికారులు.. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచేలా పరిపాలన వికేంద్రీకరణ కోసం జిల్లాలను ఏర్పాటు చేశారు. విభజనతో సరిపడా అధికారులు లేక పలు స్థానాలు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయి. అక్టోబరుతో జిల్లా ఏర్పడి ఎనిమిదేళ్లు పూర్తవుతాయి. కొన్ని శాఖలకు జిల్లా అధికారుల పోస్టులు లేవు. ఇన్‌ఛార్జులతో కొనసాగిస్తున్నారు. ఫలితంగా అధికారులకు పనిభారం.. విధుల నిర్వహణ సవాల్‌గా మారుతోంది. ఇటీవలే ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ముగిసింది. అయినా ఖాళీలు మాత్రం అలాగే ఉండటంతో పరిపాలనపై ప్రభావం పడుతుంది.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు చేరాలన్నా.. అభివృద్ధి పరుగులు పెట్టాలన్నా జిల్లా అధికారుల పాత్ర కీలకం. ఎస్సీ, బీసీ, మైనార్టీ సంక్షేమశాఖలకు జిల్లా అధికారుల పోస్టులే లేవు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా సీనియర్ అసిస్టెంటుకు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో గిరిజన సంక్షేమశాఖ లేదు. కార్యకలాపాలు కరీంనగర్ నుంచే కొనసాగుతున్నాయి. మైనార్టీశాఖను భూసేకరణ విభాగం ప్రత్యేక కలెక్టర్‌కు, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల బాధ్యతలను ఆయా శాఖల్లోని సీనియర్లకు అప్పగించారు. కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు, విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటివి సకాలంలో విడుదల కాక ఇబ్బందులు తప్పడం లేదు.

పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. దీనికితోడు జిల్లా పంచాయతీ, డివిజనల్ పంచాయతీ అధికారులిద్దరు బదిలీపై వెళ్లారు. గ్రామీణాభివృద్ధి అధికారికి డీపీవో, డిప్యూటీ సీఈవోకు డీఎల్‌పీవోలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లాలో ఈనెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు స్వచ్ఛతాహీ సేవా రెండో విడత కార్యక్రమం ప్రారంభమైంది. దీనిపై పర్యవేక్షణ లేక అంతంత మాత్రంగానే సాగుతోంది.

రహదారులు, భవనాలశాఖ ఈఈ మేలో పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి కరీంనగర్ ఈఈకి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీనికితోడు జిల్లాలో నలుగురు డీఈలకు ఇద్దరు, 12 మంది జేఈలకు ఐదుగురు మాత్రమే ఉన్నారు. ఇటీవల వర్షాలకు 29 కిలోమీటర్ల మేర రహదారులు శిథిలమయ్యాయి. ఐదు చోట్ల వంతెనలు దెబ్బతిన్నాయి. వీటికి శాశ్వత మరమ్మతులకు రూ.55 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లా అధికారి లేక దస్త్రం ముందుకు కదలడం లేదు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ రెండు పురపాలికల కమిషనర్లు ఉన్నత ఉద్యోగాల పరీక్షలకు సిద్ధమయ్యేందుకు సెలవుపై వెళ్లారు. వీరి బాధ్యతలను మేనేజర్‌లు చూస్తున్నారు. జిల్లా ఆవిర్భావం నుంచి మెప్మాకు సిరిసిల్ల కమిషనర్ అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

కలెక్టరేట్‌లో తూనికలు,

కొలతలు, డ్రగ్స్ కంట్రోల్, లీడ్ బ్యాంకుకు సంబంధించిన కార్యాలయాలు లేవు. ఖాళీగా ఉన్న అధికారుల పోస్టులపై కలెక్టరేట్ ఏవో రాంరెడ్డిని 'సంప్రదించగా జిల్లా అధికారుల పోస్టింగ్‌లు రాష్ట్రస్థాయిలోనే జరుగుతాయని తెలిపారు.

జిల్లాకు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ పోస్టు మంజూరు కాలేదు. మొన్నటి వరకు ఇన్‌స్పెక్టర్‌కే ఏడీగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఇతను బదిలీ కావడంతో సిద్దిపేటలోని ఇన్‌స్పెక్టర్‌కు అప్పగించారు. ఇప్పటికే జిల్లాలో ఐదు మండలాలకు సర్వేయర్లు ఖాళీగా ఉన్నారు. సర్వే కోసం మూడు వేల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సిద్దిపేట జిల్లా మత్స్యశాఖ అధికారి ఈ జిల్లా బాధ్యతలు చూస్తున్నారు. జిల్లాలో ప్రజారోగ్యశాఖ పోస్టు ఉన్నప్పటికీ సిరిసిల్ల పురపాలక డీఈకి అదనపు బాధ్యతలు అప్పగించారు. వేములవాడ పురపాలక పట్టణ ప్రణాళిక అధికారికి వీటీఏడీఏ కార్యదర్శి, జిల్లా పట్టణ ప్రణాళిక అధికారి బాధ్యతలు కూడా చూస్తున్నారు.

# పేరుకే కమిటీలు.. పరిష్కారం కాని సమస్యలు



హుజూరాబాద్: పట్టణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి జిల్లాలోని పురపాలికలు, నగరపాలికల్లో ఏర్పాటుచేసిన వార్డు కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలాయి. అభివృద్ధి పనుల్లో పాలకవర్గం, అధికార యంత్రాంగంతోపాటు ప్రజలను భాగస్వాములను చేసే లక్ష్యంతో 2020 ఏప్రిల్‌లో గత ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. నాలుగేళ్లు దాటినా ఈ కమిటీల సలహాలు, సూచనలు తీసుకోకుండా నిర్వీర్యం చేశారు. ఫలితంగా అభివృద్ధి పనుల్లో వీరి భాగస్వామ్యం పూర్తిగా కొరవడింది.

401 వార్డులు.. 1844 కమిటీలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 14 పురపాలికలతోపాటు.. కరీంనగర్, రామగుండం నగరపాలికల్లోని 401 వార్డుల్లో 1844 కమిటీలను ఏర్పాటుచేశారు. ఇందులో 27,660 మంది సభ్యులున్నారు. ఒక్కో వార్డుకు నాలుగు కమిటీల చొప్పున ఒక్కో కమిటీలో 15 మంది సభ్యులతో.. యువకులు, విశ్రాంత ఉద్యోగులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిపి వీటిని ఏర్పాటు చేశారు.

సమావేశాల ఊసే లేదు..ప్రతి వార్డుకు కమిటీలను నియమించి సభ్యులకు లక్ష్యాలు నిర్దేశించారు. అయితే ఏర్పాటు సమయంలో చూపిన ఆసక్తి.. ఆ తర్వాత పూర్తిగా కొరవడింది. వార్డు కమిటీ సభ్యులతో రెండు, మూడు నెలలకోసారి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి.. చేపట్టాల్సిన పనులు, సమస్యలపై చర్చించాలి. అనంతరం అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా పనులను ఎంపిక చేసి వార్డు అధికారి ద్వారా పురపాలక కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాలి. కమిషనర్ పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లి ఆయా సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాల్సి ఉంది. అయితే ఒక్కసారి కూడా కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించడం, అభివృద్ధి పనుల ప్రణాళికలు రూపొందించిన దాఖలాలు లేవు. ఫలితంగా సమస్యలు వెంటాడుతున్నాయి.

ఈ ప్రభుత్వం అయినా పట్టించుకునేనా?

ఆయా వార్డుల్లో వనమహోత్సవం, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, అక్రమ నిర్మాణాల గుర్తింపు తదితర అంశాలపై పాలకవర్గం, అధికార యంత్రాంగం ఈ కమిటీ సభ్యుల సలహాలు, సూచనలు తీసుకొని ఆయా పనులను చేపట్టాల్సి ఉంటుంది. కానీ నాలుగేళ్లుగా ఈ కమిటీల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా నిర్వీర్యం చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాకనైనా వీటికి ప్రాధాన్యత ఇస్తుందని ఆశించినా.. ఆ దిశగా చర్యలు మాత్రం చేపట్టలేదు. అసలు వార్డు కమిటీలు ఉన్నాయనే విషయం కూడా చాలామందికి తెలియదంటే వీటి ప్రాధాన్యత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

# రికార్డుల్లో నిషేధిత భూములు.. ధరణిలో ప్రైవేటు పట్టాలు

హైదరాబాద్: రాజధాని నగరం శివారు ప్రాంతాల భవిష్యత్తును ఊహించిన కొందరు వ్యక్తులు గండిపేట చెరువు సమీపంలో ప్రభుత్వ భూములను ఒక పథకం ప్రకారం ఆక్రమించేందుకు పాతికేళ్ల కిందటే ప్రణాళిక రచించారు. వట్టినాగులపల్లిలో  సర్వే నం. 110 నుంచి 150 మధ్య వందల ఎకరాల ప్రభుత్వ భూములను పేదలకు ఇచ్చినట్టు తెలుసుకున్నారు. అసైనీలకు ఇచ్చిన ప్రైవేటు పట్టాలు.. ఖాళీ ప్రభుత్వ భూముల పక్కనున్న 80 ఎకరాలను ఆక్రమించేందుకు కార్యాచరణ రూపొందించారు. కొందరు అసైనీల నుంచి, ప్రైవేటు పట్టాదారుల నుంచి భూములు కొని పక్కన ప్రభుత్వ స్థలాలకు మార్కింగ్ వేసుకున్నారు. వట్టినాగులపల్లి, గోపన్‌పల్లి, ఆర్థిక జిల్లాల పరిసర ప్రాంతాల్లో బహుళజాతి ఐటీ సంస్థలు వచ్చినా.. అనూహ్యంగా అభివృద్ధి చెందినా తొందరపడలేదు. ఐదేళ్ల కిందట ధరణి పోర్టల్ అందుబాటులోకి రాగానే.. గుట్టుచప్పుడు కాకుండా అక్రమార్కులు, వారి కుటుంబ సభ్యుల పేర్లను రికార్డుల్లోకి ఎక్కించి ప్రైవేటు పట్టాలుగా మార్చారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం రెవెన్యూ అధికారులు నిర్వహించిన తాజా సర్వేలో ఈ విషయం వెలుగులోకి రాగా, రికార్డుల మార్పిడిపై అంతర్గతంగా విచారణ చేస్తున్నారు. ఈ భూముల విలువ రూ.2500 కోట్లుంటుందని అంచనావేస్తున్నారు.

ధరణి
తెలంగాణ ప్రభుత్వం

# కాలయాపన.. తప్పని వేదన

పరిగి: ప్రజలకు ఉన్నత సేవలతో చేరువ కావాల్సిన రెవెన్యూ వ్యవస్థ రోజురోజుకూ సమస్యలకు నిలయంగా మారుతోంది. జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాల్లో పాస్ పుస్తకాలు, ఇతర పత్రాల మంజూరులో తీవ్ర కాలయాపన జరుగుతోంది. పలుచోట్ల పైసలిస్తేగానీ ఫైలు కదలని పరిస్థితి నెలకొందని అర్జీదారులు వాపోతున్నారు.

ఆదాయానికి లోటు లేదు: జిల్లాలో ఒక్కో మండలంలో రోజుకు 6 నుంచి 8 రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రోజు వారీగా దాదాపు రూ.8 నుంచి రూ.10 లక్షల ఆదాయం వస్తోంది. ప్రభుత్వానికి ఒక్కో ఎకరా మీద ఛార్జీల కింద రూ.20వేల వరకు రైతులు చెల్లిస్తున్నారు. సేవల విషయంలో మాత్రం వేగం కానరావడంలేదు.

పరిగి తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం  13 రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటిలో ఎక్కువగా వ్యవసాయానికి సంబంధించినవే ఉంటున్నాయి. కొన్నిసార్లు అధికారులు అందుబాటులో ఉండక పోవడం ఇబ్బంది కలిగిస్తోంది. వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో భూముల క్రయ విక్రయాలకు సంబంధించి 12 రిజిస్ట్రేషన్లు జరిగాయి. మొత్తం 15 మంది ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి నమోదు



చేసుకున్నారు. వివిధ కారణాలతో ముగ్గురు రిజిస్ట్రేషన్లు చేయించుకోలేదు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సజావుగా సాగింది.

కొత్త పథకం వస్తున్నందుకే జాప్యం

ధరణి పోర్టల్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం 'భూమాత' పథకాన్ని త్వరలో ప్రవేశ పెట్టనుంది. ఈ కారణంగా రెండు మాసాలుగా ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు చేయించుకున్న భూముల కొనుగోలుదారులకు కొత్త పాసుపుస్తకాల జారీని నిలిపి వేశారు.

తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వికారాబాద్.

నెలల తరబడి తిరుగుతున్నా..

మా గ్రామం తాండూరు మండలం మల్లాపూర్. మృతి చెందిన నా కుమారుడి పేరిట ఉన్న పీఎఫ్ సొమ్ము పొందాలంటే కుటుంబ సభ్యుల ధ్రువపత్రం సమర్పించాలన్నారు. గత మే 20న దరఖాస్తు చేశా. నాలుగు నెలలు గడిచినా జారీ చేయలేదు. సిబ్బందిని ఆరా తీస్తే దరఖాస్తు పత్రాలు కన్పించడంలేదనీ, నకలు ప్రతులు తీసుకురావాలన్నారు.

మాలతుల్జప్ప, మల్లాపూర్

మరోమారు చలానా కూడా కట్టా

కొడంగల్ మున్సిపల్ పరిధిలో 22 గుంతల భూమి గతంలో కొనుగోలు చేశా. మూడు నెలలుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ పాస్ పుస్తకం కోసం తిరుగుతున్నా. ఇటీవల మరో మారు రూ.300 చలానా కట్టమని చెబితే కట్టాను. పుస్తకం ఎప్పుడిస్తారో తెలియడంలేదు.

ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదనీ పట్టాదారు పాస్ పుస్తకాలు అందరికీ అందుతాయని కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు.

అచ్చుగట్ల శ్రీకాంత్, కొడంగల్ జిల్లాలో మండలాలు- 20 పంచాయతీలు- 566రోజుకు జరుగుతున్న   రిజిస్ట్రేషన్లు - 140 -160 ఎక్కువగా పాస్ పుస్తకాల మంజూరు, అనువంశికం.

ఆస్తి పంపకాలు తనఖా పెట్టడం దానపత్రాలు ఆస్తి మార్పిడి

# ప్రసాదం పసందేనా?

హైదరాబాద్ : ఆలయాల్లో ప్రసాదాల నాణ్యతపై ఇచ్చే బోగ్(బ్లిస్‌ఫుల్ హైజెనిక్ ఆఫరింగ్ టు గాడ్) పత్రాల జారీని జీహెచ్‌ఎంసీ నిలిపివేసింది. ఏడాది క్రితం ఫిబ్రవరిలో 10 ఆలయాలకు ఫుడ్ లైసెన్సులు, 8 దేవాలయాలకు బోగ్ పత్రాలు జారీ చేయగా ఇతర దేవాలయాలను పరిశీలించకపోవడం గమనార్హం. తిరుపతి లడ్డూ ప్రసాదం అంశం తెరపైకి రావడంతో నగరంలోని ఆలయాల్లో ప్రసాదాల పంపిణీపై భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షించడం ఇలా..తొలిదశలో భక్తులు అధికంగా వచ్చే దేవాలయాలను గుర్తించాలి. నీటి, సరకుల నాణ్యత, స్టోరేజీ, వంటగదిలో పరిశుభ్రతపై సూచనలివ్వాలి. ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి రిజిస్టర్ అయిన సంస్థల ద్వారా ప్రసాదం తయారు చేసే ఆలయ సిబ్బందికి ఫాస్ట్రాక్ శిక్షణ అందించాలి. అనంతరం ఫుడ్ లైసెన్సులు జారీ చేసి, రిపోర్టుల ఆధారంగా భోగ్ పత్రాలు జారీ చేయాలి. గ్రేటర్‌లో 1500కుపైగా ఆలయాలున్నాయి. రద్దీ అధికంగా ఉండేవి 100 వరకు ఉండగా కేవలం 8 ఆలయాల్లో బోగ్ పత్రాలు జారీ అయ్యాయి.

ఫుడ్ లైసెన్సులు జారీ అయిన దేవాలయాలివే..

మహాకాళి దేవస్థానం - సికింద్రాబాద్, ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానం - బల్కంపేట, హనుమాన్ దేవస్థానం - కర్మన్‌ఘాట్, వీర హనుమాన్ దేవస్థానం - ఎస్పీరోడ్డు, హనుమాన్ దేవస్థానం - సనత్‌నగర్, పెద్దమ్మ దేవాలయం - జూబ్లీహిల్స్, హనుమాన్ దేవాలయం - వివేక్‌నగర్, లక్ష్మీగణపతి దేవస్థానం - ఆర్టీసీ క్రాస్‌రోడ్, శ్రీసాయిబాబ సమాజం - మినిస్టర్‌రోడ్డు, శ్రీగణేష్ దేవాలయం - సికింద్రాబాద్.

విజయ డెయిరీ నుంచే నెయ్యి సేకరించాలి

ప్రసాదం నాణ్యత విషయంలో రాజీపడితే చర్యలు తప్పవంటూ ప్రభుత్వం హెచ్చరించింది. విజయడైరీ నుంచే నెయ్యిని సేకరించాలని.. మధ్యవర్తులుంటే తొలగించాలని ఉన్నతాధికారులు ఈవోలకు సూచించారు. బల్కంపేట్ దేవాలయానికి ఆది, మంగళవారాల్లో 50వేల మంది, శుక్రవారం 20వేల మంది భక్తులు వస్తుంటారు. ఆయా రోజుల్లో 4 నుంచి 5 క్వింటాళ్ల పులిహోర, క్వింటా లడ్డూలు విక్రయిస్తారు. వంటశాలలో 8 మంది పనిచేస్తుండగా ఇద్దరిని ఫాస్ట్రాక్ శిక్షణకు పంపించారు. లడ్డూ ప్రసాదం కోసం ఏటా 10వేల లీటర్ల నెయ్యిని వాడుతామని ఆలయ అధికారులు తెలిపారు.

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయాన్ని మంగళ, శుక్రవారాల్లో 5-6 వేల మంది భక్తులు సందర్శిస్తుంటారు. రోజూ 15-70 కిలోల పులిహోర, 500 లడ్డూల విక్రయాలు సాగుతాయి. ఇక్కడ కిలో లడ్డూ తయారీకి 750 మిల్లీలీటర్ల నెయ్యిని వినియోగిస్తున్నట్టు సిబ్బంది తెలిపారు.

సికింద్రాబాద్‌లోని గణేష్ దేవాలయంలో శుక్రవారం, సెలవు రోజుల్లో 1500 నుంచి 2వేల మంది వస్తుంటారు. రోజూ 500 లడ్డూలు, 500 పులిహోర ప్యాకెట్లు విక్రయిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## నిరభ్యంతర పత్రాల దందా

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ఎంవీ భూపాల్‌రెడ్డి అనిశాకు చిక్కడం రెవెన్యూ శాఖలో ప్రకంపనాలు సృష్టిస్తోంది. ఎలాంటి అక్రమాలకు పాల్పడ్డారనే దానిపై రెవెన్యూ ఉన్నతాధికారులు, అనిశా అధికారులు సాక్ష్యాధారాలు సేకరిస్తున్నారు. అదనపు కలెక్టర్ కార్యాలయ కేంద్రంగా నిరభ్యంతర పత్రాల దందా కొనసాగిందన్న ప్రాథమిక సమాచారం లభించినట్టు తెలిసింది.

**నాలుగో వ్యక్తికి తెలియకుండా**

నిరభ్యంతర పత్రాల జారీలో కీలక బాధ్యతలు పోషిస్తున్న ఒక అధికారి,



అతడి సహాయకుల్లో ఇద్దరు నాలుగో కంటికి తెలియకుండా వ్యవహారాలను చక్కబెట్టినట్టు సమాచారం. శేరిలింగంపల్లి, గండిపేట, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల పరిధుల్లో ఇళ్లు, దుకాణాలు, బహుళ అంతస్తుల భవనాలు నిర్మించేవారి నుంచి వీరు రూ.లక్షల్లో నగదు తీసుకున్నారు. భూముల క్రమబద్ధీకరణకు జీవో నంబరు 59కింద వచ్చిన దరఖాస్తుల్లో కొన్నింటినుంచి రూ.కోట్లలోనే ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి.

**టెండర్లలోనూ అమ్యామ్యాలు** రంగారెడ్డి జిల్లాలోని గురుకుల విద్యాసంస్థల విద్యార్థులకు ఆహారాన్ని సరఫరా చేసేందుకు టెండర్ల ఖరారులోనూ అమ్యామ్యాలు డిమాండ్ చేసినట్టు తెలిసింది. డబ్బు ఇవ్వకపోవడంతో ఆ టెండర్లను తొక్కిపెట్టినట్టు సమాచారం.

## ముంపు ముప్పు తప్పేదెన్నడో?

జమ్మికుంట : ముంపు ప్రాంతమైన జమ్మికుంట హౌసింగ్ బోర్డు కాలనీవాసులకు ఏటా వర్షాకాలంలో తిప్పలు తప్పడం లేదు. ఇళ్లలోకి మోకాలు లోతు నీరు చేరి తీవ్ర నష్టం కలుగుతోంది. భారీ వర్షం పడితే కంటి మీద కునుకు లేకుండా స్థానికులు మానసిక క్షోభ అనుభవిస్తున్నారు. ప్రాంతలైన దుర్గాకాలనీ, హన్మండ్లపల్లి, అంబేడ్కర్ కాలనీలలోనూ పదేళ్లుగా ముంపు తిప్పలు తప్పటం లేదు.

**సమస్య ఎక్కడుంది?**

ఒకప్పుడు కుంట ప్రాంతంగా ఉన్న స్థలంలో హౌసింగ్‌బోర్డు కాలనీ నిర్మాణమైంది. 2018లో కురిసిన భారీ వర్షంతో సుమారు 300 గృహాలు, పరిసర ప్రాంతంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి సెల్లార్ పరిసర ప్రాంతాలు నీట మునిగాయి. రోజుల తరబడి బాధితులు తీవ్ర



ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ పాలక కమిటీ రూ.35 లక్షలతో వరద కాలువ నిర్మాణాన్ని చేపట్టింది. 2020లో కాలువ నిర్మాణం చేసినా సమస్య పరిష్కారం కాలేదు. 2021, 2023లలో భారీ వర్షాల కారణంగా దాదాపు 400 ఇళ్లవారు పడరాని కష్టాలు పడ్డారు. ఎన్నికల సమయాల్లో పలు పార్టీల నేతలు క్షేత్రస్థాయిలో పరిశీలించి వరద కాలువ నిర్మాణం పూర్తికి హామీలు ఇచ్చారు. పాలకులు పూర్తి స్థాయిలో వరద కాలువ నిర్మించడంతోపాటు సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పుర కమిషనర్ అయాజ్‌ను సంప్రదించగా వరద కాలువ నిర్మాణం కోసం ఇంజినీరింగ్ అధికారులతో అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపించామని తెలిపారు.

## భారీవర్షం.. పత్తి రైతు ఆగమాగం!

నెల్లికుదురు : ఇనుగుర్తి, నెల్లికుదురు మండల గ్రామాల్లో రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం పడడంతో పలుచోట్ల విద్యుత్తు స్తంభాలు పడిపోయాయి. సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పత్తి పంట నేలవాలింది. అక్కడక్కడ పంట చేల్లో విద్యుత్తు తీగలు అక్కడక్కడ నేలవాలడంతో రైతులు ఆందోళన చెందారు. ఇనుగుర్తి మండలం



చిన్ననాగారం గ్రామ పరధిలో సుమారు 60 ఎకరాల్లో పత్తి పంట నేలకొరిగింది. చిన్ననాగారం విద్యుత్తు ఉపకేంద్రంలో చెట్టు కూలి సిబ్బంది ఎల్లగౌడ్, వెంకన్నకు చెందిన ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. మీట్యాతండా పంచాయతీ పరిధిలోని పంతులుతండాలో జనవాసాల మధ్య ఉన్న విద్యుత్తు స్తంభం నేలకొరగడంతో తీగలు తెగిపోయాయి. అప్రమత్తమైన అధికారులు విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో తండావాసులు ఊపిరి పీల్చుకున్నారు.

## ఆరోగ్య భాగ్యం.. పెరటి మొక్క పెంపకం



పరిగి : పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం వన మహోత్సవాన్ని నిర్వహిస్తోంది. ఇందుకోసం కోట్లాది రూపాయలను వెచ్చిస్తోంది. లక్ష్య సాధనలో భాగంగా ఈసారి గ్రామీణాభివృద్ధి అధికారులు ప్రజలు పెరట్లో పెంచుకునే మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. వాటినే ఎక్కువగా పంపిణీ చేస్తున్నారు. వీటిని తీసుకువెళ్లేందుకు ప్రజలు సైతం ఉత్సాహం చూపుతున్నారు. జిల్లాలో అడపా దడపా వర్షాలు కురుస్తుండటంతో ప్రభుత్వ, ప్రైవేటు, స్థలాలు, పరిశ్రమల ప్రదేశాలు, రహదారులు, పొలం గట్లు ఇలా పెద్దఎత్తున మొక్కలు నాటుతున్నారు. రైతులు ఇష్టపడే నీలగిరి, టేకు వంటి వాణిజ్య మొక్కలకు ప్రాధాన్యం ఇస్తున్నారు. నాటిన మొక్కల సంరక్షణ విషయంలోనూ ఈసారి ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టి సారించింది. పంచాయతీ రాజ్, ఉపాధి హామీ, అటవీ శాఖల పర్యవేక్షణ: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పథకం కింద కొన్ని నెలలుగా అధికారులు పక్కా ప్రణాళికను చేపట్టారు. పంచాయతీరాజ్, ఉపాధిహామీ, అటవీశాఖల పర్యవేక్షణలో వీటిని పెంచారు. గ్రామాల్లో సర్పంచులు లేకపోవటంతో ఆయా గ్రామాల పంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో మొక్కలు నాటే కార్యక్రమం కొనసాగుతోంది.

వేసవిలో మొక్కలకు నీరందించేందుకు అక్కడక్కడ ఇబ్బందులు తలెత్తినా అధిగమించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. పంచాయతీ ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయించారు.

పూడూరు మండలంలోని 31, పరిగి మండలంలోని 37 పంచాయతీల పరిధిలోని నర్సరీల్లో మొక్కలు సిద్ధం చేశారు. ఉపాధి హామీ కూలీలతో గ్రామాల్లో మొక్కలు నాటే పనులు ఊపందుకున్నాయి. పరిగి మండలంలో 1.19లక్షల మొక్కలు నాటుతున్నారు.

పంచాయతీకి కేటాయింపు ఇలా..

మొత్తం గ్రామ పంచాయతీలు.. 566

ఈసారి ఇవ్వనున్నవి 8,000

నర్సరీల ఏర్పాటు.. 563

ఒక్కో పంచాయతీకి గతేడాది.. 4500 మొక్కలు

ఉసిరి, జామ, కరివేపాకు, మామిడి తదితరాలు

ప్రజలు ఆసక్తి చూపే మొక్కల పెంపకాన్ని కూడా చేపట్టారు. ప్రధానంగా కరివేపాకు, బొప్పాయి, అల్లనేరెడు, దానిమ్మ, జామ, మామిడి, తులసి, కలబంద ఉసిరి, గులాబి, మందారం వంటి మొక్కలను సరఫరా చేయడంతో వాటిని తీసుకువెళ్లేందుకు ప్రజలు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. అనేక రకాల ఔషధ మొక్కలు, పెరట్లో పెంచుకునే పూల మొక్కలకు ప్రాధాన్యం ఇచ్చారు.

సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

నిర్ణీత లక్ష్యాన్ని పూర్తిచేయడంతో పాటు ప్రధానంగా వాటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. వాటి నిర్వహణ బాధ్యతలను క్షేత్ర సహాయకులు, గ్రామ పంచాయతీలతో పాటు మేమూ తీసుకుంటాం. ఉష, రాములు, ఏపీఓలు, పరిగి, పూడూరు.

## పడకేసిన నగరం..



కరీంనగర్ : జిల్లాలో సీజనల్ వ్యాధుల తీవ్రత పెరిగింది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా జ్వరాలు విస్తరిస్తున్నాయి. దీంతో బాధితుల వివరాలు సేకరించేందుకు వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అంతటా నిర్వహిస్తున్న జ్వరాల సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. కేవలం జ్వరంతో బాధపడేవారు కాకుండా ఇతర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న వారిని గుర్తించి అవసరమైన స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నారు. తీవ్రత ఉన్న వారిని జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలిస్తున్నారు.

**రోజూ 50 ఇళ్లకు తగ్గకుండా..**

గత నెల 25 నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఈ సర్వే ప్రారంభించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎం సూపర్‌వైజర్‌తోపాటు కొన్ని ప్రాంతాలకు వైద్యులు కూడా వెళ్తున్నారు. రోజూ 50 ఇళ్లకు తగ్గకుండా సర్వే చేస్తూ.. వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, పల్లె బస్తీ దవాఖానాలకు పంపించి అవసరమైన వైద్యం అందేలా చర్యలు చేపడుతున్నారు. కొన్నిచోట్ల బృందం పరీక్షించి ప్రాథమికంగా అవసరమైన ఔషధాలను అక్కడే అందజేస్తున్నారు.

**దోమలు వ్యాప్తి చెందకుండా..**

సర్వే బృందాలు ఇంటింటికి వెళ్లి నిల్వనీరు ఉన్నట్లైతే తొలగించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని కుటుంబసభ్యులకు చెబుతున్నారు. ఇప్పటివరకు ఏడు లక్షలకు పైగా మందిని సర్వే చేయగా.. మూడు వేలకు పైగా సాధారణ జ్వరాల బారిన పడ్డట్లు గుర్తించారు. ముఖ్యంగా దోమలు వ్యాప్తి చెందకుండా నియంత్రణ పద్ధతులు సూచిస్తున్నారు. సర్వేలో వెలుగుచూసిన అంశాలను.. పురపాలికలు, పంచాయతీ అధికారులకు సమాచారం అందేలా చూస్తున్నారు.

**వైద్యులను అప్రమత్తం చేస్తున్నాం- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి**

సర్వే చేయడమే కాకుండా జ్వరాల బారిన పడినవారిని గుర్తించి తగిన మందులు అందిస్తున్నాం. ఇప్పటివరకు 90శాతం మంది చికిత్స నుంచి కోలుకున్నారు. ఎప్పటికప్పుడు సీజనల్ వ్యాధులపై సమీక్షిస్తూ వైద్యులను అప్రమత్తం చేస్తున్నాం.

## రూ.15 లక్షలతో వసతుల కల్పన


మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాలలో కొన్ని రోజులుగా చోటు చేసుకున్న ఘటనలతో రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేగింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం వసతులు మెరుగు పరుస్తున్నారు. మరో రూ.50 లక్షలు మంజూరు చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించడంతో పాఠశాలలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు సమకూరుతాయన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. అంతే కాకుండా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్వయంగా పాఠశాలను సందర్శించడం, విద్యార్థులు, తల్లిదండ్రులతో మూడు గంటల పాటు మాట్లాడి భరోసా నింపే ప్రయత్నం చేశారు. ఉప ముఖ్యమంత్రి సందేశంతో తల్లిదండ్రుల్లో కొంత భయం తొలగించేలా చేశారు. పాఠశాలలో అయిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు మొత్తం 640 మందికి 540 మంది విద్యార్థులున్నారు. గత నెల 26న ఒకరు, ఈ నెల 9 మరొక విద్యార్థి మృతి చెందగా, నలుగురు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. దీంతో తల్లిదండ్రులు భయాందోళనకు గురై విద్యార్థులను ఇళ్లకు తీసుకెళ్లారు. ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయడంతో పాటు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌కు మెమో జారీ చేశారు. ఈ సంఘటనలు సంచలనం సృష్టించడంతో ప్రభుత్వం, అధికార యంత్రాంగం కదిలి దిద్దుబాటు చర్యలు ముమ్మరం చేశారు. జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పాఠశాలను సందర్శించి వసతుల కల్పనకు రూ.15 లక్షలు మంజూరు చేశారు. పాఠశాలలో పారిశుద్ధ్య చర్యలకు, మౌలిక వసతుల మెరుగునకు అదనపు కలెక్టర్ గౌతంరెడ్డికి బాధ్యతలు అప్పగించడంతో ఆయన దగ్గరుండి పనులు పర్యవేక్షించారు.

**దిద్దుబాటు చర్యలిలా..**

మెట్‌పల్లి, కోరుట్ల పురపాలికల నుంచి జేసీబీలు, పారిశుద్ధ్య కార్మికులను రప్పించి పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్లను తొలగించడంతో పరిసరాలు శుభ్రమయ్యాయి.

శిథిలావస్థకు చేరిన పాత గదులను తొలగించారు. భోజనశాలకు నూతనంగా రంగులు వేశారు.

పాఠశాలలో రూ.4.25 కోట్లతో నిర్మించిన నూతన భవనంలో విద్యుత్తు, ప్లంబింగ్ పనులు చేపట్టారు. తరగతి గదుల్లో పంకాలు బిగించారు.



విద్యార్థులు కూర్చొనేందుకు 120 డెస్క్ బెంచీలు తెప్పించారు. పాత తరగతి గదుల కిటికీలకు మెస్ జాలీలు అమర్చారు.

రెండు హైమాస్ట్ దీపాలను నూతనంగా ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రాంగణంలో స్తంభాలకు విద్యుత్తు దీపాలను బిగించారు.

మెరుగుపడాల్సిన సౌకర్యాలివీ..

పాఠశాలలో పురాతన మూత్రశాలలు, మరుగుదొడ్లు ముప్పై వరకు ఉన్నాయి. మరికొన్ని నిర్మించడంతో పాటు వాటిని ఆధునీకీకరించాల్సి ఉంది.

ప్రస్తుతమున్న భోజనశాలలో కేవలం 200 మంది విద్యార్థులు మాత్రమే భోజనం చేసేలా ఉంది. దానిని 600 మందికి సరిపోయే విధంగా విస్తరించాలి.

పాఠశాల ఆవరణలో ఉన్న పాత రేకుల షెడ్లు, నిరుపయోగంగా ఉన్న ప్రయోగశాలలు పూర్తిస్థాయిలో తొలగించాల్సి ఉంది.

నూతన భవనం కేవలం బోధనకు మాత్రమే సరిపోయేలా ఉంది. కొత్తగా వసతి కోసం నూతన భవనం నిర్మించడంతో పాటు అందులోనే మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలి.

పాఠశాలలోనే ఉపాధ్యాయులకు సైతం క్వార్టర్లు నిర్మించాలి. విద్యార్థులు నిద్రించేందుకు పడక మంచాలు అందుబాటులోకి తేవాలి.

ఆవరణలో ఉన్న పాడుబడ్డ బావి, పురాతన నీటి ట్యాంకులను తొలగించాలి. వంట గది నుంచి వెలువడ్డ మురుగు నీరు బయటకు వెళ్లేలా పైపులైన్ నిర్మించాలి.

చుట్టు పంట పొలాలు ఉండడంతో విష కీటకాలు లోనికి రాకుండా ప్రహరీ చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలి.

## ఆ నీరు తాగొచ్చా..!

సూర్యాపేట : గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా తాగేందుకు శుద్ధి నీరు, అవసరాలకు స్థానిక బోర్ల నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. కాగా ఈ నీరు సురక్షితమేనా.. కాదా.. అన్న సందిగ్ధం ప్రజల్లో నెలకొంది. ఇటీవల ట్యాంకుల శుభ్రతపైనా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో నీటి నాణ్యతపై కేంద్ర ప్రభుత్వం సర్వే చేయిస్తోంది. 'జల్ జీవన్ మిషన్'లో భాగంగా స్వచ్ఛంద సంస్థల సహకారంతో క్షేత్రస్థాయిలో నీటి నమూనాలు ఇప్పటికే సేకరించారు. త్వరలో పరీక్షించనున్నారు. నీటి సరఫరాపై సర్వే బృందాలు ఇంటింటికీ వెళ్లి ఆరా తీశాయి. నీటి పరీక్షల అనంతరం నివేదికల ఆధారంగా ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు కేంద్రం ప్రణాళికలు రూపొందించే అవకాశం ఉంది. ఒకవేళ బాగానే ఉంటే వాటినే అందించేలా ప్రోత్సహించనుంది.

**సర్వే రోజునే గ్రామం ఎంపిక**

ఉమ్మడి జిల్లాలోని 73 మండలాలు, 1740 గ్రామ పంచాయతీల్లో సర్వే చేపట్టారు. జల్ జీవన్ మిషన్ సర్వే బృందాలు గ్రామాల్లో సర్వే చేసే విషయాన్ని గోప్యంగా ఉంచారు. ఎలాంటి సమాచారం లేకుండా నేరుగా గ్రామాల్లోకి వెళ్లి ఆరా తీశారు. ముందస్తు సమాచారమిస్తే నీటి సరఫరాలో ప్రత్యేక ఏర్పాట్లు చేసుకునే అవకాశం ఉండటంతో వివరాలు వెల్లడించడం లేదు. ఏ రోజు, ఏ గ్రామంలో సర్వే చేయనున్నారో అదే రోజు గ్రామాన్ని ఎంపిక చేసుకుని క్షేత్రస్థాయికి వెళ్లారు. నీటి



నమూనాలను ప్రయోగశాలకు పంపించారు.

**యాప్‌లో నమోదు**

ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. ఇందులో మిషన్ భగీరథ పథకం ద్వారా కొంత, స్థానిక బోరుబావులతో కొంత నీటిని కలిపి ప్రజలకు అందిస్తున్నారు. ట్యాంకుల మొదటి నుంచి లీటర్, చివరి కుళాయి వద్ద లీటర్ నీటి నమూనాలు సేకరించారు. సర్వే బృందాలు సేకరించిన వివరాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్‌లో నమోదు చేస్తారు. ఎంపిక చేసిన గ్రామంలోని పాఠశాలలు, అంగన్‌వాడీలు, ఆరోగ్య కేంద్రాల్లో సరఫరా అవుతున్న నీటి నమూనాలు తీసుకున్నారు.

**సర్వే ఇలా..** గ్రామం, ఇంటి నంబర్ నమోదు, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఉందా.. నిత్యం ఎన్ని లీటర్ల నీరు సరఫరా అవుతుంది, తాగడానికి నీటిని వినియోగిస్తున్నారా లేదా వంటి వివరాలు సేకరించారు.

## కొరత తీరేలా.. ఉపాధికి బాసటగా!

కాగజ్‌నగర్ : కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్లు యాజమాన్యం కార్మికులు, రైతుల ఉపాధి కల్పనకు బాసటగా నిలుస్తోంది. కాగితం ఉత్పత్తికి ముడిసరకు కొరత లేకుండా హైబ్రిడ్ వంగడాలైన నీలగిరి, సుబాబుల్, సరుగుడు తదితర మొక్కల పెంపకానికి రైతులను ప్రోత్సహిస్తోంది. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం, వరంగల్, ఖమ్మం, గజ్వేల్‌తోపాటు మహారాష్ట్రలోని యావత్మాల్, చంద్రపూర్‌లలో రైతులకు మొక్కలను పంపిణీ చేసి పెరిగిన అనంతరం యాజమాన్యమే కొనుగోలు చేస్తోంది.

పట్టణంలోని పెద్దవాగు రోడ్డులో ఉన్న 25 ఎకరాల మిల్లు స్థలంలో సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, మొక్కల పెంపకం యూనిట్లను ఏర్పాటు చేశారు. విత్తన శుద్ధి చేసిన వాటిని స్థానికంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక యూనిట్లలో మొక్కలను పెంచుతున్నారు. వీటితోపాటు మొక్కలను అంటుకట్టి ప్రత్యేక వాతావరణ పరిస్థితులు కల్పించి వేర్లు వచ్చిన అనంతరం వాటిని రైతులకు అందజేస్తున్నారు. వివిధ జిల్లాల్లో మిల్లు యాజమాన్యం ఆధ్వర్యంలో మొక్కల పెంపకం 2020లో ప్రారంభించారు. స్థానికంగా ఈ యూనిట్లలో వంది మంది కూలీలు పనిచేస్తున్నారు.

**యాజమాన్యమే కొనుగోలు**

మిల్లులో రోజూ సుమారు 350-400 టన్నుల కాగితాన్ని ఉత్పత్తి చేస్తోంది. దాదాపు 1200 టన్నుల కర్ర అవసరం. ముడిసరకుకు భవిష్యత్తులో కొరత లేకుండా ఆయా ప్రాంతాల్లో రైతులను ప్రోత్సహించి ముడిసరకు ఉత్పత్తి చేపడుతున్న యాజమాన్యం దళారుల బెడద లేకుండా నేరుగా రైతుల నుంచి కర్రను కొనుగోలు చేస్తోంది. ఒక్కో మొక్కను రూ.2.50 రైతులకు అందిస్తుంది. ఎకరా విస్తీర్ణంలో వెయ్యి




మొక్కలు సాగు చేసుకోవచ్చు. మొదటి సంవత్సరం ఎకరాకు సుమారు రూ.20 వేల వరకు సాగు ఖర్చు ఉంటుంది. రెండో సంవత్సరం ఎలాంటి ఖర్చు ఉండదు. 8 ఇంచుల మందం కర్ర ఎదిగిన అనంతరం కొనుగోలు చేస్తారు. 15ఏళ్లపాటు దిగుబడి వస్తుంది. ఎకరాకు 50 టన్నుల దిగుబడి వస్తుంది. టన్నుకు రూ.4500-5000 వరకు చెల్లించి యాజమాన్యం కొనుగోలు చేస్తోంది.

**రైతులకు లాభసాటి**

రైతులు సుబాబుల్, నీలగిరి, సరుగుడు మొక్కల పెంపకానికి ఎస్పీఎం యాజమాన్యం ఎంతో ప్రోత్సహిస్తోంది. మొక్కల సరఫరాతోపాటు సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు సిబ్బందిని నియమించింది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాలు రావడానికి ఆ తోటలు దోహదం చేస్తున్నాయి. ఇతర పంటలతో పోల్చితే ఎంతో లాభదాయం. శ్రమ, పెట్టుబడి తక్కువగా ఉండడంతోపాటు ఆదాయం ఎక్కువగా వస్తుంది. వర్షాలతో సంబంధం లేకుండా దిగుబడి సాధించవచ్చు. వార్ల కోటేష్ ప్లాంటేషన్ జిల్లా ఇన్‌ఛార్జి ఎస్పీఎం

# రూ.కోట్ల వ్యయం.. నిష్ప్రయోజనం

రాజమహేంద్రవరం : గత వైకాపా ప్రభుత్వ హయాంలో స్వచ్ఛభారత్ మిషన్ పేరిట రూ.కోట్లు దుర్వినియోగం చేశారు. గ్రామాల్లో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ కోసం కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించారు. పల్లెల్లో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా పడకేసే పరిస్థితికి తీసుకొచ్చారు. నాసిరకం పరికరాలు, యంత్రాలు కొనుగోలు చేసి గ్రామ పంచాయతీలకు సరఫరా చేశారు. అవి కొద్ది రోజులకే మరమ్మతులకు గురై మూలకు చేరి తుప్పుపట్టాయి.

గ్రామాల్లోని జనాభా, సేకరించే చెత్త ఆధారంగా ట్రైసైకిళ్లు, ఈ-ఆటోలు, డీజిల్ వ్యాన్‌లు, ట్రాక్టర్లు, దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలు, గడ్డి, పనికిరాని మొక్కల తొలగింపునకు కట్టర్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు ముక్కలుగా చేసి ముద్దచేసే యంత్రాలు, ఇన్సినరేటర్లు, అధిక పీడనంతో పనిచేసే టాయిలెట్ క్లీనర్లు వంటివి అప్పటి వైకాపా ప్రభుత్వం 2020-23 సంవత్సరాల మధ్య పెద్దఎత్తున స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా కొనుగోలు చేసింది. దీనికోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ ఖర్చు చేసింది. ఆయా గ్రామ పంచాయతీలు పెట్టిన ప్రతిపాదనల మేరకు వాటిని దశలవారీగా అందించింది. దీనిలో భాగంగా జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలో మొత్తం 1,670 సరఫరా కాగా వాటిని అవసరత మేరకు ఆయా గ్రామ పంచాయతీలకు అందజేశారు. వీటిలో చాలావరకు గత రెండేళ్లుగా నిరుపయోగంగానే మిగిలాయి. ఇదీ పరిస్థితి



రాజమహేంద్రవరం డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లోని 147 పంచాయతీలకు, కొవ్వూరు డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లోని 153 పంచాయతీలకు యంత్రాలు సరఫరా చేశారు. వీటిలో ట్రైసైకిళ్లు 738, ఫాగింగ్ యంత్రాలు 186, ఇన్సినరేటర్లు, 237, కట్టర్లు 36, టాయిలెట్ క్లీనర్లు 204, మిస్ట్ బ్లోయర్లు 34, ఈ-ఆటోలు 72, డీజిల్ వ్యాన్‌లు 43, ట్రాక్టర్లు 156 ఉన్నాయి. ఫాగింగ్ యంత్రాలు, గడ్డి, పనికిరాని మొక్కలు తొలగించే కట్టర్లు, ఇతర పరికరాలను అసలు వినియోగించకుండానే కొన్నిచోట్ల మూలకు చేరాయి. మరికొన్నిచోట్ల వినియోగించే విధానం తెలిసిన సిబ్బంది లేకపోవడం వల్ల నిరుపయోగంగా మారాయి. వీటి ఒక్కొక్క దానికి రూ.1.50 లక్షల నుంచి 2.లక్షల వరకు వెచ్చించింది. నాసిరకం కొనుగోలు చేసి నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు అప్పట్లో వచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కొన్ని మరమ్మతులు చేయడానికి కూడా వీలులేని పరిస్థితిలో, మరికొన్ని మరమ్మతులు చేసినా ఉపయోగపడని స్థితిలో ఉన్నాయి.

కూటమి ప్రభుత్వం దృష్టి

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టిసారించింది. గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతాల్లో దోమల వ్యాప్తి చెందకుండా, ప్రజలు రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో మూలన పడిన పారిశుద్ధ్య పరికరాలు, యంత్రాలను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు యోచిస్తున్నారు. గత ప్రభుత్వం కొనుగోలు చేసి అందించిన ఫాగింగ్ యంత్రాలు, ఇతర పారిశుద్ధ్య పరికరాలు కొన్ని పనిచేయడం లేదని చెబుతున్నారు.

# అంతా గందరగోళం!

గోకవరం : వైకాపా ప్రభుత్వం 2022లో జిల్లాలను పునర్విభజన చేసిందే తప్ప ప్రధాన శాఖలకు రెగ్యులర్ ఎస్‌ఈ స్థాయి అధికారులు లేక పాలనాపరమైన అంశాలు అస్తవ్యస్తంగా మారాయి. ప్రధానంగా రూ.కోట్లతో ప్రజలకు అత్యవసరమైన తాగునీరు అందించే ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలో ఉన్న దిగువస్థాయి అధికా రులకే అదనపు బాధ్యతలు అప్పగించి చేతులు దులిపేసుకున్నారు. దీంతో తాగునీటి పథకాల పర్య వేక్షణ, జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో ఇంటింటా కొళాయి తదితర పనులన్నీ నీరుగారుతున్నాయి.


నీ డీఆర్‌ఈవో పేరుకే..జిల్లాల విభజనంలో ఆర్‌డబ్ల్యూఎస్‌కు ఎస్‌ఈ స్థాయి అధికారి ఇప్పటికి కాకినాడకు మాత్రమే ఉన్నారు. ఈఈ స్థాయి అధికారులకు డీఆర్‌ఈవో హెూదా కల్పిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు అప్పట్లోనే వైకాపా నియమించింది. వీరికి ఎటువంటి హెూదా, నిధులు లేకుండానే అటు ఈఈ, ఇటు డీఆర్‌ఈవోగా బాధ్యతల్లో ఉన్నారు. తాగునీటి పథకాలపై ఏ నిర్ణయం తీసుకోవాలన్నా డీఆర్‌ఈవోగా ఎటువంటి అధికారం లేకుండా ఉత్సవ విగ్రహాల్లా ఉండిపోయారు. పనులు చేసి బిల్లులు పెడితే ఏఈ, డీఈ, ఈఈ, ఎస్‌ఈ స్థాయిలోనే సంతకాలు ఉంటున్నాయే తప్ప



డీఆర్‌ఈవో ప్రమేయం లేకుండా పోయింది. ఇప్పటివరకు వీరికి రబ్బరు స్టాంప్ కూడా లేదు.సబ్‌డివిజన్ అనపర్తి.. ఉండేది లాలాచెరువు

పునర్విభజన చేసిన సమయంలోనే అర్‌డబ్ల్యూఎస్ శాఖకు అనపర్తి సబ్‌డివిజన్‌గా విడదీసి రాజానగరం, కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాలను తీసుకెళ్లి అందులో కలిపారు. దీంతో ఏ పనిచేసుకోవాలన్నా 70 కిలోమీటర్లు పైగా అనపర్తి చేరే పరిస్థితులు ఉన్నాయి. దీంతో రాజమహేంద్రవరం సమీపంలోని లాలాచెరువు వద్ద అద్దె ఇల్లు తీసుకుని సబ్‌డివిజన్ కార్యాలయం(అనపర్తి) పేరుతో ఉంచారు. అవసరమైన ఉద్యోగులు ఆ శాఖకు లేకపోవడమే కాకుండా పునర్విభజన అంతా గందరగోళంగా మారింది. ఏడుగురు డీఈలకు గాను ముగ్గురు, 22 మంది ఏఈలకు గాను 17 మంది పనిచేస్తున్నారు. ఇక చేతిపంపులు మరమ్మతులు చేసేందుకు మండలానికి ఒకరు చొప్పున మెకానిక్‌లు పనిచేయాలి. ఒకే ఒక్క మెకానిక్ మాత్రమే మొత్తం జిల్లా అంతా పనిచేస్తున్నారు.

# విధేయతకు అందలం



చిత్తూరు: నిరీక్షణ, ఉత్కంఠకు తెరదించుతూ కూటమి ప్రభుత్వం పలు నామినేటెడ్ పదవులను భర్తీ చేసింది. తొలి నుంచీ పార్టీ పట్ల విధేయత, కష్టకాలంలో కార్యకర్తలకు అండగా ఉన్న వ్యక్తులకే ఈ జాబితాలో పెద్దపీట వేశారు. మలివిడతలో మరిన్ని పోస్టులను ప్రకటించే అవకాశం ఉంది. దసరా నాటికి పదవుల పందేరాన్ని పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తదుపరి వెల్లడించే జాబితాలో జనసేన, భాజపా నాయకులకూ చోటు లభించనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధయం వహిస్తోన్న కుప్పం నుంచి ఆయనకు సన్నిహితుడైన పీఎస్ మునిరత్నాన్ని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పదవి వరించింది. దీంతో ఆయనకు కేబినెట్ హెూదా లభించనుంది. పర్యాటకాభివృద్ధి కార్పొరేషన్ సభ్యులుగా పదిమందిని నియమించగా చిత్తూరు నియోజకవర్గం నుంచి మాజీ మేయర్ కఠారి హేమలతను ఎంపిక చేశారు. ఆమె అత్తామామలు అనురాధ, మోహన్ తెలుగుదేశానికి సేవలందిస్తూ నగరపాలక సంస్థ కార్యాలయంలోనే హత్యకు గురయ్యారు. భర్త ప్రవీణ్ కరోనాతో మరణించారు. పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ సభ్యుడిగా పుత్తూరు మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన గంజి మాధవయ్యకు అవకాశం ఇచ్చారు. రామకృష్ణాపురం సర్పంచి, ఎంపీపీగా ఆయన పనిచేశారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయన చురుగ్గా పనిచేసి ప్రశంసలందుకున్నారు.

రెండో జాబితాపై ఆశావహులు..

నామినేటెడ్ పదవులను కట్టబెట్టేందుకు తెలుగుదేశం పార్టీ పెద్దఎత్తున కసరత్తు చేసింది. కార్యకర్తల అభిప్రాయాలతోపాటు ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గాల పరిశీలకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంది. మేలో జరిగిన ఎన్నికల్లో ఆయా నాయకుల పరిధిలోని బూత్‌లు, యూనిట్లు, క్లస్టర్లలో ఎంత మెజార్టీ వచ్చిందో ఆరా తీసింది. వీటి ప్రకారమే తొలి జాబితాను వెల్లడించినట్టు తెలుస్తోంది. ఇందులో పేర్లు లేని చాలామంది రెండో జాబితాపై ఆరా తీస్తున్నారు.

ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా మునిరత్నం

కుప్పం : కుప్పం నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నంను ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్‌గా నియమించారు. కుప్పం గ్రామీణ మండలం కంగుంది గ్రామానికి చెందిన మునిరత్నం తెదేపా ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నారు. కంగుంది సర్పంచిగా, కుప్పం ఎంపీపీగా పదవులు చేపట్టారు. 2014-19 మధ్య కాలంలో కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ (రెస్కో) ఛైర్మన్‌గా పనిచేశారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా.. పార్టీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తున్న ఆయన సేవలను గుర్తించడంపై శ్రేణుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

పర్యాటక కార్పొరేషన్ సభ్యురాలిగా కఠారి హేమలత

నామినేటెడ్ పదవుల భర్తీల్చో జిల్లాకు ప్రాధాన్యం దక్కింది. ఏపీ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ సభ్యురాలిగా చిత్తూరు నగర తెదేపా అధ్యక్షురాలు, మాజీ మేయర్ కఠారి హేమలతకు అవకాశం ఇచ్చారు. ఆమె పార్టీలో క్రియా శీలకంగా ఉంటూ పని చేస్తున్నారు. అందుకు గుర్తింపునిస్తూ ఆమెకు ఈ పదవిని కేటాయించారు. పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందించారు.పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్‌గా గంజి మాధవయ్య పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పుత్తూరుకు చెందిన గంజి మాధవయ్యను ప్రభుత్వం నియమించింది. మాధవయ్య 2013లో రామకృష్ణాపురం సర్పంచి, 2014లో ఎంపీటీసీ సభ్యుడిగా గెలిచి 2014- 19 వరకు పుత్తూరు ఎంపీపీగా పనిచేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్‌గాను ఉన్నారు.

# దేశీ ఆవు.. కసాయి చేతిలో



పలమనేరు : గోమాత కన్నీరు పెడుతోంది. దేశీరకం పెద్దఎత్తున కబేళాకు తరలుతోంది. వర్షాభావ పరిస్థితుల్లో రైతులు వాటిని పోషించలేక అందినకాడికి విక్రయించేస్తున్నారు. కేరళ రాష్ట్రంలో వాటి మాంసానికి గిరాకీ ఉండటంతో వ్యాపారులు ఆదాయవనరుగా మార్చుకుంటున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచే కాకుండా అనంతపురం నుంచి పెద్దఎత్తున తమిళనాడు అట్నుంచి కేరళకు రవాణా చేస్తున్నారు. అటవీ సమీప గ్రామాల్లో..చిత్తూరు జిల్లాలో ప్రస్తుతం అటవీ సమీప గ్రామాల్లో మాత్రమే దేశీ ఆవులు కనిపిస్తున్నాయి. వీటికోసం పెద్దగా ఖర్చుపెట్టకపోయినా రోజుకు రెండు నుంచి మూడు లీటర్ల పాలు ఇస్తుంటాయి. ఉదయం అడవిలోకి వదిలేస్తే సాయంత్రానికి మేతమేసి వస్తుంటాయి. వర్షాకాలంలో చెరువులు, పచ్చిక బీళ్లలో ఇవి ఆహారాన్ని పొందుతాయి. ప్రస్తుతం వర్షాలు పెద్దగా కురవకపోవడంతో వీటి పరిరక్షణ కష్టంగా మారింది. పచ్చగడ్డి కొనుగోలు చేస్తే ఏమాత్రం గిట్టుబాటు కాని పరిస్థితి. రైతులు పాల కోసం జర్సీ, హెచ్‌ఎఫ్ ఆవులను ఎక్కువగా పోషిస్తున్నారు. ఇదే అదనుగా వ్యాపారులు దేశీయ ఆవుల కోసం కాపుకాచి వారపు సంతల్లో కొనుగోలు చేస్తుంటారు. పలమనేరు, పుంగనూరు వారపు సంతల్లో రైతులు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. వీటిని ప్రభుత్వం సంరక్షించకుంటే భవిష్యత్తులో వీటి ఆనవాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉంది.

చట్టాలు చుట్టాలుగా మారిప్రతియేటా దేశీయ ఆవుల సంఖ్య 5 నుంచి 6 శాతం తగ్గిపోతోంది. జంతు సంరక్షణ చట్టం ప్రకారం పశువులను వాహనాల్లో తరలించరాదు. అయితే ఇవేవీ పట్టించుకోకుండా వ్యాపారులు పూర్తిగా టార్పాలిన్లు కప్పి కంటైనర్లు, లారీల్లో తరలిస్తున్నారు. గతంలో పోలీసులు పశువుల రవాణా మీద దృష్టిపెట్టేవారు. పశువులను పట్టుకుంటే ఎక్కడ ఉంచాలి.. మేత ఎలా అన్న విషయంలో ఇబ్బందులు ఎదురవడంతో పట్టించుకోవడంలేదు. పట్టణానికి సమీపంలోని ఒక గిడ్డంగిలో పశువుల మాంసానికి సంబంధించిన ఎముకలు నిలువ చేసేవారు. దానిపై పట్టణ వాసులు ఇటీవల మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. పశుమాంసం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నందున నాటు ఆవులే కాకుండా ఆ జాతికి చెందిన కోడెదూడలను సైతం మాంసానికి విక్రయిస్తున్నారు.

ప్రత్యేక దృష్టి సారిస్తాంపశువుల రవాణా విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఎవరైనా సరే తమకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాంప్రభాకర్, డిఎస్పీ, పలమనేరు

# పుష్కరమైంది.. పలుకుతారా!

కాకినాడ : వందల మంది విద్యార్థులకు వివిధ కోర్సులతో స్వయం ఉపాధి చూపాల్సిన సంస్థ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెూటల్ మేనేజ్‌మెంట్ (ఎస్ఐహెచ్ఎం)... కాకినాడ జిల్లాకు కేటాయించిన ఈ విద్యాసంస్థపై కేంద్రం కరుణించినా .. అక్కడి స్థలంలో రాజకీయం వేలు పెట్టడంతో కొన్నాళ్లు పడకేసింది. అడ్డంకులు తొలగాక పనులు చేస్తున్న గుత్తేదారుకు వైకాపా సర్కారు బిల్లులు ఆపేయడంతో నీలి నీడలు కమ్మేశాయి.

వీడని చిక్కుముళ్లు..యు.కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల పక్కనే అయిదెకరాల ఖాళీ స్థలంలో తెదేపా ప్రభుత్వం 2014లో శంకుస్థాపన చేసింది. రూ. 1.50 కోట్లు ఖర్చుచేసి పనులు ప్రారంభించాక పిల్లల ఆట స్థలంలో నిర్మాణాలేమిటని అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. వైకాపా నాయకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తేవడంతో పనులు ఆగాయి. వైకాపా ప్రభుత్వం వచ్చాక చిక్కులు తొలగించుకున్నా.. ప్రాజెక్టు కొలిక్కిరాలేదు. చేసిన పనులకు రూ.2 కోట్ల బిల్లులు ఇవ్వలేదని గుత్తేదారు ఆపేశారు.

నైపుణ్య వికాసానికి గ్రహణం..

జాతీయ విద్యా ప్రవేశ నిబంధనలు అనుసరించి కౌన్సిల్ ఆఫ్ హెూటల్ మేనేజ్‌మెంట్-క్యాటరింగ్ టెక్నాలజీ సంయుక్తంగా ప్రవేశ పరీక్షల ద్వారా కోర్సులకు అవకాశం కల్పించాలి. విద్యాసంస్థ పూర్తయితే మూడేళ్ల బీఎస్సీ డిగ్రీ.. ఆహార ఉత్పత్తి, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీసు, హౌస్ కీపింగ్, ఆఫీస్ ఆపరేషన్స్‌లలో ఏడాదిన్నర వ్యవధితో ట్రేడ్ డిప్లమో కోర్సులూ వస్తాయి. డిగ్రీ కోర్సుకు 80 సీట్లు.. డిప్లమో కోర్సులకు 40 చొప్పున 280 సీట్ల భర్తీ చేయొచ్చు. తిరుపతిలో



నిర్మాణం పూర్తయి నడుస్తుంటే.. మనవద్ద పుష్కర కాలంగా ఎదురు చూపులే.

కూటమి ప్రభుత్వం ఊతమిస్తేనే..

హెూటల్ మేనేజ్‌మెంట్ కళాశాల నిర్మాణానికి కేంద్రం మంజూరుచేసిన నిధుల్లో.. తరగతుల నిర్వహణ, పరిపాలన భవనాలకు రూ. 8 కోట్లు.. వసతిగృహ సముదాయానికి రూ.2 కోట్లు.. బోధన సామగ్రి, ఇతర వనరులకు రూ.2 కోట్ల చొప్పున వెచ్చించాలి. ఇప్పటివరకు చేసిన పనులకు రూ.4 కోట్లు మంజూరైతే.. మరో రూ.2 కోట్లు బిల్లులు రావాలి. గోడలు, ప్లాస్టరింగ్, ఫ్లోర్, విద్యుత్తు వైరింగ్ ఆగిపోయాయి. భవన నిర్మాణాలు పూర్తయ్యాక రోడ్లు, మురుగు పారుదల వ్యవస్థ, చుట్టూ వీధి దీపాలు సమకూర్చాలి. వైకాపా ప్రభుత్వం గత అయిదేళ్లలో శ్రద్ధ చూపలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం నిధుల విడుదలకు చొరవచూపి విద్యాసంస్థను అందుబాటులోకి తేవాలన్న ఆకాంక్ష వ్యక్తమవుతోంది.

# ఇటు ఉపాధి.. అటు అభివృద్ధి

అమలాపురం : గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం. దీనికోసం కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.కోట్లు కేటాయిస్తోంది. గత తెదేపా ప్రభుత్వ హయాంలో 2014-19 మధ్య ఈ నిధులతో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు నిర్వహించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ప్రజలకు అవసరమైన మౌలిక వసతులపై నిర్లక్ష్యం వహించి, ప్రభుత్వ భవన నిర్మాణాలకు ప్రాధాన్యం ఇచ్చింది. దీంతో పల్లెల్లో సమస్యలేవీ పరిష్కారం కాలేదు. కూటమి సర్కారుతో..కేంద్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సంఘం నిధులనుసైతం గత అయిదేళ్లలో పక్కదారి పట్టించిన జగన్ ప్రభుత్వం ఉపాధి హామీ నిధులనూ సద్వినియోగం చేయలేదు. ఇలాంటి పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం పల్లెలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచనలకు అనుగుణంగా పల్లెసీమల రూపురేఖలు మార్చేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



ప్రణాళిక సిద్ధం..

జిల్లాలోని 385 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ నిధుల ఖర్చుకు సంబంధించి ఒకే రోజు గ్రామసభలు నిర్వహించారు. ఈ సభల్లో ఆయా గ్రామాలకు కావాల్సిన మౌలిక వసతులపై తీర్మానాలు చేశారు. దీనిలో భాగంగా జిల్లాలో రూ.55 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశారు. రైతులకు అండగా..ఉపాధి నిధులతో ఈ ఏడాది రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. పంట కాలువల నిర్మాణం, పూడిక తీత, పొలం గట్లపై మొక్కల పెంపకం, సరిహద్దు కందకాలు, గడ్డి పెంపకం, షెడ్ల నిర్మాణం, నర్సరీల ఏర్పాటుతోపాటు పల్లెల్లో ప్రజలకు అవసరమైన డ్రెయిన్లు, సీసీ, బీటీ రహదారులు, పాఠశాలలకు ప్రహరీలు వంటి సదుపాయాలకు పనులు చేపట్టనున్నారు. మినీ గోకులాలకుసైతం ఉపాధి నిధులు ఇవ్వనుంది. గత నెలలో జిల్లావ్యాప్తంగా నిర్వహించిన గ్రామ సభల్లో గుర్తించిన పనులకు రూ.1,582 కోట్లు అవసరం అవుతాయని నిర్ణయించారు. అంటే వైకాపా హయాంలో పనులేవీ సాగలేదనేందుకు ప్రస్తుత పనుల గుర్తింపే చెబుతోందని పలువురు అంటున్నారు.

మండలాల వారీగా వివరాలు- మధుసూదన్, డ్వామా పీడీ

జిల్లాకు ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.55 కోట్ల వరకు నిధులు సమకూరనున్నాయి. వీటితో చేపట్టే పనులకు సంబంధించి మండలాల వారీగా వివరాలు సేకరిస్తున్నాం. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు సన్నద్ధం చేస్తున్నాం.

# దారులపై రక్తధార!!

విశాఖపట్నం : రోడ్డు ప్రమాదాలతో విశాఖ నగరం వణికిపోతోంది. నిత్యం నెత్తురోడుతోన్న రహదారులను చూసి ప్రయాణమంటేనే ప్రజలు హడలిపోతున్నారు. గంజాయి, మద్యం మత్తు, అతివేగం, నిర్లక్ష్యం కారణంగా నిండు ప్రాణాలు బలవుతున్నా యి. సరాసరిన రోజుకు ఒకరిద్దరి ప్రాణాలు గాల్లో కలుస్తుండటం కలవరపెడుతోంది.

మత్తు బీచ్ రోడ్డులో ఈ ఏడాది ఆగస్టు మొదటి వారంలో ఓ రోజు రాత్రి మద్యం మత్తులో కారు నడపడంతో అదుపుతప్పి డివైడర్ దూకి ఆవలి వైపున్న రోడ్డు మీదికి దూసుకెళ్లింది. ఆపై ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దానిపై ప్రయాణిస్తున్న ఇద్దరితోపాటు, కారులో ఉన్న ఇద్దరు యువకులతో కలిపి మొత్తంగా నలుగురు మృతి చెందారు.

అతివేగం

ఇటీవల బీఆర్‌టీఎస్ రహదారిలో ఐటీఐ జంక్షన్ వద్ద ఆర్టీసీ బస్సును అధిగమించే క్రమంలో అదుపుతప్పి తలకు గాయాలై ఓ యువకుడు మృతి చెందాడు. కొన్ని రోజుల క్రితం అతివేగం అదుపు చేయలేక ఎన్ఏడీ, తెలుగుతల్లి వంతెనపై నుంచి ద్విచక్ర వాహనాలతో సహా కిందికి పడిన ఘటనల్లోనూ ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.

నిర్లక్ష్యం

కొద్ది రోజుల కిందట భీమిలి నారాయణరాజుపేటలో ఓ ప్రైవేటు స్కూలు బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా టైర్ల కింద పడి ఐదేళ్ల బాలుడు దుర్మరణం పాలయ్యాడు. 2023 నవంబరులో ద్వారకా నగర్ వద్ద సిగ్నల్ పనిచేయని సమయంలో.. విద్యార్థులతో ఆటో వేగంగా రాగా... లారీ ఢీకొట్టిన ఘటన తీవ్ర కలకలం రేపింది.

మాదాలకు కారణాలివే..

పగటి వేళల్లో భారీ వాహనాలు నగరంలోకి రావడం.

కొన్ని కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయక, కానిస్టేబుళ్లు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వాహన చోదకులు దూసుకెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

మద్యం మత్తు గుర్తించే బ్రీత్ అనలైజర్స్ తనిఖీలు చాలా చోట్ల కేవలం ద్విచక్రవాహనాలకే పరిమితం చేస్తున్నారు.

నగరంలో పలుచోట్ల వీధిదీపాలు వెలగకపోవడంతో గుంతల్లో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ప్రధాన మార్గాల్లోని గోతులూ ప్రమాదాలకు హేతువవుతున్నాయి.

అందరూ దృష్టిసారించేదెప్పుడు..?: నగర కమిషనరేట్ పరిధిలో అత్యధిక సంఖ్యలో ప్రమాదాలు జరిగే ‘బ్లాక్‌స్పాట్స్’ 68 వరకు గతంలో గుర్తించారు. అత్యధికంగా గాజువాక పరిధిలో ఉన్నాయి. ప్రధానంగా పారిశ్రామిక ప్రాంతాల్లో ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, జాతీయ రహదారికి ఆనుకుని నగరంలోకి వచ్చే ప్రధాన మార్గాలు కూడా ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్నవిగా తేల్చారు. తెలుగుతల్లి పైవంతెనపై రైల్వేస్టేషన్ వైపు వెళ్తున్న సమయంలో 60 కి.మీ. కంటే ఎక్కువ వేగంతో వాహనం నడిపితే ప్రమాదాలు జరుగుతున్నట్లు స్పష్టమైంది. ఇలా గుర్తించిన సాంకేతిక పరమైన అంశాలను జీవీఎంసీ, ఎన్‌హెచ్, పోలీసు శాఖలు సమన్వయంగా పరిష్కరించాల్సి ఉన్నా ఆశించినంత కసరత్తు కనిపించడం లేదనే విమర్శలొస్తున్నాయి.

నగరంలో...చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి: 75 కి.మీ.

బీఆర్టీఎస్ రహదారి: 35 కి.మీ.పైగా

నగరంలో అంతర్గత ప్రధాన రహదారులు: 150 కి.మీ. మేర

ప్రతి రోజూ తిరిగే వాహనాలు: 5 లక్షలకుపైగా..

# వైకాపా మాజీ ప్రజాప్రతినిధి సోదరుడి కబ్జాపర్వం

అనంతపురం: గత వైకాపా ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు రెచ్చిపోయారు. భూమి ఖాళీగా కనబడితే చాలు కబ్జా చేసేశారు. భూయజమానులను బెదిరించి విలువైన ప్రైవేటు స్థలాలను స్వాధీనం చేసుకున్నారు. అధికారుల్ని గుప్పిట్లో పెట్టుకుని సాగించిన భూఅక్రమాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. రాప్తాడు వైకాపా ప్రజాప్రతినిధిగా పనిచేసిన నాయకుడి సోదరుడు దౌర్జన్యంగా ఓ విశ్రాంత ఉద్యోగికి చెందిన భూమిని ఆక్రమించిన ఉదంతం తాజాగా వెలుగులోకి వచ్చింది. కబ్జా చేయడమే కాకుండా.. అక్రమ రిజిస్ట్రేషన్ చేయించి ఇతరులకు విక్రయించారు. బహిరంగ మార్కెట్‌లో భూమి విలువ ప్రస్తుతం రూ.10 కోట్ల వరకు పలుకుతోంది. తెదేపా కూటమి ప్రభుత్వం గతంలో జరిగిన భూఅక్రమాలపై ఫిర్యాదులు స్వీకరించి విచారణ జరుపుతోంది. దీంతో బాధితుడు సోమవారం తెదేపా కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌తో.. రాప్తాడు పొలం పరిధి 4-4, 5-3, 6-2 సర్వే నంబర్లలోని 2 ఎకరాల భూమిని అనంతపురం నగరానికి చెందిన



విశ్రాంత ఉద్యోగి పి.లక్ష్మణ్ణ, గుత్తికి చెందిన యజమాని నుంచి 1985లో కొనుగోలు చేశారు. 2001 నుంచి 2010 వరకు 3 సెంట్ల చొప్పున 8 ప్లాట్లు విక్రయించారు. మిగిలిన 1.76 ఎకరాలు అలాగే ఉంది. 2019లో వైకాపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఖాళీగా ఉన్న సదరు స్థలంపై స్థానిక నాయకుల కన్ను పడింది. అప్పటి ప్రజాప్రతినిధి సోదరుడి ద్వారా పావులు కదిపారు. లక్ష్మణ్ణను ప్రజాప్రతినిధి వద్దకు పిలిచి సగం భూమి ఇవ్వాలని బెదిరించారు. అంగీకరించకపోవడంతో పాత యజమాని వారసుల నుంచి భూమి అక్రమంగా రాయించుకున్నారు. సదరు భూమి హక్కుదారు లక్ష్మణ్ణ అయినప్పటికీ సంబంధం లేని వ్యక్తుల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ప్లాట్లు వేసి కొన్నింటిని ఇతరులకు విక్రయించారు. తన భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితుడు అప్పట్లోనే న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. గతేడాది ఏప్రిల్‌లో కోర్టు ఇంజెక్షన్ ఉత్తుర్వులు జారీ చేసింది. సదరు భూమిలో ఎలాంటి రిజిస్ట్రేషన్ చేయవద్దని అధికారుల్ని ఆదేశించింది. అప్పటి ప్రజాప్రతినిధి సోదరుడి ఒత్తిళ్లతో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం అధికారులు అక్రమ రిజిస్ట్రేషన్లను కొనసాగించడం గమనార్హం. దీంతో బాధితుడు కోర్టు దిక్కార పిటిషన్ దాఖలు చేశారు.

## గూడూరు, పేటలకు పరిశ్రమల వరుస

గూడూరు : కూటమి ప్రభుత్వం ఉపాధి కల్పనపై దృష్టి పెట్టింది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆకర్షించడం ద్వారా భూముల కేటాయింపును పూర్తిచేసింది. తాజాగా జరిగిన స్టేట్ ల్యాండ్ అలాట్‌మెంట్ కమిటీ (ఎస్ఎల్ఏసీ) పరిశ్రమలకు అవసరమైన భూములు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈక్రమంలో రెండు రెవెన్యూ డివిజన్లలో పరిశ్రమలు వరుసకట్టే అవకాశం కలిగింది.

గూడూరు, సూళ్లూరుపేట నియోజకవర్గంలో 24 పరిశ్రమలకు భూములు కేటాయించారు. సుమారుగా రూ.200 కోట్ల పెట్టుబడులు ఇక్కడికి రానున్నాయి. అటు ఓజిలి మండలం అత్తివరం, తడ మండలం మాంబట్టు ఇండస్ట్రియల్ పార్కులతోపాటు గూడూరు ఆటోనగర్‌లో భూమి కేటాయిస్తూ ఇటీవల రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయం తీసుకోగా తాజా ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఇక్కడ వందల మందికి ఉపాధి లంభించనుంది.

జిగురు తయారీతో..అత్తివరంలో స్టార్ ఇండస్ట్రీస్ జిగురు తయారీ కోసం రెండు ఎకరాల భూమి తీసుకుంది. ఇక్కడ ఏర్పాటుచేసే రేసిన్స్ తయారీ పరిశ్రమతో 43 మందికి ఉపాధి లభించనుంది. రూ.113 కోట్ల పెట్టుబడి పెట్టనున్నారు. తడ మండలం మాంబట్టులో మరో పరిశ్రమ 7.14 ఎకరాలు తీసుకుంది. ఇక్కడ ఏఏసీ బ్లాక్ తయారీకిగాను 20కోట్లు వెచ్చించనుండగా 95 మందికి ఉపాధి కల్పించనుంది.

ఎంఎస్ఎంఈలకు అనుకూలం

వెస్ట్ గూడూరులోని ప్లాట్‌లలో 15 మంది భూమి కోసం దరఖాస్తు చేసుకోగా వారికి ఎట్టకేలకు భూములు అప్పగించారు. ఎస్సీ, ఎస్టీలకు భూములు రాయితీపై ఇవ్వడానికి అవకాశం కలిగింది. ఆటోమొబైల్, వెహికల్ బాడీ బిల్డింగ్ వర్క్స్, టైర్‌వర్క్ తదితర సంస్థలు ముందుకొచ్చాయి. ఇక్కడ 500 మంది పైగా ఉపాధి లభించనుందని పరిశ్రమల వర్గాలు చెబుతున్నాయి.

## అడిగేవారు లేరు.. అడ్డుకునేవారు లేరు!

అనకాపల్లి : భూబకాసురులు రెచ్చిపోతున్నారు.కొండపోరంబోకు స్థలాలు, గెడ్డలు, వాగులు కబ్జా చేసి యథేచ్ఛగా అమ్మకాలు చేసి కోట్లు కొల్లగొడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అడ్డుకునేవారు లేకపోవడంతో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి.అనకాపల్లి మండలం గొలగాం పంచాయతీ శివారు కొత్తతలారివానిపాలెంలో సర్వే నంబరు 283లో వందల ఎకరాల ప్రభుత్వ కొండపోరంబోకు స్థలం ఉంది. ఇటీవల కొంత మంది భూబకాసురులు రెండు ఎకరాల మేర స్థలాన్ని యంత్రాల సహాయంతో రాత్రికి రాత్రి దున్నేసి జీడి, మామిడి చెట్లను నరివేసి వచ్చిన కలపను సైతం మాయం చేశారు. 10 నుంచి 20 సెంట్లు మేర స్థలాలను మార్కింగ్ చేసి దర్జాగా అమ్మకాలు చేస్తున్నారు. ఇక్కడ సెంటు స్థలం రూ.5 లక్షలు మేర పలుకుతుంది. రాత్రి వేళల్లో యంత్రాల సహాయంతో తవ్వకాలు సాగుతున్నాయి. గ్రావెల్‌ను సైతం అమ్మకాలు చేస్తున్నారు.ఈ స్థలాలను కొనుగోలు చేసిన కొందరు పునాదులు తీసి నిర్మాణాలు చేపడుతున్నారు. బహిరంగంగానే ఈ తంతు జరుగుతున్నా.. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమార్కులు రెచ్చిపోతుండడంతో ఎవరూ ఏమి చేయలేని పరిస్థితి ఏర్పడింది. గతంలో ఈ స్థలాన్ని రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఏర్పాటుకు అప్పటి అధికారులు పరిశీలించారు. ఇది ముందుకు సాగకపోవడంతో అందొచ్చిన స్థలాలను ఆక్రమించుకోడానికి కొందరు పోటీపడుతున్నారు. తక్షణమే వీరిపై చర్యలు చేపట్టి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరుతున్నారు.

ఆక్రమణలు పరిశీలిస్తాం: ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు పరిశీలించి తొలగిస్తామని ఇన్‌ఛార్జి తహసీల్దార్ శ్రీరామ్మూర్తి తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లో అక్రమ నిర్మాణాలకు సంబంధించి నివేదికలు సిద్ధం చేశామన్నారు. పోలీసుల సహకారంతో వీటిని కూడా తొలగిస్తామని చెప్పారు.

# క్వారీ పేలుళ్లు.. ఆందోళనలో ప్రజలు



పెనుకొండ : స్థానిక పాపిరెడ్డిపల్లి-వెలగమేకలపల్లి గ్రామాల మధ్య కంకర క్వారీలో భారీ పేలుళ్లతో పలు గ్రామాల ప్రజలు, రైతులు భయం గుప్పెట్లో జీవనం సాగిస్తున్నారు. ఆరేళ్లుగా ఇక్కడి క్వారీలో చేపడుతున్న పేలుళ్ల దాటికి కిలోమీటరు దూరంలో ఉన్న ఏడు గ్రామాల పంట పొలాలు, గృహాలు దెబ్బతింటున్నాయి. భారీ పేలుళ్లకు రాళ్లు ఎగిసిపడి పొలాల్లో పడటం, వేగంగా టిప్పర్ల రాకపోకలతో దుమ్ము-దూళి తమ పంట పొలాలపై పడుతుండటంతో దిగుబడులు దెబ్బతిని వందలాది మంది రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు.

కొండ పక్కనే కస్తూర్బా గురుకులం

క్వారీకి 200 మీటర్ల దూరంలోనే కస్తూర్బా విద్యాలయం నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఉంటున్న 250 మంది విద్యార్థినులు, సీఆర్టీలు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. ఏడు గ్రామాల ప్రజల ఆరాధ్య దైవం అక్కమ్మ గుడి దెబ్బతిని తమ మనోభావాలతో చెలగాట మాడుతున్నారని వేలుపుకొండ అక్కమ్మ గుడి పరిరక్షణ కమిటీ సభ్యులు బీలానాయక్, రాయప్ప, లక్ష్మీనారాయణరెడ్డి, శంకర్ నాయక్, ఆంజనేయులు, రంగప్ప, నరసింహులు, హనుమంతు, గ్రామాల ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్వారీని వెంటనే ఆపేసి తమకు న్యాయం చేయాలని కమిటీ సభ్యులు, రైతులు, ప్రజలు మంత్రి ఎస్.సవితను వేడుకొంటూ వినతిపత్రం అందించారు.

గృహాలు, పంట పొలాలకు నష్టం..- రాయప్ప, రైతు, వెలగమేకలపల్లి

పేలుళ్ల దాటికి ఇళ్లు, పంటలు దెబ్బతిని ఆర్థికంగా నష్టపోతున్నారు. గృహాలకు పగుళ్లు ఏర్పడి, ఎప్పుడు నేలకూలుతాయో అర్థం కావడం లేదు. పొలాలు బీళ్లుగా మారాయి. వెంటనే ప్రభుత్వం, అధికారులు ఈ క్వారీని నిలిపి వేయించి, ఏడు గ్రామాల ప్రజలు, రైతులను కాపాడాలి.

సామగ్రి కిందపడి.. - సరోజబాయి, కూలీ, నాగినాయనిచెరువు తండా.

వేలుపుకొండలో వెలసిన అక్కమ్మ అమ్మవారు ఏడు గ్రామాల ప్రజలకు ముఖ్యంగా తండా వాసులకు అరాధ్య దైవం. ఈకొండ పేలుళ్లతో మొత్తం గుట్టపై ఉన్న తమ తండాలో భూమి కంపించి, ఇంట్లో సామగ్రి ఒక్కసారిగా కింద పడుతున్నాయి. పిల్లలు, వృద్ధులు, మహిళలు భయపడి బయటకు పరుగులు తీస్తున్నారు. వెంటనే క్వారీని మూయించాలి.

కలెక్టర్‌కు నివేదిక పంపుతాం..-గంగాశంకర్, ఇన్‌ఛార్జి తహసీల్దార్, సోమందేపల్లి.

వెలగమేకలపల్లి వద్దనున్న కంకర క్వారీని సీఐ రాఘవన్, ఎస్సై రమేశ్‌బాబుతో కలిసి తనిఖీ చేశాం. అక్కడి పరిస్థితిని పరిశీలించాం. క్వారీ పేలుళ్లతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఇటీవల మంత్రి ఎస్.సవితకు వినతిపత్రం అందించిన కస్తూర్బా విద్యార్థినులు, సీఆర్టీలతో కలిసి విచారణ చేపట్టాం. ఈమేరకు త్వరలోనే పూర్తిస్థాయిలో కలెక్టర్‌కు నివేదిక పంపుతాం.

# అనంత స్టేషన్‌కు నూతన శోభ



అనంతపురం : అనంత రైల్వే స్టేషన్‌కు కొత్త శోభ వచ్చింది. ఒకటో రోడ్డు వైపు నూతన ప్లాట్‌ఫాం1లో సువిశాల భవనం ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. ఇందులో స్టేషన్ మేనేజర్, ఉపస్టేషన్ మేనేజర్ల గదులతోపాటు రెండు వేచి ఉండు గదులు ఏర్పాటు చేశారు. ఉన్నత శ్రేణి ప్రయాణికుల కోసం శీతల గది ఏర్పాటు చేశారు. విశాలమైన ప్లాట్‌ఫాంలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రూ.9 కోట్లతో శ్రీనివాసనగర్ వైపు పాత భవనం స్థానంలో నూతన భవనాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో సగ భాగం పనులు ప్రస్తుతం మొదలయ్యాయి. సగభాగం నిర్మాణం పూర్తి అయిన తర్వాత మిగతా సగభాగం నిర్మాణం చేపడతారు. ఈ భవనం కూడా అందుబాటులోకి వస్తే అనంతపురం రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలకు ఊరట దక్కుతుంది. గత 50 ఏళ్లుగా రెండు ప్లాట్‌ఫాంలకే పరిమితమైన ఈ స్టేషన్‌లో ప్రస్తుతం నాలుగు ప్లాట్‌ఫాంలు అందుబాటులోకి వచ్చాయి.

రైల్వేస్టేషన్‌లో అన్ని ప్లాట్‌ఫారాలకు లిఫ్టుల నిర్మాణం చేపట్టారు. రెండు నెలల్లో లిఫ్టులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. మూడుచోట్ల లిఫ్టులు అందుబాటులోకి రానున్నాయి. 4 ప్లాట్‌ఫారాలపై దిగిన ప్రయాణికులు లిఫ్టుల సహాయంతో ఒక ప్లాట్‌ఫారం నుంచి మరో ప్లాట్‌ఫారంపైకి మారడానికి వీలవుతుంది. అనంతపురం రైల్వేస్టేషన్ ఏ కేటగిరీ జాబితాలో ఉండటంతో ఎస్కలేటర్లు కూడా మంజూరు అయ్యాయి.

అనంతపురం స్టేషన్ మీదుగా రోజూ 46 ఎక్స్‌ప్రెస్ రైళ్లు పరుగులు తీస్తున్నాయి. బెంగళూరు నుంచి ధర్మవరం డబ్లింగ్ పూర్తి అయితే మరిన్ని రైళ్లు జిల్లా మీదుగా వెళ్లే అవకాశం ఉంది. అనంతపురం స్టేషన్ నుంచే రోజూ 6 వేల మంది ప్రయాణికులు ప్రయాణాలను సాగిస్తున్నారు. కరోనా తర్వాత బెంగళూరు-విజయవాడ ప్యాసింజర్ రైళ్లు పట్టాలెక్కలేదు. ఈ రైలు పునరుద్ధరిస్తే జిల్లాలోని చిన్న రైల్వే స్టేషన్‌ల నుంచి ప్రయాణాలు సాగించే వారికి ఎంతో అనుకూలంగా ఉంటుంది.

మెండుగా సౌకర్యాలు - చక్రపాణి, ప్రయాణికుడు

అనంతపురం రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించడంతో సౌకర్యాలు పెరిగాయి. సువిశాల ప్లాట్‌ఫారాలు, విశాల వేచి ఉండు గదులు, ఆధునిక వసతులతో ఫుట్ ఓవర్ వంతెనలు ఏర్పాటు చేయడం సంతోషకరం. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న పనులు వేగవంతం చేస్తే సౌకర్యంగా ఉంటుంది.

# పీబీసీ విస్తరణ.. ఇక చకచకా

చిత్తూరు: హంద్రీ-నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) మరింత జలకళ సంతరించుకోనుంది. అన్నదాతల సాగు వెతలు తీర్చడంతోపాటు ప్రజల తాగునీటి కష్టాలు ఈ పథకం తీర్చుతోంది. దీని పరిధిలోనే పుంగనూరు, కుప్పం బ్రాంచ్ కాలువలు జిల్లాలో ఉన్నాయి. ఇవికాకుండా ప్రధాన కాలువపై ఆధారపడి నీవా బ్రాంచి కాలువ ఉంది. ప్రస్తుతం పీబీసీ, కేబీసీ పనులు పూర్తయినా సామర్థ్యం సరిపోక చివరి ఆయకట్టుకు కృష్ణా జలాలు చేర్చడం కష్టతరంగా ఉంది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం పీబీసీ విస్తరణ వేగంగా పూర్తిచేయాలని నిర్ణయించింది. ఈనెల 23న జిల్లాలో పర్యటించిన జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడు ఈవిషయాన్ని స్పష్టం చేశారు.

మరో 800 క్యూసెక్కులు ప్రవహించేలా

ప్రస్తుతం పుంగనూరు బ్రాంచ్ కాలువ సామర్థ్యం 380 క్యూసెక్కులు ఉంది. చివరి పాయింట్ అయిన పెద్దపంజాణి మండలం అప్పినపల్లె చెరువు వద్దకు 150- 200 క్యూసెక్కుల నీరు మాత్రమే చేరుతోంది. కేబీసీ కింద దాదాపు 110 చెరువులు నింపాలని ప్రణాళిక ఉన్నా సాధ్యమయ్యే పరిస్థితి లేదు. ఈక్రమంలోనే కాలువను విస్తరించి అదనంగా మరో 800 క్యూసెక్కులు ప్రవహించేందుకు వీలుగా పనులు చేయాలని భావించారు. మొత్తంగా 1,180 క్యూసెక్కులు పారేలా ప్రణాళికలు రూపొందించారు. తద్వారా తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు, పలమనేరు నియోజకవర్గాల్లోని 37,300 ఎకరాలకు నీరందనుంది. 5 లక్షల మందికి తాగునీరు అందించనున్నారు. 118 చెరువులు నింపనున్నారు.

విస్తరణ వ్యయం (అంచనా) రూ.కోట్లు 800

అదనపు ఆయకట్టు (ఎకరాలు) 37,300

నింపనున్న చెరువులు 118

తాగునీరు 5 లక్షల మందికి

వ్యయ అంచనాలిలా

గత వైకాపా ప్రభుత్వంలో గాలేరు- నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్)- హంద్రీ- నీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్)ను అనుసంధానం, పీబీసీ విస్తరణకు ఆమోదం లభించింది. 79.6 కి.మీ వద్ద నీళ్లు పీబీసీలో కలుస్తాయని పేర్కొన్నారు. మొత్తంగా ఈ పనులకు రూ.1,217.49 కోట్ల వ్యయమవుతుందని అంచనా. గతేడాది



ఫిబ్రవరిలోనే గుత్తేదారులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. మూడేళ్లలో పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. ఇప్పటికి ఏడాదిన్నర దాటినా నిర్మాణాల్లో ఎటువంటి పురోగతి లేదు. అప్పట్లో వేసిన ప్రణాళికలో పుంగనూరు బ్రాంచ్ కాలువ నుంచి సోమల మండలంలోని ఆవులపల్లె జలాశయం వరకు ప్రత్యేక ఫీడర్ ఛానల్ తవ్వాలని అనుకున్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణాన్ని నిలిపేయాలని ఎన్‌జీటీ స్పష్టం చేసినందున ప్రస్తుతానికి ఈ ప్రతిపాదన పక్కన పెట్టారు. రూ.800 కోట్ల వ్యయంతో పీబీసీని విస్తరించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. త్వరలోనే ఈ అంచనాలపై మరింత స్పష్టత రానుంది.

భూసేకరణకు అడుగులు

కాలువ విస్తరణకు ఎంతమేరకు భూమి అవసరమవుతుందనే అంశాన్ని తేల్చేందుకు బుధవారం నుంచే హెచ్ఎన్ఎస్ఎస్ మదనపల్లె యూనిట్‌లోని రెవెన్యూ సిబ్బంది, ప్రాజెక్టు అధికారులు సర్వే చేయనున్నారు. అనంతరంమంత్రికి నివేదించనున్నారు. మరోవైపు కాలువ ఎంత వెడల్పు ఉండాలి? ఎంత లోతు తవ్వాలి? రాయి తగిలిన ప్రాంతాల్లో ఎంతమేరకు కుదించాలి? అనే దానిపైనా కసరత్తు జరుగుతోంది. అక్టోబరు నుంచే విస్తరణకు శ్రీకారం చుట్టి ఏడాది రెండేళ్లలో ముగించాలని ప్రభుత్వం భావిస్తోంది.

# స్వచ్ఛ దృష్టి సంపద సృష్టి

చిత్తూరు : సుందర గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అడుగులేస్తోంది. నూటికి నూరు శాతం ఘన, ద్రవవ్యర్థాల నిర్వహణ చేపట్టి ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక చేస్తోంది. గత వైకాపా పాలనలో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలు ఇప్పటికే శిథిలావస్థకు చేరగా కూటమి ప్రభుత్వం వాటి పునఃప్రారంభానికి ఏర్పాట్లు చేస్తోంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,189 సంపద సృష్టి కేంద్రాలున్నాయి. వీటిలో అన్ని వసతులున్నవి 280 వరకు ఉన్నాయి. తొలిదశలో వాటి పునఃప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. గ్రామాల శుభ్రతకు పక్కాగా చర్యలు తీసుకోనున్నారు. పంచాయతీల్లో నిధులు అందుబాటులో ఉండటంతో సర్పంచులు ముందుకొస్తున్నారు. చెత్త సంపద కేంద్రాలను తెదేపా ప్రభుత్వం 2015లో తీసుకొచ్చింది. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్మించాయి. ఉపాధిహామీ నిధులు జోడించి వసతులు సమకూర్చారు. ఒక్కో కేంద్రానికి రూ.15 లక్షల వరకు నిధులు వెచ్చించారు.

ఎరువుల తయారీ..ప్రతి గ్రామంలో చెత్త సంపద కేంద్రం నుంచి



సేంద్రియ ఎరువు తయారీ చేయాల్సి ఉంది. గ్రామాల్లో వచ్చే చెత్తను హరిత రాయబారుల సహకారంతో షెడ్లకు చేర్చి 12 కంపార్ట్‌మెంట్లలో వేయాలి. చెత్తను వానపాముల ద్వారా ఎరువు తయారీ చేయాల్సి ఉంది. ఇలా తయారైన ఎరువులను విక్రయించడంతో పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది.

పెళ్లకూరు మండలం తాళ్వాయపాడు కేంద్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. అప్పటి సర్పంచి అనురాధ తడిపొడి చెత్తతోపాటు చేపల పెంపకం, కూరగాయల సాగు చేపట్టారు.

అన్నిచోట్లా వసతులు కల్పిస్తాం

అన్నిచోట్లా దశలవారీగా వసతులు కల్పిస్తాం. ఇందుకు అవసరమైన నిధులు వెచ్చించడానికి అవకాశముంది.సుశీలాదేవి, జిల్లా పంచాయతీ అధికారి, తిరుపతి

## ఉద్యాన కోర్సు.. ఉపాధికి ఉషస్సు

మడకశిర: గ్రామీణ ప్రాంత యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఉద్యాన పాలిటెక్నిక్ విద్య ఎంతో ఉపయోగ పడుతోంది. భవిష్యత్తులో ఉద్యోగం చేసుకుంటూ ఉన్నత విద్యను అభ్యసించడానికి అవకాశాలు ఉన్నాయి. 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పట్టణ పరిధిలోని పెనుకొండ రోడ్డులో ఏర్పాటు చేసింది. రాష్ట్ర విభజన వల్ల ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న సమయంలో 2014 తెదేపా ప్రోత్సాహంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు.


231 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

మడకశిర ఉద్యాన పాలిటెక్నిక్ కోర్సులో 60 సీట్లు కేటాయించారు. పదో తరగతి పూర్తికాగానే ఉద్యాన పాలిటెక్నిక్ కోర్సుకు దరఖాస్తు చేసుకుంటే ఎంపిక చేస్తారు. ప్రస్తుతం ఈ ఏడాది 42మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇప్పటివరకు 15 బ్యాచ్‌లు పూర్తికాగా 519మంది విద్యార్థులు కోర్సును పూర్తి చేశారు. ఇందులో 231మంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా, 72మంది బీఎస్సీ, ఎంఎస్సీ, పీహెచ్‌డీ కోర్సులు పూర్తి చేశారు. మిగిలిన వారు ప్రైవేటు రంగంలో స్థిరపడ్డారు.

రైతులకు సేవలు అందించడంలోనే ఆనందం

- సబీహా, వీఏఓ, సోమందేపల్లి

కళాశాలలో విద్యార్థి స్థాయిలోనే రైతులకు పంటల సాగు, అధిక దిగుబడులు సాధించడానికి ఎన్నో సలహాలు ఇచ్చాం. 2011-13లో మడకశిరలో కోర్సు పూర్తి చేసి ప్రైవేటు ఉద్యోగాలు చేశాను. ప్రస్తుతం



సచివాలయంలో ప్రభుత్వ ఉద్యోగం వచ్చింది. తల్లిదండ్రులు హోటల్ నిర్వహిస్తూ చదివించి ఈ కోర్సు పూర్తి చేయించారు. సచివాలయంలో కూడా రైతులకు సేవలు అందిస్తుండటం సంతోషంగా ఉంది.

గొర్రెల కాపరిగా ఉంటూ చదివించారు

- బాలాజీనాయక్, వీఏఓ, గుత్తి మండలం

మా నాన్న గొర్రెల కాపరిగా ఉంటూ నన్ను చదివించారు. గుత్తి మండలంలోని ఊబిచర్ల గ్రామం నుంచి మడకశిర ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో 2015-17లో కోర్సు పూర్తి చేశాను. ప్రస్తుతం ఊబిచర్ల గ్రామ సచివాలయంలోనే గ్రామ ఉద్యావన సహాయ అధికారిగా పనిచేస్తున్నాను. తల్లిదండ్రులు పడిన కష్టాన్ని ఒమ్ము చేయకుండా చదువుకున్నాను.

టైలరింగ్ చేస్తూ..- షాజాద్, వీఏఓ, నల్లచెరువు

మడకశిర పాలిటెక్నిక్ కళాశాలలో 2015-17లో చదువుకున్నాను. మంచి విద్య అందించడంతో ఉత్తీర్ణులై కోర్సు పూర్తి చేశాను. తండ్రి అమీర్‌బాషా టైలరింగ్ చేసి నన్ను చదివించారు. ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని సచివాలయ పరీక్ష రాసి మొదట్లోనే ఉద్యోగం వచ్చింది. చాలా సంతోషంగా ఉంది.

కొలువులకు దోహదం - రమణ, ప్రిన్సిపల్

10వ తరగతి పూర్తికాగానే రెండేళ్లలో ఉద్యోగం సాధించడానికి, మరింత ఉన్నత చదువులు చదువుకోవడానికి పాలిటెక్నిక్ కోర్సులు ఎంతగానో దోహదపడతాయి. మడకశిర ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో 75శాతం మంది విద్యార్థులు కోర్సు పూర్తి చేసుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. విద్యార్థులకు ఉద్యాన పంటల పెంపకం, రైతులకు సలహాలు ఎలా ఇవ్వాలనే దానిపై కళాశాల స్థాయిలోనే నేర్పిస్తాం. చదువుతో పాటు క్రీడల్లో మంచి నైపుణ్యం సాధించారు.

# 100 రోజుల్లో పల్లె ప్రగతి!

సీతానగరం : కేంద్రం ఇచ్చిన నిధులను పక్కకు మళ్లిస్తూ గత వైకాపా ప్రభుత్వం పల్లెప్రగతిని నీరుగార్చింది. చివరికి పంచాయతీ ఖాతాలన్నీ ఖాళీ చేసి ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాల్లా మార్చి, బ్లీచింగ్ కూడా కొనలేని స్థితికి తీసుకొచ్చింది. దీంతో పల్లెసీమలన్నిటినీ అపరిశుభ్రత ముంచెత్తుతోంది. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించింది. 'వందరోజుల ప్రణాళిక' రూపొందించింది. జిల్లాలోని 18 మండలాల్లో 300 పంచాయతీల్లోనూ ప్రణాళిక అమలు దిశగా అడుగులు వేస్తోంది.

**నిధుల పండగతో శ్రీకారం..**

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో జెండా పండుగ కోసం పంచాయతీలకు ప్రత్యేక నిధులు వచ్చాయి. స్వాతంత్ర్య వేడుకలకు గతంలో మైనర్ పంచాయతీకి రూ.150, మేజర్ పంచాయతీ రూ.250 ఖర్చును మాత్రమే ఇచ్చారు. మంత్రి ఆదేశాలతో చిన్న పంచాయతీలకు రూ.10వేలు, మేజర్ పంచాయతీలకు రూ.25 వేలు చొప్పున నిధులు కేటాయించారు. ఇదే తరహాలో భవిష్యత్తులోనూ పంచాయతీలకు పూర్తిస్థాయిలో నిధులు వస్తాయని, మేలు జరగనుందని అంతా భావిస్తున్నారు.

**ఇవీ లక్ష్యాలు..**

గ్రామ పంచాయతీలను బలోపేతం చేసేలా 100 రోజుల ప్రణాళికలో ఇప్పటికే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు.

ఆయా గ్రామపంచాయతీల పరిధిలో సాగునీటి పథకాలు, చెరువులు, పైపులైన్లు, కుళాయిలు, మురుగుకాలువలు ఎక్కడెక్కడ ఏ స్థితిలో ఉన్నాయో పరిశీలించి జియో ట్యాగింగ్ చేస్తారు.



కుళాయి కనక్షన్‌పై పల్స్ సర్వే చేస్తున్నారు.

నీటి నాణ్యత, పరిశుభ్రత, భూగర్భజలాలు, నీటి వనరులను పరిశీలించి లబ్ధిదారుల పేరిట యాప్‌లో నమోదు చేస్తారు. కుళాయి కనెక్షన్ లేని వారికి వెంటనే మంజూరు చేస్తారు.

2014-19 మధ్య స్వచ్ఛభారత్ అమలుచేశారు. ఎస్‌బీఎం పథకంలో ఇంటింటా మరుగుదొడ్లకు అప్పట్లో నిధులు ఇచ్చేవారు. వైకాపా అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదు. తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఊళ్ల పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ నిధులు కేటాయించాయి. గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్వహణపై సర్వే చేయనున్నారు.

**80 శాతం కేంద్రాల్లో సంపద సృష్టి..**

అక్టోబరు 2 నాటికి 80 శాతం కేంద్రాల్లో సంపద సృష్టి సిద్ధం చేసి ఎరువు తయారీ ద్వారా పంచాయతీలకు అదనపు వనరులు కల్పిస్తాం. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, ఎల్‌ఈడీ దీపాలు, మురుగుకాలువ నిర్వహణ, చెత్త, వ్యర్థాల నిర్మూలన, మురుగు గుంతల పూడ్చివేత, రహదారుల వెంట గడ్డి, చెత్తకుప్పలు తొలగింపు వంటి వాటిపై సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నాం. దాసరి రాంబాబు, డీజీపీవో, తూర్పుగోదావరి జిల్లా

# 'గూడు'కట్టుకున్న ఆశలు!

రాజాం : అందరికీ గృహయోగం అంటూ ఆర్భాటంగా ప్రకటించిన గత ప్రభుత్వం అంతకు ముందు పాలనలో మంజూరు చేసిన నిర్మాణాలను పూర్తి చేయలేదు. బిల్లు బకాయిలు ఇవ్వలేదు. వాటి చెల్లింపునకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో లబ్ధిదారుల్లో ఆశలు గూడుకట్టుకున్నాయి. ఉమ్మడి జిల్లాలో 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద పక్కా గృహాలు మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2 లక్షలు కేటాయించింది. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా ఉప ప్రణాళిక నిధుల నుంచి రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు సాయం చేశారు. లబ్ధిదారులకు తక్కువ ధరలో సిమెంటు సరఫరా చేశారు. 2016-17 నుంచి 2018-19 మధ్య లబ్ధిదారులకు బిల్లు బకాయిలు ఉండిపోయాయి. 2019లో ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటిని చెల్లించలేదు. దీంతో పెట్టుబడి పెట్టి ఇల్లు కట్టుకున్న వారు అప్పులు చేసి, వడ్డీలు కట్టలేక ఆర్థిక ఇబ్బందుల పాలయ్యారు.

**రాజాంలోనే ఎక్కువ**

శ్రీకాకుళం నుంచి విజయనగరం జిల్లాలో కొత్తగా చేరిన రాజాం నియోజకవర్గంలో ఎక్కువ మంది లబ్ధిదారులు ఉన్నారు. రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో రూ.4.20 కోట్ల వరకూ



బకాయిలున్నట్లు గుర్తించారు. ఇంత కన్నా ఇంకా ఎక్కువే ఉండొచ్చని అంచనాలు ఉన్నాయి.

**ముఖ్యమంత్రి ప్రకటనతో..**

ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో గృహాలు నిర్మించుకున్న పేదలకు బిల్లుల చెల్లింపునకు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు గృహ నిర్మాణ శాఖ అధికారులు నివేదిక పంపారు. విజయనగరం జిల్లాలో 5186 మంది లబ్ధిదారులకు రూ.15.52 కోట్లు.. పార్వతీపురం మన్యం జిల్లాలో 11,128 మందికి రూ.9.40 కోట్లు బకాయిలు ఉన్నట్లు లెక్క తేల్చారు. తర్వాత ఇంటింటికీ వెళ్లి పరిశీలిస్తారు. లబ్ధిదారులకు ఎంత బిల్లు చెల్లించారు? బకాయి ఎంతుందో పరిశీలిస్తారు. అనంతరం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

**త్వరలో చెల్లింపులు**

బకాయిలను త్వరలో చెల్లించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. సీఎం నుంచి ఆదేశాలు రాగానే క్షేత్రస్థాయిలో సర్వే చేసి లబ్ధిదారుల బకాయిలు చెల్లిస్తాం. వి.శ్రీనివాసరావు, గృహ నిర్మాణ శాఖ పీడీ

# మందులోళ్ల మాయాజాలం

కర్నూలు : కర్నూలు ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో ఔషధాల కొనుగోళ్ల ప్రక్రియలో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగమవుతున్నాయి. ఆసుపత్రికి అవసరమైన ఔషధాల్లో 80 శాతం ఆంధ్రప్రదేశ్ వైద్యసేవలు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్‌ఐడీసీ) సమకూరుస్తుంది. ఆ సంస్థ కొన్ని ఫార్మా సంస్థల నుంచి నేరుగా కొనుగోలు చేస్తుండటంతో మార్కెట్ ధరలకన్నా తక్కువగా ఉంటున్నాయి. అత్యవసరంగా కొనుగోలు చేస్తున్న 20 శాతం మందుల ధరలు మాత్రం భారీగా ఉండటం గమనార్హం. ఈ వ్యవహారంలో భారీగా అక్రమాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

మెరోపెనం ఇంజెక్షన్ ప్రస్తుతం మార్కెట్లో రూ.700కు లభిస్తోంది.. అదే ధరకు ఓ సంస్థ గతంలో కర్నూలు సర్వజనాసుపత్రికి సరఫరా చేసింది. ప్రస్తుత ఏజెన్సీ మాత్రం ఆ ఇంజెక్షన్ ధర మార్కెట్లో రూ.2,500గా చూపి అందులో 35.6 శాతం రాయితీ ఇచ్చి రూ.1,610కు సరఫరా చేస్తుండటం గమనార్హం.

పెప్‌టాజ్ ఇంజెక్షన్‌ను ఏపీఎంఎస్‌ఐడీసీకి కొన్ని ఫార్మా సంస్థలు రూ.52.24కు అందజేస్తున్నాయి. అత్యవసరం పేరుతో ఆ ఇంజెక్షన్‌ను ఓ ఏజెన్సీ రూ.222 చొప్పున సర్వజన ఆసుపత్రికి సరఫరా చేసింది. రిటైల్‌గా కొనుగోలు చేసినా ధర రూ.100కు మించిలేదు.

ఐవీపీసీటీ (పారాసిటమాల్) ఇంజెక్షన్‌ను ఏపీఎంఎస్‌ఐడీసీకి కొన్ని ఫార్మా సంస్థలు రూ.35కు సరఫరా చేస్తున్నాయి. అదే ఇంజెక్షన్‌ను అత్యవసరం పేరుతో ఓ ఏజెన్సీ రూ.220 చొప్పున కర్నూలు సర్వజనాసుపత్రికి సరఫరా చేస్తోంది.

ఒకప్పుడు అత్యవసర ఔషధాలను స్థానికంగా కొనుగోలు చేసేవారు. కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి టెండర్లు పిలిచి పారదర్శకంగా చేపట్టేవారు. రెండేళ్ల కిందట వైకాపా ప్రభుత్వం ఆ విధానాన్ని రద్దు చేసింది. బోధనాసుపత్రులు స్థానికంగా కొనుగోలు చేసే 20 శాతం అత్యవసర ఔషధాలను రాష్ట్ర ప్రభుత్వమే ఓ ప్రైవేటు సంస్థతో సరఫరా చేయించడం ప్రారంభించింది. ఇందుకోసం రాష్ట్ర స్థాయిలో ఏపీఎంఎస్‌ఐడీసీ అధికారులు టెండర్లు పిలిచి ఔషధాలు కొనుగోలు చేసి సర్వజనాసుపత్రికి పంపుతున్నారు. ఆయా అత్యవసర మందులు సరఫరా చేసే టెండర్‌ను శ్రీకృష్ణ ఫార్మాస్యూటికల్స్ సంస్థ దక్కించుకుంది. రాష్ట్ర స్థాయిలో సర్వజన ఆసుపత్రులకు మందులు కొనుగోలు చేసే బాధ్యతను ప్రభుత్వం ఒక సంస్థకు అప్పగించినా.. సదరు సంస్థ ఆ బాధ్యతలను మళ్లీ నగరాల వారీగా ఆయా ప్రాంతాల్లోని స్థానిక ఫార్మా సంస్థలకే ఇస్తుండటం గమనార్హం. స్థానిక మార్కెట్లలో తక్కువ ధరకు లభ్యమవుతున్న ఔషధాలను రాష్ట్ర స్థాయి సంస్థ అధిక ధరలకు సర్వజనాసుపత్రికి అంటగడుతున్నాయి.

వైకాపా అధికారం కోల్పోవడంతో మందుల కొనుగోళ్లలో జరుగుతున్న అక్రమాలకు చెక్ పడుతుందని, ప్రభుత్వాన్ని మోసం చేసిన సంస్థ అక్రమాలపై విచారణ జరుగుతుందని అందరూ భావించారు. తెదేపా అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటినా ఆయా అక్రమాలపై ఇంతవరకు దృష్టి పెట్టలేదు. దీంతో ఆ సంస్థ ప్రస్తుత ప్రభుత్వంలోని కొందరు అధికారులను అడ్డం పెట్టుకుని మరో మూడు నెలలపాటు మందులు సరఫరా చేసే బాధ్యతను దక్కించుకోవడం గమనార్హం.

**ప్రభుత్వ ఖజానాకు గండి** టెండరు నిబంధనల ప్రకారం ఎమ్మార్పీ ధరలపై 35.6 శాతం రాయితీతో మందులు సరఫరా చేయాలి. సంస్థ రాయితీ ఇస్తున్నా ఔషధాల ఎమ్మార్పీ ధరలు భారీగా ఉండడంతో ప్రభుత్వ ఖజానాకు తూట్లు పడుతోంది. ఏటా రూ.కోటి నుంచి రూ.1.50 కోట్ల విలువైన అత్యవసర మందులు నగరంలోని కర్నూలు సర్వజన ఆసుపత్రికి అవసరమవుతుంటాయి. గతంలో అదే మొత్తంతో భారీ పరిమాణంలో మందులు సమకూరేవి. నాడు వైకాపా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తున్నా సమకూరుతున్న మందుల పరిమాణం మాత్రం గణనీయంగా తగ్గిపోయింది. ఆ విషయాన్ని సర్వజన ఆసుపత్రుల సూపరింటెండెంట్లు గత ప్రభుత్వ పెద్దలకు చెప్పినా పట్టించుకోలేదు. ఎమ్మార్పీని అధికంగా చూపడంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. టెండరు దక్కించుకున్న సంస్థకు నాటి వైకాపా ప్రభుత్వంలోని పెద్దలతో సన్నిహిత సంబంధాలుండటంతో అధికారులు మిన్నకుండిపోయారు.

# పదునెక్కిన 'ఆధిపత్య' కత్తి



నంద్యాల : పల్లెల్లో 'పగ'లు బుసకొడుతున్నాయి.. ఆధిపత్యం కత్తి దూస్తోంది.. ప్రతీకారం ప్రత్యర్థుల ప్రాణాలు తీస్తోంది.. ఇటీవల వరుసగా చోటుచేసుకుంటున్న హత్యలు కలకలం రేపుతున్నాయి.. ప్రజల్లో భయాందోళనల్ని పెంచుతున్నాయి.. గత ఐదేళ్ల వైకాపా పాలనలో పోలీసులు ఆ పార్టీ నేతలతో అంటకాగారు.. వారు చెప్పిన అంశాలకు తలూపారు.. ప్రజల భద్రతను గాలికొదిలేశారు.. 'కూటమి' ప్రభుత్వంలోనైనా పోలీసింగ్ వ్యవస్థ బలపడాలని జనం కోరుతోంది.

**పల్లెలపై కానరాని నిఘా**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 73 ఫ్యాక్షన్ గ్రామాలు.. 200కుపైగా సమస్యాత్మక గ్రామాలున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 86 పోలీస్‌స్టేషన్లు, ఎనిమిది డీఎస్పీ కార్యాలయాలు ఉన్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు పోలీస్‌స్టేషన్లపై పెత్తనం చెలాయించేవారు. వారు చెప్పినట్లు వినకపోతే బదిలీ చేయించడంతో అధికారులు సమర్థత కోల్పోయారు. పోలీసు అధికారులు ఏకపక్షంగా వ్యవహరించడం, ఆదాయం ఉండే కేసులనే పట్టించుకునేవారు. ఈ పరిణామాల నేపథ్యంలో సీఐలు, ఎస్సైలు చిన్నచిన్న వివాదాలను పరిష్కరించలేకపోయేవారు. చివరకు దంపతుల మధ్య వివాదాలనూ పరిష్కరించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో మారుమూల ప్రాంతాలకు చెందిన సామాన్యులు వ్యయప్రయాసలతో జిల్లా కేంద్రానికి వచ్చి ఎస్పీలకు సమస్యలు విన్నవించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇటీవల మహానంది మండలంలో సుబ్బరాయుడి హత్యోదంతంలో పోలీసులు వ్యవహరించిన తీరుపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**రాజకీయ హత్యలు**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాజకీయ హత్యలు కలకలం రేపుతున్నాయి. తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు నలుగురు తెదేపా నేతలు హత్యకు గురికాగా, ఒక్క పత్తికొండ నియోజకవర్గంలోనే ఇద్దరు ఉన్నారు. తాజాగా హొసూరులో తెదేపా నేత వాకిటి శ్రీనివాసులు అత్యంత కిరాతకంగా హత్యకు గురయ్యారు.

2021 జూన్‌లో గడివేముల మండలం పెసరవాయిలో తెదేపా నాయకులు వి.నాగేశ్వరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి సోదరులు వైకాపా నాయకుల చేతిలో బలయ్యారు.

డోన్ ప్రస్తుత ఎమ్మెల్యే కోట్ల ముఖ్య అనుచరుడు, గోనెగండ్ల మండలం కున్నూరుకు చెందిన కురువ సిద్ధప్ప 2022 అక్టోబరులో కోడుమూరులో హత్యకు గురయ్యారు.

వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లెకి చెందిన తెదేపా నేత ఎం.గిరినాథ్ చౌదరి (30) జూన్ 9న హత్యకు గురయ్యారు. మొత్తం 16 మందిని నిందితులుగా గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు. వారందరూ వైకాపాకు చెందినవారేనని పోలీసులు అప్పట్లో నిర్ధారించారు.

డోన్ మండలం వెంకటనాయునిపల్లెకు చెందిన ఎం.మాధవయ్యపై జులై 7న వైకాపా నేతలు దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ ఆయన చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన తెదేపా నేత అట్ల శ్రీదేవి జూన్ 25న హత్యకు గురయ్యారు. ఆ కేసులో నిందితులు ఆమె సొంత మరిది, తోడికోడలే కారణమని పోలీసులు తేల్చారు. మహానంది మండలం సీతారామాపురానికి చెందిన పసుపులేటి సుబ్బరాయుడిని ఆర్థిక విభేదాల కారణంగా అంతమొందించారు. బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి, పసుపులేటి సుబ్బరాయుడు ఇద్దరూ వైకాపాలో ఉన్నప్పుడే ఆర్థికపరమైన విషయాల్లో గొడవ పడేవారు. దీన్ని మనసులో పెట్టుకొని సుబ్బరాయుడిని శ్రీనివాసరెడ్డి ఇటీవల హత్య చేయడం కలకలం రేపింది.

# స్థానికులకే ఇసుక ఇవ్వండి



బొబ్బిలి : బొబ్బిలిలోని ఇసుక విక్రయ కేంద్రం నుంచి విజయనగరం, విశాఖ జిల్లాలకు లారీల్లో ఎక్కువగా ఇసుక తీసుకెళుతున్నారు. ఒడిశా నుంచి ఖాళీగా వస్తున్న లారీ చోదకులు, పారిశ్రామికవాడకు ముడిసరకుతో వచ్చిన భారీ వాహనాల వారు తిరిగి వెళ్లేటప్పుడు ఇసుకను కొనుగోలు చేసి.. అక్కడ అమ్ముకుంటున్నారని స్థానికులు ఆరోపించారు. ఈ నేపథ్యంలో స్థానిక అవసరాలకు ఉండదని, బొబ్బిలి ప్రాంతం వారికే ముందు కేటాయించాలని అధికారులను కోరారు. విక్రయ కేంద్రం వద్దకు చేరుకుని, విశాఖ నుంచి వచ్చిన లారీలను పంపేయాలని, అమ్మకాలు ఆపాలని పట్టుబట్టారు. దీంతో అధికారులు ఇతర జిల్లావాసులకు విక్రయాలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం గత నెల 8న ఇసుక అమ్మకాలు ప్రారంభించింది.

**అధికంగా విక్రయం**

జిల్లాలోని తాడివాడలో 9,576, కొత్తవలసలో 11,805 టన్నులుండగా. పది రోజుల్లోనే అయిపోయింది. బొబ్బిలిలో 72,456 టన్నులు నిల్వ ఉండడంతో పార్వతీపురం మన్యం జిల్లావాసులు ఇక్కడి నుంచి తీసుకెళ్తున్నారు. టన్ను రూ.605కు అధికారులు విక్రయిస్తున్నారు. నిబంధనల మేరకు ఒక వ్యక్తికి రోజుకు 20 టన్నులు ఇస్తున్నారు. ఇదే అదనుగా లారీ చోదకులు ఇసుక కొని విజయనగరం, విశాఖలో టన్ను రూ.1,800 నుంచి రూ.2 వేలకు అమ్ముకుంటున్నారు. 20 టన్నులు రూ.12,100 కొనుగోలు చేస్తే.. పట్టణాల్లో రూ.36 వేల నుంచి రూ.40 వేలకు విక్రయిస్తున్నారు ఇంధన ఖర్చులు రూ.10 వేలు పోయినా మిగిలిన మొత్తం ఆదా అవుతోంది. అంతేకాదు కేంద్రంలో తూనిక యంత్రం పనిచేయడం లేదు. జేసీబీ తొట్టె 1.5 టన్నులు వస్తుందని అంచనా కట్టి లారీల్లో వేస్తున్నారు. ఇది 20 టన్నులు దాటే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

**ఫొటో ఉంటేనే ఇసుక** ఇసుకకు డిమాండు పెరగడంతో కొన్ని నిబంధనలు విధించాం. విశాఖ నుంచి వచ్చే లారీలకు ఇవ్వవద్దని ఆదేశించాం. విజయనగరం వాహనా లకు ఇవ్వాలని చెప్పాం. కొనేవారు ఆధార్, ఇంటి నిర్మాణం ఫొటో చూపాలి. స్థానికులను ఇబ్బంది పెట్టలేదు. ఎవరికైనా 20 టన్నుల మేరకు ఇసుక ఇస్తున్నాం. ఎంత కావాలన్నా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. తూకంలో తేడాలు లేకుండా సరిచేశాం. ఎం.శ్రీను, తహసీల్దారు, బొబ్బిలి

# జీవజలం.. హాలాహలం!

చింతలపూడి : అనేక రుగ్మతలకు కలుషిత నీరే ప్రధాన కారణం. జల కాలుష్యం కారణంగా పేద, మధ్య తరగతి ప్రజలూ శుద్ధి జలం కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు నాసిరకం నీటిని డబ్బాలు, ప్యాకెట్లలో నింపి సొమ్ము చేసుకుంటున్నారు. జీవనాధారమైన జలమే హాలాహలం అవుతుండటంతో ఏం తాగాలో తెలియక ప్రజలు సతమతమవుతున్నారు.

ఆహార భద్రత ప్రమాణాల చట్టం 2006 ప్రొహిబిషన్, రిస్ట్రిక్షన్ సేల్స్ రెగ్యులేషన్ చట్టం ప్రకారం అనుమతి లేకుండా ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ తయారు చేసి అమ్మడం నేరం. పంచాయతీలు, నగర పంచాయతీలు, పురపాలక, నగర పాలక సంస్థల్లో కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న రక్షిత నీరు వర్షాకాలంలో కలుషితమవుతోంది. ఆ నీరు తాగితే రోగాలు వస్తుండటంతో ప్రజలు ప్రైవేటు కేంద్రాల్లో రూ.20 నుంచి రూ.40 వరకు వెచ్చించి నీటిని కొనుగోలు చేస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు.. ఉమ్మడి జిల్లాలోని కొన్ని నీటి ప్లాంట్లలో ఆహార భద్రత అధికారులు నమూనాలు సేకరించి పరీక్షలకు పంపితే పీహెచ్ విలువ 6 కంటే తక్కువ ఉన్నట్లు గుర్తించారు. సాధారణంగా పీహెచ్ విలువ 6 నుంచి 8.5 మధ్య ఉండాలి. భూగర్భజలాన్ని శుద్ధి చేసేటప్పుడు ఫిల్ట్రేషన్, ఏరేషన్, కార్బన్ ఫిల్ట్రేషన్.. ఇలా 12 రకాల శుద్ధి ప్రక్రియలు నిర్వహించాల్సి ఉంటుంది. ఐఎస్‌వో ప్రమాణాల ప్రకారం సీసాలు, క్యాన్లు పాలీ ఇథలిన్, పాలీ వినైల్ క్లోరైడ్, పాలీ



ప్రొపిలీన్‌లతో తయారైనవి వాడాలి. ఉమ్మడి జిల్లాలో చిన్న, పెద్ద ప్లాంట్లతో కలిపి సుమారు 2500 ఉన్నాయి. వీటిలో అధికారికంగా భారతీయ ప్రమాణాల బ్యూరో (బీఐఎస్) గుర్తింపు ఉన్నవి పద్నాలుగే. ఆర్వో సిస్టమ్‌లో రీయాడింగ్ ప్రాసెస్ అత్యంత దారుణంగా ఉందని, ప్రజలు ఈ నీరు తాగి అనారోగ్యం బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. వర్షాకాలం వస్తే... భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం, ఏలూరు, నూజివీడు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం పురపాలక సంఘాల్లో వర్షాకాలం వచ్చిందంటే జ్వరాలు విజృంభించడం సర్వసాధారణం. చింతలపూడి, జంగారెడ్డిగూడెం, ఏలూరులో ప్రజలు డెంగీ, మలేరియా బారినపడి ఆసుపత్రుల పాలవుతున్నారు. తాగునీరు, లూజు అమ్మకాలపై పర్యవేక్షణ, నియంత్రణాధికారం స్థానిక సంస్థలదే. ప్రజారోగ్య విభాగమున్నా అనధికార నీటి శుద్ధి కేంద్రాలపై తనిఖీలు చేయడం లేదు. ఆహార భద్రత విభాగంలో సిబ్బంది కొరత కారణంగా ఆ శాఖ పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు.

# బడి ఈడు బాలల గుర్తింపునకు జల్లెడ

ఏలూరు : జిల్లాలో బడి ఈడు బాలలను గుర్తించడానికి జల్లెడ పట్టనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర సచివాలయంలో విద్యా శాఖ, నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖలపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో బడి ఈడు పిల్లలెవరూ బయట ఉండటానికి వీల్లేదని, విద్య ప్రతి ఒక్కరి హక్కు అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ విధానాలతో ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు పడిపోయాయని, బడి మానేసిన వారి సంఖ్య భారీగా పెరిగిందని చెప్పడంతో పాటు ఇకపై ప్రమాణాలు పెంచాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో బడి బయట బాలల గుర్తింపునకు సర్వే చేయనున్నారు.

**ఇప్పటికే పలు సర్వేలు**

జిల్లాలో బడి ఈడు బాలలను గుర్తించడానికి సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో జూన్ 13 నుంచి జులై 12 వరకు నేను బడికి పోతా అనే కార్యక్రమం ద్వారా ప్రత్యేకంగా సర్వే చేశారు. సమగ్ర శిక్షా జిల్లా ప్రాజెక్టు సెక్టోరల్ అధికారులు, సీఆర్‌పీలు, పీటీఐలు, ఐఈఆర్‌టీలు సర్వేలో పాల్గొని బడి బయట బాలలను గుర్తించారు. విద్యా ప్రవేశ కార్యక్రమం ద్వారా జులై 1 నుంచి 31 వరకు బడి ఈడు బాలలను అన్వేషించారు. అలాగే కార్మిక శాఖ ఆధ్వర్యంలో జూన్, జులై మాసాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి బాలలను కనుగొన్నారు. ఆగస్టు నెలాఖరు వరకు కార్మిక శాఖ అధికారులు సిబ్బంది సర్వే కొనసాగించనున్నారు. ఇలా బృందాల



వారీగా చేసిన సర్వేల ద్వారా మొత్తం 122 మందిని గుర్తించడంతో పాటు వారిని పాఠశాలల్లో చేర్పించారు. 15 నుంచి 18 సంవత్సరాల వయసు వారిని ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం దూరవిద్య పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేర్పించారు.

**నిరంతర ప్రక్రియ**

బడి ఈడు కలిగిన బాలల్లో ఏ ఒక్కరూ బడికి దూరంగా జీవించకూడదనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ మేరకు బడి బయట బాలల కోసం నిరంతరం అన్వేషణ సాగుతూనే ఉంటుంది. తాజాగా సీఎం మరోమారు ఇదే అంశాన్ని ప్రస్తావించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో మరోమారు సర్వే చేయనున్నట్లు ప్రత్యామ్నాయ పాఠశాలల జిల్లా సమన్వయకర్త జి.రాధాకృష్ణ తెలిపారు. జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా బడి బయట బాలలు కనిపిస్తే ఆ సమాచారాన్ని 98482 29622 నంబరుకు ఫోన్ చేసి తెలపవచ్చని వివరించారు.

నిఘానేత్రం
తెలుగు దినపత్రిక



# తెదేపా పరం కానున్న పురం పురపాలిక?

హిందూపురం : సొంత పార్టీపై, నాయకత్వంపై ఎన్నికలకు ముందు నుంచే విసుగు చెందిన 10 మంది వైకాపా కౌన్సిలర్లు తెదేపాలో చేరడానికి సిద్ధమయ్యారు. ఎమ్మెల్యే బాలకృష్ణ సమక్షంలో పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. వారు తెదేపా నాయకులతో చర్చలు జరిపారు. ఇటీవల అభివృద్ధి విషయంలో కొందరు వైకాపా కౌన్సిలర్లు అడ్డు పడుతుండటంతో పలు అంశాలకు కౌన్సిల్ ఆమోదం లభించడంలేదు. కౌన్సిల్ సమావేశాల్లో తీర్మానాల ఆమోదానికి 20 మంది సభ్యుల మద్దతు అవసరం. అయితే తెదేపా, భాజపాతో పాటు పార్టీలో చేరిన మరో ఇద్దరి సభ్యులు కలిసి ప్రస్తుతానికి 10 మంది మాత్రమే అధికార పార్టీకి బలం ఉంది. దీంతో మరో 10 మంది కౌన్సిలర్లు అవసరం కావడంతో కొందరిని పార్టీలోకి తీసుకోవాలని తెదేపా నాయకులు నిర్ణయించారు. అయితే తెదేపాలో చేరడానికి ఏకంగా 15 మంది ముందుకొచ్చారు. వారిలో ఐదుగురిని పార్టీలో చేర్చుకోవడానికి తెదేపా నాయకత్వం తిరస్కరించినట్లు తెలుస్తోంది. వీరు వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ఇష్టారాజ్యంగా ప్రవర్తించారు.




దీంతో వారిని పక్కన బెట్టి, మిగిలిన వారిని చేర్చుకోవాలని నిశ్చయించారు. మరో వైపున పదవి చేపట్టినప్పటి నుంచి పార్టీలో కొన్ని వర్గాల నుంచి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఛైర్ పర్సన్ సైతం తన పదవికి రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఆమె రాజీనామా చేస్తే, తెదేపా పక్ష నాయకుడు, వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన రమేశ్‌కు ఛైర్మన్ పదవిని ఇవ్వాలని నాయకులు సమాలోచనలు జరుపుతున్నారు.

# హాయిగా.. విశ్రాంతి

సాలూరు : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల కష్టాలు తీరాయి. కొత్తగా నిర్మించిన షెడ్డులో విశ్రాంతి తీసుకుంటున్నారు. దశాబ్ద కాలంగా రోగుల సహాయకులు చెట్టు కింద, పరాయి పంచన కూర్చొని విశ్రాంతి పొందేవారు. రాత్రి వేళల్లో నిద్రించేందుకు నానా అవస్థలు పడేవారు. మంత్రి సంధ్యారాణి ఆసుపత్రిని సందర్శించి రోగులు, వారి సహాయకులు పడుతున్న కష్టాలు చూసి చలించారు. బిడ్డకు పాలిచ్చే తల్లి, అనారోగ్యంతో బాధపడుతున్న రోగి, ఎండకు వానకు తలదాచుకునే దిక్కులేని పరిస్థితిలో ఉన్నవారితో మాట్లాడారు. తక్షణమే వారికి నిలువనీడ, విశ్రాంతి పొందేందుకు షెడ్డు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా



కలెక్టర్ రూ. 10 లక్షలు నిధులు మంజూరు చేశారు. వీటితో ఆసుపత్రి బయట అదనపు మంచాలు వేసేందుకు సీమాంక్ సెంటర్ వద్ద నిర్మించిన షెడ్డును మంత్రి ప్రారంభించారు. మా బాధ్యత..: ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులంతా పేదరికంతో బాధపడేవారే. రెండుసార్లు ఆసుపత్రిని సందర్శించాను. రోగులు, వారి సహాయకులు పడుతున్న కష్టాలు చూశాను. ప్రభుత్వ బాధ్యతగా వారికోసం తాత్కాలిక ఉపశమనం కోసం షెడ్లు నిర్మించాం. త్వరలో వంద పడకల ఆసుపత్రి భవనం పనులు పూర్తిచేయించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం. గుమ్మిడి సంధ్యారాణి, గిరిజన శాఖ మంత్రి

# బడి భోజనం ఇలా.. తినేదెలా?

పాలకొల్లు : మధ్యాహ్న భోజనం చేసే విద్యార్థుల శాతంలో జిల్లా బాగా వెనుకబడి ఉందని.. యాభై శాతమే తింటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గణాంకాల ద్వారా వెల్లడైందని విద్యా శాఖ ఆర్జేడీ జి.నాగమణి ఇటీవల మార్టేరులో నిర్వహించిన ప్రధానోపాధ్యా యుల సమావేశంలో వాపోయారు. ఇందుకు భోజనం చేసిన విద్యార్థులే నిదర్శనం. హాజరైన విద్యార్థుల్లో చాలా మంది ఉపాధ్యాయుల మాట కాదనలేక భోజనానికి ఊ కొట్టడం తప్ప అన్ని రకాల వంటకాలు తినడం లేదని 'న్యూస్‌టుడే' పరిశీలనలో బుధవారం తేలింది. కొందరు కోడి గుడ్డు తింటుంటే.. మరికొందరు ఫ్రైడ్ రైస్ మాదిరిగా వండిన భోజనం తింటున్నారు. పాలకొల్లు ఎం.ఎం.కె.ఎన్. ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో కొందరు బాలికలు



ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకుని మధ్యాహ్న భోజన సమయంలో తింటున్నారంటే అక్కడి నిర్వహణపై వారికున్న నిరాసక్తిని అర్థం చేసుకోవచ్చు.పాలకొల్లు, పెనుగొండ, యలమంచిలి, నరసాపురం ప్రాంతాల్లోని పలు పాఠశాలల్లో విద్యార్థులను భోజనం నాణ్యతపై ఆరా తీయగా కుర్మాగా వండాల్సిన కూరలు సైతం పలచగా పులుసుగా వండుతున్నా రని చెబుతున్నారు.

శుద్ధి చేసిన తాగునీరు లేక అన్నిచోట్ల 70 శాతం మంది విద్యార్థులు ఇంటి నుంచే తాగునీరును సీసాలతో తెచ్చుకుంటున్నారు.జిల్లాలోని మధ్యాహ్న భోజనం పథకాన్ని పర్యవేక్షిస్తున్న సహాయ సంచాలకుడు ఎన్.సత్యనారాయణను సంప్రదించగా నిర్వహణపై పూర్తిగా దృష్టి సారించామని తెలిపారు. పోషక విలువలున్న ఆహారాన్ని తప్పక తీసుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. వంటల నాణ్యతపై ఆదేశాలు జారీ చేస్తామని తెలిపారు.

# ఎస్పీడీసీఎల్‌కే షాకిచ్చారు..



చిత్తూరు : వైకాపా పాలనలో విద్యుత్తు శాఖ ఏపీఎస్పీడీసీఎల్‌లో అవినీతి అక్రమాలు అన్నీఇన్నీ కావు.. అప్పటి విద్యుత్తు శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండతో కొందరు అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు.. షిఫ్ట్ ఆపరేటర్ నియామకం మొదలు.. రూ. 10 వేల విలువ చేసే పని నుంచి వేల రూ.కోట్ల విలువ చేసే పనుల వరకు కాంట్రాక్ట్ అంతా పెద్దిరెడ్డి, వైకాపా నాయకుల అనుచరులకే కట్టబెట్టారు.. నిబంధనలను తుంగలో తొక్కి కొందరు ఉన్నతాధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టి రెండు నెలలు పూర్తయినా నేటికీ ఇక్కడ వైకాపాతో అంటకాగిన అధికారుల తీరులో మార్పులేదు.. ఇప్పటికే కొందరు అధికారులు వైకాపా ప్రభుత్వంలో వ్యవహరించిన తరహాలోనే పాలన సాగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**అంతా అడ్డగోలుగానే..**


తిరుపతిలోని ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో అంతా అడ్డుగోలు నిర్ణయాలే. వైకాపా అంటకాగిన కొందరు ఉన్నతాధికారులు అప్పటి మంత్రి పెద్దిరెడ్డి అండతో పెట్రేగిపోయారు. కోట్లాది రూపాయలు మంత్రికి కట్టబెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. కార్పొరేట్ కార్యాలయంలో కొందరు అధికారుల వ్యవహారశైలి వారు చెప్పిందే జరగాలనే తరహాలో ఉంది. కాదని ఎవరైనా మాట్లాడితే ఎక్కడికి బదిలీ చేస్తారో ఆ దేవదేవుడికే ఎరుక. ఆపరేషన్ విభాగంలో ప్రత్యేకించి వెల్లువెత్తుతున్న ఆరోపణలు అన్నీఇన్నీ కావు. ముఖ్యంగా చిత్తూరు రూరల్ డివిజన్, తిరుపతి అర్బన్, పుత్తూరు డివిజన్ ఆపరేషన్ ఈఈలు వైకాపా అంటకాగి పలు అక్రమాలకు ఒడిగట్టారనే బహిరంగ ఆరోపణలు సంబంధిత శాఖ నుంచే వినిపిస్తున్నాయి.

**పెద్దాయన సంస్థకే రూ.7వేల కోట్ల పనులు..**

అయిదేళ్లలో రూ. 7 వేల కోట్ల అంచనా విలువ కలిగిన పనులను.. అప్పటి మంత్రి పెద్దిరెడ్డికి సంబంధించిన సంస్థకే కట్టబెట్టారు. డిస్కం పరిధిలో ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద రూ. 5 వేల కోట్ల పనులు, ఆపరేషన్ విభాగంలో రెండు వేల కోట్ల అంచనా కలిగిన నూతన ఉప కేంద్రాల నిర్మాణం, 33కేవీ, 11కేవీ విద్యుత్తు లైన్ల ఏర్పాటు తదితర అన్ని పనులు కార్పొరేట్ కార్యాలయంలో ప్రాజెక్టు విభాగం సీజీఎంగా వ్యవహరిస్తున్న ఓ ఉన్నతాధికారి కనుసన్నల్లోనే ఈ అప్పగింత వ్యవహారం కొనసాగింది. టెండర్ల పేరుతో వంద శాతం పనులు పెద్దాయన సంస్థకే అప్పగించి కోట్లాది రూపాయలను దోచిపెట్టారని ఆ శాఖ అధికారులే చెబుతుండటం గమనార్హం. దేశంలోనే ఎక్కడా లేనంతగా నియంత్రికలు, అనుబంధ పరికరాల ధర పెంచి ప్రజలు, రైతులపై మోయలేని ఆర్థిక భారాన్ని మోపి కొనుగోలు ఘనులుగా పేరు తెచ్చుకున్నారు.

**వివరాల సేకరణలో కూటమి ప్రభుత్వం..**ఎస్పీడీసీఎల్‌లో గత అయిదేళ్లలో జరిగిన అవినీతి అక్రమాలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కార్పొరేట్ కార్యాలయం, ఆపరేషన్ విభాగాల్లో పరిపాలన వ్యవహారాలు, అధికారుల పనితీరు తదితర అంశాలపై క్షుణ్ణంగా వివరాలు సేకరిస్తున్నారు. విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఇప్పటికే డిస్కంలలో పరిపాలన ప్రక్షాళన దిశగా ముందుకెళ్తున్నారు. ఉన్నతస్థాయి నుంచి క్షేత్రస్థాయి అధికారుల వరకు పూర్తిస్థాయిలో ప్రక్షాళన జరిగితే తప్ప ఇక్కడ పాలన పారదర్శకంగా కొనసాగే పరిస్థితి లేదని ఆ శాఖ ఉద్యోగులే పేర్కొంటున్నారు.

# ఫ్రీగా ధారాదత్తం చేశారా?




తిరుపతి: ఫ్రీహోల్డ్ పేరుతో వైకాపా నేతలు రైతుల నుంచి కొట్టేసిన భూముల చిట్టా బట్టబయలు కానుంది. అసైన్డ్ భూముల పేరుతో కుంటలు, కాలువ పోరంబోకులను సైతం రెవెన్యూ శాఖ పలువురికి కట్టబెట్టిన నేపథ్యంలో వాటిని బహిర్గతం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి, చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలాల్లో జరిగిన లావాదేవీలపై ప్రభుత్వం నియమించిన కమిటీ పరిశీలించనుంది.

**అభ్యంతర భూములపైనే..**

గతంలో భూములను రైతులకు అసైన్డ్ చేసేప్పుడు అభ్యంతరం లేని వాటితోపాటు అభ్యంతరం ఉన్న భూముల్లోనూ డీకేటీ పట్టాలిచ్చారు. వాస్తవానికి చెరువులు, కాలువ పోరంబోకు, మేతపోరంబోకులు, అటవీ భూముల్లో డీకేటీ పట్టాలు ఇవ్వకూడదు. ఇలా ఇచ్చిన సమయంలో వీటి వర్గీకరణ (క్లాసిఫికేషన్) మార్పు చేయాలి. వర్గీకరణ చేయని అభ్యంతరకర భూములను వైకాపా నేతలు ఫ్రీహోల్డ్ చేసి.. కొనుగోలు చేసినట్లు ఆరోపణలున్నాయి. కొందరు వైకాపా నేతలు ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడకముందే తమ పేరిట బాండు పేపర్లు రాయించుకున్నారు. అధికారులు వీటిపై దృష్టిసారించనున్నారు. మరోవైపు ఫ్రీహోల్డ్ చేసిన భూములన్నీ 2003కి ముందు ఇచ్చినవా, తర్వాతవా అనే వివరాలు చూడనున్నారు. చుక్కల భూములు, ఇనాం భూములకు సంబంధించి ఆర్డీవోలు, ఎమ్మార్వోలు జిల్లా కలెక్టర్లకు ఇచ్చిన నివేదికలు సక్రమంగా ఉన్నాయా లేదా అనేది పరిశీలించనున్నారు.

**రిజిస్ట్రేషన్లపైనా ఆరా..**

అధికారులు రిజిస్ట్రేషన్లపైనా ఆరా తీస్తున్నారు. శ్రీకాళహస్తి మండలంలో 7,402.575 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేయగా 310 వరకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఇందులోనూ 120 వరకు రిజిస్ట్రేషన్లు గిఫ్ట్, పార్టీషన్ కింద జరిగాయి. మిగిలిన వాటిల్లో క్రయవిక్రయాలు చోటుచేసుకున్నాయి. ఇటు వెదురుకుప్పంలోనూ వీటికి రిజిస్ట్రేషన్లు జరిగాయి. ప్రతి రిజిస్ట్రేషన్ వివరాలు తీసుకుని గిఫ్ట్ ఎవరి పేరుతో చేశారు, పార్టీషన్ చేసిన దస్త్రాలను పరిశీలించనున్నారు.

ఫ్రీహోల్డ్ వివరాలు (ఎకరాల్లో)తిరుపతి జిల్లా: 44,716.54 చిత్తూరు జిల్లా: 84,378 శ్రీకాళహస్తి: 7402.75 వెదురుకుప్పం: 997.37

# హమ్మయ్య.. రాయితీ డబ్బులొచ్చాయ్




పి.గన్నవరం : వైకాపా ప్రభుత్వం ఉద్యానపంటలు సాగుచేసిన రైతులకు ఊతమివ్వాల్సిందిపోయి వారికి చెల్లించాల్సిన రాయితీలను బకాయిలు పెట్టేసింది. దీంతో అప్పట్లో వివిధ పథకాల్లో లబ్ధిపొంది పెట్టుబడులు పెట్టి రాయితీల కోసం ఏళ్ల తరబడి లబ్ధిదారులు నిరీక్షించినా ఫలితం లేకపోయింది. ఈ బకాయిలను ఇటీవల కూటమి ప్రభుత్వం విడుదల చేయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వైకాపా ప్రభుత్వంలో 292 హెక్టార్ల విస్తీర్ణంలో 642 మంది రైతులు వివిధ స్కీముల కింద ఉద్యానపంటలు సాగుచేశారు. ఆయిల్‌పామ్, కోకో, బొప్పాయి, జామ, బత్తాయి, కూరగాయల పంటలతోపాటు, శీతల గదులు, కొబ్బరి సేకరణ కేంద్రాలు నిర్మించారు. వీరికి ఆయా స్కీముల కింద రూ. 1.01 కోట్ల మేర రాయితీలు చెల్లించకుండా వైకాపా ప్రభుత్వం బకాయిలు పెట్టింది. రాయితీ బకాయిలు విడుదల కావడంతో ఆయా రైతులకు ఇటీవల చెల్లించామని జిల్లా ఉద్యానఅధికారి బి.వి.రమణ తెలిపారు.

**తగిన ఊతమిస్తే ఆదాయమే...**

జిల్లాలో ఉద్యానపంటలు సాగు చేసేందుకు అనువైన విస్తీర్ణం ఉంది. విస్తీర్ణంతో పోలిస్తే వివిధ పంటలు సాగుచేసే రైతులు తక్కువమంది ఉన్నారు. జిల్లాలో మొత్తం ఉద్యానపంటల విస్తీర్ణం 48,860 హెక్టార్లు. దీంట్లో ప్రత్యేకించి కొబ్బరి తోటలు 38,534 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నాయి. సుమారు 8వేల హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు అరటి, కోకో వంటి అంతర పంటలు సాగుచేస్తున్నారు. మిగిలిన 30,534 హెక్టార్లను రైతులు అంతరపంటలు వేయకుండా కేవలం కొబ్బరికాయలపైనే ఆధారపడి తోటలను ఖాళీగా ఉంచుతున్నారు. ఇలా ఖాళీగా ఉన్న తోటల్లో అంతరపంటలు సాగుచేసేలా కూటమి ప్రభుత్వం మరింత చేయూత ఇవ్వాల్సిన అవసరం ఉంది. కోకో 1043, వక్క 202, అరటి 3,900 కూరగాయలు 1882 హెక్టార్లతోపాటు, అరటి, మామిడి, జామ, బత్తాయి తదితర పంటలు మరికొంత విస్తీర్ణంలో సాగుచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యానపంటలు సాగుచేసే రైతులకు రాయితీలు ఇచ్చి మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

# కోలుకోని పెడన

పెడన : పెడన పట్టణంలో విష జ్వరాల ఉద్ధృతి కొనసాగుతోంది. స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు జ్వర పీడితులతో నిండిపోయాయి. చికిత్సకు వచ్చే రోగులకు బెడ్లు సరిపోని పరిస్థితి నెలకొంది. దోమల ఉద్ధృతి వల్లే ఈ పరిస్థితి నెలకొందని ప్రజలు చెబుతున్నారు. అధికారులు పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టిసారించకపోవడం వల్లే తామంతా రోగాల పాలవుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని బ్రహ్మపురం, వైఎస్ఆర్ కాలనీ, రామలక్ష్మి వీవర్సు కాలనీ, మొగ్గయ్య కాలనీ, రాజీవ్ నగర్, బల్లిపర్రు కాలనీల్లో బాధితుల సంఖ్య అధిక సంఖ్యలో ఉంది. ఆయా ప్రాంతాల్లో ఇప్పటి వరకు సుమారు 100 మంది డెంగీ లక్షణాలతో చికిత్స పొందినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు నిర్వహించిన ప్రాథమిక పరీక్షల్లో 12 మందికి ప్రాథమిక పరీక్షల్లో డెంగీ నిర్ధారణ అయ్యినట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఇక సాధారణ, టైఫాయిడ్‌లతో వచ్చే బాధితులు వందల సంఖ్యలో ఉంటున్నారు. కొంత మంది ఆస్పత్రుల్లో ఇన్‌పేషెంట్లుగా చేరి చికిత్స తీసుకుంటుండగా.. అధిక శాతం మంది ఔట్ పేషెంట్లుగా ఉన్నారు. జ్వరం వస్తే పది రోజుల వరకు తగ్గడం లేదని, ప్లేట్‌లెట్ల సంఖ్య భారీగా తగ్గిపోతుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థికంగా భారమైనప్పటికీ చాలా మంది విజయవాడలోని కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. అప్పులు చేసి వైద్య సేవలు పొందుతున్నారు.



**దోమల వల్లే ఈ పరిస్థితి..**

-డా. పర్వీజ్ హైదర్ బాకరీ, వైద్యాధికారి

జ్వర బాధితులు అధిక సంఖ్యలోనే ఉన్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన ప్రాథమిక పరీక్షల్లో 12 మందికి ప్రాథమిక పరీక్షల్లో డెంగీ నిర్ధారణ అయ్యింది. ఆయా నమూనాలను 'ఎలీసా' (ఎంజైమ్ లింక్డ్ ఇమ్యూనోసార్బెంట్ ఎస్సే) పరీక్షకు మచిలీపట్నం జిల్లా ఆసుపత్రికి పంపించాం. ఆ ఫలితాల ఆధారంగా డెంగీ జ్వరమా..? కాదా అని పూర్తిస్థాయిలో నిర్ధారణ అవుతుంది. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుధాకర్ ఎప్పటికప్పుడు లార్వాల నిర్మూలన చర్యల్ని పర్యవేక్షిస్తున్నారు. మరిన్ని చోట్ల వైద్యశిబిరాల ఏర్పాటుకు జిల్లా అధికారులు ఆదేశించారు.

**రక్త నమూనాల సేకరణ..** మలేరియా సబ్‌యూనిట్ అధికారిని పెడనకు వెళ్లి పరిస్థితిని సమీక్షించాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. ఈ మేరకు సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి రక్త నమూనాలు సేకరిస్తున్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామయ్య సైతం ప్రజారోగ్య విభాగంలో నిర్లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్న తొమ్మిది మంది శానిటరీ కార్యదర్శులను అంతర్గత బదిలీ చేశారు.

# హస్నాబాద్‌లో అతిసారం విజృంభణ

క్రోసూరు : క్రోసూరు మండలం హస్నాబాద్‌లో డయేరియా ప్రబలింది. 10 మందికిపైగా బాధితులు సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో, మరికొందరు స్థానికంగా ఆర్‌ఎంపీల వద్ద చికిత్స పొందుతున్నారు. వాంతులు, విరేచనాలతో ఆసుపత్రిలో చేరే వృద్ధులు, చిన్నారుల సంఖ్య ఎక్కువగా ఉంది. మెరుగైన వైద్యం కోసం బాధితులు సత్తెనపల్లి, గుంటూరు ప్రభుత్వాసుపత్రులకు తరలుతున్నారు. కలుషిత నీరు, ఆహార కాలుష్యంతో అతిసార వచ్చినట్లు ఆరోగ్య సిబ్బంది పేర్కొంటున్నారు. పానీపూరీ వంటి చిరుతిండ్ల వల్ల అతిసార వచ్చినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అంకమ్మ చెట్టు వీధిలో వైద్యులు షేక్ మహమ్మద్ వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌వో బి.రవి గ్రామాన్ని సందర్శించారు. ఇంటింటి సర్వే నిర్వహించి డయేరియా కేసులు గుర్తించాలని సిబ్బందికి సూచించారు. నీటి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు.

గంగిరెడ్డిపాలెంలో మరో మూడు కేసులు: మాచవరం: మండలంలోని గంగిరెడ్డిపాలెం ఎస్సీ కాలనీలో మరో మూడు అతిసార కేసులు నమోదు అయ్యాయి. అక్కడ అతిసారం అదుపులోకి రావడం లేదు. బుధవారం కాలనీకి చెందిన పౌలయ్య, ఆదాం, ఏసుబాబులకు వాంతులు, విరేచనా



లు కావడంతో వైద్యులు చికిత్స అందించారు. పీహెచ్‌సీ వైద్యుడు ప్రసాదరావు బాధితుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.

**ఒప్పిచర్లలోనూ...**

కారంపూడి: మండలంలోని ఒప్పిచర్లలో ప్రబలిన అతిసార అదుపులోకి రాలేదు గ్రామంలోని వైద్యశిబిరంలో 18 మంది పరీక్షలు చేయించగా.. బొమ్మనబోయిన త్రివేణి, బత్తుల కోటమ్మ, గుడ్డగాని కోటమ్మలను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన వారికి మందులను పంపిణీ చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామంలో సేకరించిన నీటి నమూనాల ఫలితాలు రావడంతో ఎస్సీ కాలనీలోని బోరును మూసివేశారు. పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నారు. తహసీల్దార్ ప్రసాద్ అతిసారంపై ఆరోగ్య సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు.

**కారంపూడిలో..:** కారంపూడిలోనూ అతిసార కేసులు నమోదవుతున్నాయి. పోస్టాఫీసు సెంటర్లో చందారపు సిద్దయ్య, ఆదినారాయణకాలనీలో చల్లా గోపాల్ రెండ్రోజులుగా వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు.

## ట్రెండీ డ్రెస్ లో సామ్.. వ్హాటే లుక్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంతకు ఎలాంటి క్రేజ్, ఫ్యాన్ బేస్, ఫాలోయింగ్ ఉందో అందరికీ తెలిసిందే. 14 ఏళ్ల సినీ కెరీర్ లో ఎన్నో విజయాలు సాధించింది. మరెన్నో ప్రశంసలు అందుకుంది. అన్నిటి కన్నా.. వేరే లెవెల్ లో పాపులారిటీ దక్కించుకుంది. ప్రభాస్ మినహా టాలీవుడ్ స్టార్ హీరోలందరితో ఆడిపాడింది. ఆమె యాక్ట్ చేసిన చిత్రాలు దాదాపు అన్నీ బాక్సాఫీస్ వద్ద మంచి హిట్స్ గా నిలిచాయి. చివరగా ఖుషి సినిమాతో సందడి చేసింది సామ్. యశోద మూవీ టైమ్ లో మయోసైటిస్ బారిన పడ్డ సమంత.. ఆ తర్వాత చికిత్స తీసుకుంది. తన చేతిలో ఉన్న ప్రాజెక్ట్స్ ను కంప్లీట్ చేసి విదేశాలకు వెళ్ళింది. ట్రీట్మెంట్ తో పాటు రెస్ట్ తీసుకుంది. ఆధ్యాత్మిక పర్యటనల్లో మునిగితేలింది. ప్రకృతిని ఆస్వాదిస్తూ గడిపింది. రీసెంట్ గా ఇండియాకు వచ్చింది. హెల్త్ సెట్ అవ్వడంతో మళ్ళీ సినిమాలతో బిజీ అయ్యేందుకు సిద్ధమైంది. తన సొంత బ్యానర్ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పై మా ఇంటి బంగారం పేరుతో మూవీ అనౌన్స్ చేసింది.



అయితే సామ్.. త్వరలో సిటాడెల్ హనీ బన్నీ వెబ్ సిరీస్ తో ప్రేక్షకుల ముందుకు రానుంది. రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించిన ఆ సిరీస్.. అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. రీసెంట్ గా ఆ సిరీస్ ప్రీమియర్ ను లండన్ లో ప్రదర్శించారు. ఆ కార్యక్రమానికి సమంత అటెండ్ అయింది. సింపుల్ ప్లెయిన్ కలర్ డ్రెస్ వేసుకున్న అమ్మడు.. అక్కడ ఎట్రాక్షన్ గా నిలిచింది. అందుకు సంబంధించిన ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో షేర్ చేసింది. ప్లెయిన్ ట్రెండీ డ్రెస్ లో సమంత అదిరిపోయింది. కేజ్రీ పోజులతో మైండ్ బ్లాక్ చేసింది. సింపుల్ గా కనిపిస్తూనే ఆకట్టుకుంది. ప్రస్తుతం సామ్ పిక్స్ నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. ఫోటోస్ అదిరిపోయాయని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఏ ఔట్ ఫిట్ అయినా అమ్మడు సూపర్ అని చెబుతున్నారు. లైక్స్ కొడుతూ కామెంట్ సెక్షన్ నింపుతున్నారు. మరోవైపు, సిటాడెల్ వెబ్ సిరీస్ కోసం సామ్ చాలా కష్టపడింది. అనేక విద్యలు నేర్చుకుంది. షూటింగ్ టైమ్ లో హెల్త్ ఇష్యూ వల్ల పలుమార్లు ఇబ్బందులు ఎదుర్కొంది. ఈ విషయాలను స్వయంగా ఆమెనే చెప్పింది. ఇప్పుడు జోరుగా ప్రమోషన్స్ చేసేందుకు సిద్ధమైంది. మరి ఈ వెబ్ సిరీస్ తో సమంత ఎలాంటి హిట్ అందుకుంటుందో వేచి చూడాలి.

## ఆలియా 'చుట్టమల్లె'.. ఎంత క్యూట్ గా పాడిందో!

'చుట్టమల్లె చుట్టేస్తాంది.. తుంటరి చూపు.. ఊరికే ఉండదు కాసేపు..' అంటూ సాగే దేవర మూవీ సాంగ్ ఎలాంటి హిట్ అయిందో అందరికీ తెలిసిందే. టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ నటించిన ఆ సినిమాలోని రొమాంటిక్ సాంగ్.. తొలిసారి వినగానే అనిరుధ్ రవిచందర్ మంచి మెలోడీ ఇచ్చారని ప్రశంసించారు. ఆ తర్వాత అలా వింటుంటే భలే ఉందని కొనియాడారు. అలా సాంగ్ కు ఫిదా అయ్యారు. రిపీటెడ్ మోడ్ లో విన్నారు. దీంతో రిలీజ్ అయిన తక్కువ టైమ్ లో వేరే లెవెల్ లో వ్యూస్ దక్కించుకుంది చుట్టమల్లె సాంగ్. సోషల్ మీడియాలో ఆ సాంగ్ కు రీల్స్ అయితే చెప్పనక్కర్లేదు. ఇప్పటికీ కనిపిస్తూనే ఉంటాయి. ఎవర్ గ్రీన్ సాంగ్ గా నిలిచిపోయింది. అనేక మంది ఫేవరేట్ మ్యూజిక్ లిస్ట్ లోకి చేరిపోయింది. తాజాగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్.. తెలుగులో చుట్టమల్లె సాంగ్ పాడింది. స్వీట్ వాయిస్ తో ప్రొఫెషనల్ సింగర్ లా ఆలపించింది. అందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతోంది. ఆలియా.. వాయిస్ అదిరిపోయిందని నెటిజన్లు



కొనియాడుతున్నారు. చాలా బాగా పాడిందని పొగుడుతున్నారు. అయితే కొరటాల శివ దర్శకత్వం వహించిన దేవర మూవీ.. సెప్టెంబర్ 27వ తేదీన పాన్ ఇండియా లెవెల్ లో విడుదల కానున్న విషయం తెలిసిందే. దీంతో మేకర్స్ భారీ ఎత్తున ప్రమోషన్స్ చేపడుతున్నారు. ముఖ్యంగా తారక్ అయితే.. తీరిక లేకుండా గడుపుతున్నారు. సౌత్ టు నార్త్ మంచి బజ్ క్రియేట్ చేశారు. ముంబైలో పలు ఇంటర్వ్యూలు ఇచ్చారు. అందుకు సంబంధించిన ఫుల్ వీడియోస్ ఇప్పుడు రిలీజ్ అవుతున్నాయి. అలా ఓ ఇంటర్వ్యూలో భాగంగానే ఆలియా భట్.. చుట్టమల్లె సాంగ్ పాడి ట్రెండింగ్ లోకి వచ్చింది. ఆలియా యాక్ట్ చేస్తున్న బాలీవుడ్ మూవీ జిగ్రా.. దసరా కానుకగా అక్టోబర్ 11వ తేదీన విడుదల కానుంది. దీంతో బాలీవుడ్ బడా నిర్మాత కరణ్ జోహార్.. ఎన్టీఆర్, ఆలియాతో కలిసి.. దేవర కా జిగ్రా పేరుతో స్పెషల్ ఇంటర్వ్యూ చేశారు. దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన ఆర్ఆర్ఆర్ (రౌద్రం రణం రుధిరం) మూవీతో ఆలియా భట్ తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైన విషయం తెలిసిందే. తన అందం, అభినయంతో మూవీలో బాగా మెప్పించింది. పలు సన్నివేశాల్లో తన యాక్టింగ్ తో కట్టిపడేసింది అమ్మడు.




## హాట్ బ్యూటీల నోట ఆ మాట..అదేంటంటే?



బీచ్ అంటే ఎవరికి ఇష్ట ఉండదు. సాగర తీరం అందాలని ఆస్వాదించాలనే దేశాలు..ఖండాలు సైతం దాటెళ్లిపోతుంటారు సెలబ్రిటీలు. మాల్దీవులతో వివాదం లేనంత కాలం ఎంచక్కా హీరయిన్లు అంతా ఫ్లైట్ ఎక్కి అక్కడ వాలిపోయారు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. మాల్దీవులకు ధీటుగా లక్ష్య దీవుల్ని రెడీ చేస్తున్నారు. అండమాన్ దీవులు అంతే అందంగా ఉంటాయి. దేశంలో ఇతర సాగర తీరాలను మరింత వృద్ధిలోకి తీసుకొస్తున్నారు.

మరి ఈ బీచ్ బ్యూటీ గురించి హాట్ భామల మనసులో ఏమనుకుంటు న్నారంటే?... నేషనల్ క్రష్ రష్మిక మందన్నా అలల శబ్దానికి కష్టాలన్నీమర్చిపోతుందిట. మనసు ప్రశాంతంగా ఉటుందంది. అలాగే శ్రీలీల బీచ్ ని దగ్గర నుంచి చూస్తే భావోద్వేగాలు అదుపులో ఉండవు అంది. చిన్న పిల్లలా మారిపోతుందిట. నీలం రంగు నీళ్ల వైపు అలా చూస్తుంటే మనసు తెలియని ఆనందానికి లోనవుతుందని జాన్వీ కపూర్ చెప్పుకొచ్చింది. తీరానాకి సముద్రం రాసే ప్రేమ లేఖలు అలలు అంటూ హాట్ బ్యూటీ కేతిక శర్మ ముందుకొచ్చింది. ఇక అలియాభట్ బీచ్ లో సన్ సెట్ ని చూస్తుంటే ప్రపంచాన్నే మర్చిపోతుందిట. నీళ్లను చూస్తే చాలు మనసు ప్రశాంతంగా అనిపిస్తుంది. పాడిల్ బోర్డింగ్ అయితే పక్కా ఉండాలి అంటోంది సంయుక్తా మీనన్. ఇక సారా అలీఖాన్ బీచ్ ఇష్టమా? కొండలు చూడటం అంటే ఇష్టమా? అంటే బీచ్ లో సన్ సెట్ ని ఇష్టపడుతన్నట్లు తెలిపింది. ఇక ప్రగ్యా జైశ్వాల్ మనసునైతే సముద్రం దోచేస్తుందిట. అలాగే మాలీవుడ్ బ్యూటీ అనుపమ బీచ్ లో బర్త్ డే చేసుకుంటే ఆ కిక్కే వేరప్పా అంటూ పవన్ కళ్యాణ్ డైలాగ్ కొట్టింది. సూర్యోదయం నుంచి సూర్యాప్త మయం వరకూ బీచ్ లో గడపడం ఎంతో ఇష్టం అంటోంది రకుల్ ప్రీత్ సింగ్. ఇక బీచ్ అందాల్లో ఈ బ్యూటీలంతా ఎలా చెలరేగుతారు? అన్నది చెప్పాల్సిన పనిలేదు. టూపీస్...బికినీ...స్విమ్ షూట్ లో దూరిపోతారు. హాట్ ఫోటోలతో వైవిధ్యమైన భంగిమలతో ఆకట్టుకోవడం పరిపాటే.

## తెలుగు టైర్-2.. కుర్ర భామల గట్టి పోటీ!



టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో హీరోయిన్లకు కొదవ లేదు. ఎప్పటికప్పుడు కొత్త భామలు.. చిత్రసీమకు పరిచయం అవుతూనే ఉంటారు. కొందరు డెబ్యూతోనే మంచి హిట్స్ సాధిస్తారు. మరికొందరు ఫ్లాప్స్ అందుకున్నా.. మెల్లగా క్రేజ్ సంపాదించుకుంటారు. ఇంకొందరు స్టార్టింగ్ లో సక్సెస్ అయినా.. ఇండస్ట్రీకి దూరం అయిపోతుంటారు. ఏదేమైనా.. ఇప్పుడు తెలుగులో యంగ్ బ్యూటీలు బోలెడు మంది ఉన్న విషయం తెలిసిందే. తమ సినిమాలతో అలరిస్తున్నారు. యాక్టింగ్ తో మెప్పిస్తున్నారు. అయితే తెలుగు సినీ ఇండస్ట్రీలో టైర్-1, టైర్-2 క్యాటగిరీస్ ఉన్న సంగతి తెలిసిందే. హీరోల్లానే.. హీరోయిన్లకు కూడా అవి ఉంటాయి. ఇప్పుడు టైర్-2 హీరోయిన్ల క్యాటగిరీలో టాప్ ప్లేస్ కోసం పలువురు బ్యూటీలు పోటీ పడుతున్నారని తెలుస్తోంది. వరుస ఛాన్సులు దక్కించుకుని.. టాప్ ప్లేస్ కు వెళ్లిపోవాలని ఉవ్విళ్లూరుతున్నారు భామలు. తమ అప్ కమింగ్ చిత్రాలపై నమ్మకాన్ని పెట్టుకున్నారు. కొత్త అవకాశాల కోసం చూస్తున్నారు. వారిలో మీనాక్షి చౌదరీ.. అందరి కన్నా ముందు ఉందని టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం టాలీవుడ్ లో మీనాక్షి చౌదరీకి ఫుల్ డిమాండ్ ఉందని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. అటు సీనియర్ ఇటు జూనియర్ హీరోల సినిమాల్లో యాక్ట్ చేస్తోంది. ఫుల్ బిజీ బిజీగా గడుపుతోంది. 2024 సంక్రాంతికి వచ్చిన గుంటూరు కారంలో నటించిన అమ్మడు.. రీసెంట్ గా విజయ్ ది గోట్ లో మెరిసింది. ప్రస్తుతం వెంకటేష్, అనిల్ రావిపూడి ప్రాజెక్ట్ లో యాక్ట్ చేస్తోంది. వరుణ్ తేజ్ మట్కా, విశ్వక్ సేన్ మెకానిక్ రాకీ, దుల్కర్ సల్మాన్ లక్కీ భాస్కర్, మెగాస్టార్ చిరంజీవి విశ్వంభర చిత్రాలతో త్వరలో సందడి చేయనుంది. రీసెంట్ గా మిస్టర్ బచ్చన్ మూవీతో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన.. హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే టైర్-2 టాప్ ప్లేస్ పై కన్నేసింది. డెబ్యూ సినిమా ఫ్లాప్ అయినా.. కొందరు మేకర్స్ దృష్టిలో పడింది. స్టార్ హీరో విజయ్ దేవరకొండ మూవీలో నటిస్తోంది. రానా, దుల్కర్ సల్మాన్ మల్టీస్టారర్ లో కూడా యాక్ట్ చేస్తోంది. అదే సమయంలో హీరోయిన్ నభా నటేష్.. కొంత గ్యాప్ తీసుకున్న తర్వాత ఇప్పుడు సినిమాల్లో మళ్లీ యాక్ట్ చేస్తోంది. ప్రమాదంలో గాయపడి.. రెస్ట్ తీసుకుని.. వరుస సినిమాలు చేసేందుకు సిద్ధమైంది. ఇప్పుడు స్వయంభులో యాక్ట్ చేస్తోంది. యువ కథానాయకుడు నిఖిల్ హీరోగా తెరకెక్కుతున్న స్వయంభులో ముఖ్యపాత్ర పోషిస్తోంది నభ. గట్టి హిట్ అందుకుని కమ్ బ్యాక్ ఇవ్వాలని చూస్తోంది. మరోవైపు, రాధిక.. అదేనండీ నేహా శెట్టి వరుస సినిమాల్లో నటిస్తోంది. మంచి హిట్ సాధించాలని పట్టుదలతో ఉంది. కెరీర్ ను మలుపు తిప్పే హిట్ కొట్టి.. టాప్ ప్లేస్ కు వెళ్లేందుకు ట్రై చేస్తోంది. బేబీ ఫేమ్ వైష్ణవి చైతన్య కూడా యంగ్ హీరోయిన్లతో పాటు రేసులో ఉంది. మరి వీరంతా తమ కొత్త చిత్రాలతో ఎలా మెప్పిస్తారో.. ఎలాంటి హిట్స్ అందుకుంటారో వేచి చూడాలి.

## జిమ్ ఔట్‌ఫిట్ లో శర్మ సిస్టర్స్ అదుర్స్

రామ్ చరణ్ హీరోగా పరిచయం అయిన చిరుత సినిమాతో నేహా శర్మ హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు నేహా శర్మకి మంచి పేరు వచ్చింది. అయితే లక్ కలిసి రాక పోవడంతో వరుసగా నిరాశ పరుస్తూ ఫెయిల్ అయింది. ఈమె నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద పెద్దగా ఆడలేదు. పైగా చిన్న సినిమాలు, ప్రాముఖ్యత లేని పాత్రలను ఎంపిక చేసుకోవడం వల్ల తక్కువ సమయంలోనే టాలీవుడ్ నుంచి ఈ అమ్మడు తప్పుకోవాల్సి వచ్చింది అనేది ఇండస్ట్రీ వర్గాల అభిప్రాయం. టాలీవుడ్ కి దూరం అయినా బాలీవుడ్ లో కంటిన్యూ అవుతోంది. బాలీవుడ్ లో అడపా దడపా ఆఫర్లు సొంతం చేసుకుంటూ ఇంకా తాను నటిస్తున్నాను అనే విధంగా సినిమాలు చేస్తున్న నేహా శర్మ సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఈ మధ్య కాలంలో ఆమె షేర్ చేసిన ప్రతి ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడం మనం చూస్తూ ఉన్నాం. ఇటీవల నేహా శర్మ సిస్టర్ ఐషా శర్మ సైతం సోషల్ మీడియాలో అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా చూపు తిప్పుకోనివ్వడం లేదు. సాధారణంగా ఇద్దరూ వేరు వేరు ఫోటోలను షేర్ చేస్తేనే ప్రేక్షకులు చూపు తిప్పుకోలేరు. అలాంటిది ఇద్దరూ కలిసి కనిపిస్తే



ఇంకా ఏమైనా ఉందా.. అన్నట్లుగా తాజా ఫోటో ఉంది. నేహా సిస్టర్స్ ఫిట్ గా ఉండటం కోసం రెగ్యులర్ గా జిమ్ కు వెళ్తారు. కేవలం వీరు మాత్రమే కాకుండా హీరోయిన్స్ లో దాదాపు అందరూ ఫిట్నెస్ కోసం రెగ్యులర్ గా జిమ్ చేస్తారు. అలా చేయడం వల్లే వారి అందం రోజు రోజుకు మరింత పెరిగిందా అన్నట్లుగా అందంగా కనిపిస్తారు. ఇప్పుడు నేహా శర్మ సైతం మొదటి సినిమాతో పోల్చితే ఇప్పుడే చాలా అందంగా ఉంది అంటూ ఆమె సన్నిహితులు, నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అక్కకు ఏమాత్రం తగ్గకుండా ఐషా శర్మ సైతం చాలా సన్నగా, నాజూకుగా అందంగా కనిపిస్తూ ఉంటుంది. ముందు ముందు హీరోయిన్ గా మంచి ఆఫర్లు దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటి వరకు సినిమాల్లో అందాల ఆరబోత చేయని ఐషా శర్మ ఇలా అక్కతో కలిసి అప్పుడప్పుడు, సోలోగా అప్పుడప్పుడు ఫోటోలను షేర్ చేసి నెటిజన్స్ చూపు తిప్పుకోకుండా చేస్తుంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ ఇద్దరు ముద్దుగుమ్మల సొంతం అవ్వడంతో ముందు ముందు మళ్లీ వీరిద్దరు సినిమాల్లో బిజీ అవ్వాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. జిమ్ డ్రెస్ లో వీరిద్దరినీ చూస్తూ ఉంటే మతి పోతుందని, ఒకేసారి ఇద్దరి అందం చూడ్డానికి రెండు కళ్లు చాలడం లేదు అన్నట్లుగా కొందరు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి మరోసారి ఈ సిస్టర్స్ వైరల్ అవుతున్నారు.

## ఆ హీరోయిన్ల రూట్ ఫాలో అవుతున్న మీనాక్షి చౌదరి.. ఫలితం దక్కుతుందా..

స్టార్ హీరోలు సంవత్సరానికి ఒక్క సినిమా చేయడం కష్టంగా ఉంటే కొందరు హీరోయిన్లు మాత్రం సీజన్ కి రెండు సినిమాలు చొప్పున చేస్తూ ప్రేక్షకులను బాగా ఎంటర్టైన్ చేస్తున్నారు. శృతిహాసన్ లాంటి హీరోయిన్లు పండగ సీజన్ వచ్చిందంటే రెండు మూడు సినిమాలతో థియేటర్లలో సందడి చేస్తున్నారు. ఇప్పుడు ఈ హీరోయిన్ల రూట్ లోనే మీనాక్షి చౌదరి కూడా ఒకే సీజన్లో.. ప్రేక్షకులను వరుస సినిమాలతో పలకరించడానికి సిద్ధపడుతుంది. సినీ ఇండస్ట్రీలో పండగ సీజన్ వచ్చింది అంటే కచ్చితంగా స్టార్ హీరోలో సినిమాలు పడాల్సిందే. లేకపోతే పండగ మజా ఉండనట్టే అంటారు సినీ లవర్స్. మరి సంక్రాంతి కైతే బాలకృష్ణ, మెగాస్టార్ చిత్రాలు విడుదల కావాల్సిందే. తాజాగా ఈ జాబితాలోకి నాగార్జున, వెంకటేష్ కూడా చేరిపోయారు. చాలా సందర్భాలలో ఈ సినిమాలలో హీరోయిన్లు ఒకరే ఉంటారు. తాజాగా విడుదలైన మెగాస్టార్ వాల్తేరు వీరయ్య, నందమూరి బాలకృష్ణ వీరసింహారెడ్డిలో శృతిహాసన్ హీరోయిన్గా నటించి మాంచి క్రెడిట్ దక్కించుకుంది. ఇంతకుముందు సంక్రాంతికి కూడా ఈ ఇద్దరూ ఒకేసారి చిత్రాలు విడుదల చేస్తే సిమ్రాన్ ఈ రెండు సినిమాలలో హీరోయిన్గా చేసి పిచ్చ పాపులర్ అయింది. ప్రస్తుతం మీనాక్షి చౌదరి



కూడా ఇదే రూట్ ఫాలో కాబోతోంది. ఈనెల ఫిబ్రవరిలో రవి తేజ ఈగల్, సైరన్ సినిమాలతో ప్రేక్షకులను పలకరించిన అనుపమ ఆ నెక్స్ట్ మంత్ సిద్దు జొన్నలగడ్డ టిల్లు స్క్వేర్ చిత్రంతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. సౌత్ లో పెద్దగా సినిమాలు లేకపోవడంతో మెల్లిగా నార్త్ లో సెటిల్ అవుతున్న తమన్నా కూడా ఇదే మాదిరిగా డబల్ ధమాకా అందుకుంది. ఆమె నటించిన వేద, స్త్రీ 2 చిత్రాల తర్వాత టాలీవుడ్ లో ఆమెకు క్రేజ్ బాగా పెరిగింది. ఇక మీనాక్షి కూడా సంక్రాంతికి వరుస సినిమాలతో సందడి చేయడానికి సిద్ధపడుతుంది. మెగాస్టార్ విశ్వంభర తో పాటు వెంకీ అనిల్ రావిపూడి కాంబోలో తెరకెక్కుతున్న చిత్రంలో కూడా మీనాక్షి చౌదరి హీరోయిన్గా నటిస్తుంది. ఈ రెండు చిత్రాలు ఇంచుమించు ఒకే సమయంలో విడుదల అయ్యే అవకాశం ఉంది. విశ్వంభర ఇప్పటికే సంక్రాంతి రిలీజ్ కన్ఫామ్ చేసుకుంది. ఇందులో మీనాక్షి నటించేది చిన్న పాత్ర అయినప్పటికీ మంచి కంటెంట్ ఉన్న పాత్ర అని తెలుస్తోంది. వెంకీ మామ చిత్రం కూడా సంక్రాంతికి అటు ఇటుగా విడుదల అయిపోతుంది. దీంతో ఈసారి సంక్రాంతి స్టార్ హీరోయిన్ గా మీనాక్షి బాగా పాపులర్ అవుతుంది అంటున్నారు సినీ విశ్లేషకులు.

Printed, Published & Owned by KOYALKAR RAM DAYANAND, Editor Koyalkar Swetha, Nigha Netram Telugu Daily. H.No. 2-10-91 & 92, Weekly Bazar, Boigally, Nizamabad, Telangana State, Printed at Swetha Offset Printers, H.No. 2-10-91 & 92, Weekly Bazar, Boigally, Nizamabad. e-mail : neeganethram@rediffmail.com. Cel No. 9440090053